




ESTD: 1999
www.voodayam.com

# వుదయం

ఖమ్మం | 01-04-2026 బుధవారం | సంపుటి : 13 | సంచిక : 263 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 1.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously published from Khammam, Hyderabad, Adilabad, Karimnagar, Guntur & Warangal
Follow us on







# విరమణా, రణమా?

## హోర్ముజ్ మూసివేత కొనసాగినా రణరంగం నుంచి తప్పుకునే ఆలోచనలో అమెరికా?



- కలసిరాని బ్రిటన్, ఫ్రాన్స్‌లపై విరుచుకుపడిన ట్రంప్ • హోర్ముజ్ నుంచి మీ చమురు మీరే తెచ్చుకోండని హెచ్చరిక
- ఫ్రాన్స్ వైఖరిపై మండిపాటు • కొనసాగుతున్న అమెరికా, ఇజ్రాయెల్ దాడులు • ఇస్ఫాహాన్‌లో భారీ పేలుళ్లు
- హోర్ముజ్‌లోని ఖేష్మ్ ద్వీపంలో మంచినీటి ప్లాంట్ పై బాంబు దాడి • బాంబును నిర్వీర్యం చేసినట్టు ఇరాన్ ప్రకటన

**వుదయం డెస్క్, మార్చి 31 :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరొక్కసారి యుద్ధ విరమణ గురించి మాట్లాడారు. వ్యూహాత్మకంగా కీలకమైనహోర్ముజ్ జలసంధి చాలా వరకు మూసివేసి ఉన్నప్పటికీ, ఇరాన్‌పై వాషింగ్టన్ సైనిక చర్యను ఉపసంహరించుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నాననే సూచనలు దండిగా ఇచ్చారు. అదే సమయంలో ఇరాన్ కీలక సైనిక కేంద్రాలపై దాడులను ముమ్మరం చేయించారు. అంతిమ ప్రయత్నంగా ఇరాన్ ను కాళ్ల భేరానికి రప్పించుకోవచ్చుననే భ్రమ ఏదో ఆయనను వెన్నాడుతున్నట్టు కనిపిస్తున్నది. స్వదేశంలో పెట్రోల్ ధరలు పెరిగాయి. ఏకపక్షంగా ఇరాన్ పై యుద్ధానికి వెళ్లడాన్ని అమెరికన్లు బొత్తిగా ఇష్టపడడం లేదు. ఇంకొకవైపు ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం తీవ్రమవుతున్నది. ఈ నేపథ్యంలో రణమా, విరమణా అనే సందేహంలో చిక్కుకొని ట్రంప్ అయోమయంలో పడినట్టు అర్థమవుతున్నది. ట్రంప్ సూచించినట్లు ప్రభుత్వ అధికారులు తెలిపినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. సంఘర్షణ కీలక దశలోకి ప్రవేశిస్తున్న తరుణంలో, ట్రంప్ వైఖరి ప్రాధాన్యతలలో మార్పుకు అవకాశాన్ని సూచిస్తోంది. ఈ చర్య సమీప భవిష్యత్తులో కీలకమైన సముద్ర మార్గంపై ఇరాన్ నియంత్రణను కొనసాగించేలా చేయవచ్చు, అదే సమయంలో అమెరికా మిత్రదేశాల నేతృత్వంలో దానిని పూర్తిగా తిరిగి తెరవాలనే ఏ ప్రయ



త్నాన్నైనా, బహుశా తర్వాతి దశకు నెట్టివేస్తుంది. ఇటీవలే, జలసంధిని తిరిగి తెరవడానికి చేపట్టే ప్రత్యక్ష సైనిక చర్య, నాలుగు నుండి ఆరు వారాల కాలపరిమితిని మించి ఉండే అవకాశం ఉందని ట్రంప్, ఆయన సీనియర్ సహాయకులు నిర్ధారించారు. దానికి బదులుగా, క్రియాశీల ఘర్షణలను తగ్గించే ముందు, ఇరాన్ నావికా సామర్థ్యాలను బలహీనపరచడం, దాని క్షిపణి ఆయుధాగారాన్ని నాశనం చేయడం వంటి కీలక సైనిక లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు.

సైనిక ఒత్తిడిని దౌత్యంతో కలిపి, జల మార్గం ద్వారా స్వేచ్ఛా వాణిజ్య ప్రవాహాన్ని పునరుద్ధరించాలని తెహ్రాన్‌ను కోరడంపైనే ఈ వ్యూహం ఆధారపడి ఉందని వారు తెలిపారు.

మిగతా 2లో

### హోర్ముజ్ ద్వారా మీ చమురు
## మీరే తెచ్చుకోండి
### యూరోప్ దేశాలకు ట్రంప్ హెచ్చరిక

**వుదయం డెస్క్, మార్చి 31 :** పశ్చిమ ఆసియా యుద్ధంలో చేరకుండా, ఇంధన కొరతతో ఇబ్బంది పడుతున్న దేశాలు హోర్ముజ్ జల సంధి ద్వారా తమ చమురును తామే తెచ్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం అన్నారు. జోక్యం చేసుకోవడానికి నిరాకరించిన దేశాలు కొంత ఆలస్యమైన ధైర్యాన్ని కూడగట్టుకుని, జలసంధి వద్దకు వెళ్లి దానిని స్వాధీనం చేసుకోవాలనీ, అమెరికా వారికి సహాయం చేయదనీ ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్ట్‌లో వ్యాఖ్యానించారు. మీరు మాకు అండగా లేనట్లే, అమెరికా ఇకపై మీకు సహాయం చేయడానికి ఉండదు. ఇరాన్ దాదాపుగా నాశనమైపోయింది. కష్టమైన పని అయిపోయింది. వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి,

మిగతా 2లో

# సిమెంటు ధరల మంట

### బస్తాకు రూ.30 నుంచి 50 వరకు పెంపు • బుకింగ్స్ నిలిపివేసిన సిమెంట్ కంపెనీలు

**హైదరాబాద్, మార్చి 31 (ఎఎంఎస్) :** భవన, ఇతర నిర్మాణాలు భారం కానున్నాయి. నేటి నుంచి దేశవ్యాప్తంగా సిమెంట్ ధరలు భారీగా పెరిగాయి బస్తాపై గణనీయమైన ధరలను పెంచుతున్నట్లు ఇప్పటికే సిమెంట్ కంపెనీలు సంబంధిత డీలర్లకు సమాచారం అందించాయి. ఈ పెరిగిన ధరలు నేటి నుంచి అమలులోకి రానున్నాయి. సిమెంట్ బస్తా (50 కేజీలు) ధరపై రూ. 30 నుంచి రూ. 50 వరకు పెరిగింది. దీంతో ప్రముఖ కంపెనీల సిమెంట్ బస్తా ధర మార్కెట్లో సుమారు రూ. 360కి చేరింది. రవాణా ఖర్చులు పెరగడం, ముడి సరుకుల ధరల పెంపు వంటి కారణాలతో కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించాయి. మరో



వైపు ధరల పెంపు నేపథ్యంలో సిమెంట్ కంపెనీలు మంగళవారం నుంచే కొత్త బుకింగ్‌లను పూర్తిగా నిలిపివేశాయి. పాత ధరలపై మార్చి 30 వరకు మాత్రమే ఆర్డర్లు తీసుకున్నాయి. మంగళవారం సిమెంట్ కొనుగోలు, బుకింగ్ చేయాలని కోరిన డీలర్లకు కంపెనీలు నిరాకరించాయి. నేటి నుంచి పెరిగిన కొత్త ధరలతోనే బుకింగ్స్ ప్రారంభిస్తామని ప్రకటించాయి. కేవలం సిమెంట్ ధరలే కాకుండా, ఇటీవల ఇటుకలు, ఇసుక , కూలీల రేట్లు కూడా పెరుగుతూ వస్తున్నాయి. ఇప్పుడు సిమెం ట్ ధర కూడా బస్తాకు రూ. 50 వరకు పెరగడంతో ఒక సాధారణ ఇంటి నిర్మాణ వ్యయం రూ.వేలల్లో పెరిగే అవకా శం ఉంది. ఇప్పటికే నిర్మాణాలు ప్రారంభించిన వారు , కొత్తగా ఇల్లు కట్టుకోవాలనుకునే వారు ఈ అదనపు భారాన్ని మోయాల్సి వస్తుంది.

# మూసీపై జనవాణి

- ప్రజాస్వామ్య పద్ధతిలో పునర్జీవనం
- 15 రోజులపాటు ఆన్ లైన్ లో ప్రజాభిప్రాయం
- విలువైన సూచనలు చేసిన వారితో సబ్ కమిటీ భేటీ
- అధికారులకు 24/7 సబ్ కమిటీ అందుబాటులో సభ్యులు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

### రేపటి నుంచి గ్రామ సభలు 2




**హైదరాబాద్, మార్చి 31 (వుదయం ప్రతినిధి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా తీసుకున్న మూసి పునర్జీవనం పనులు ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతాయని డిప్యూటీ సీఎం, మూసి క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క వెల్లడించారు. మార్చి 31 నుంచి ఈ నెల 15 వరకు మూసి పునర్జీవనంపై ఆన్ లైన్ లో musrirdc@gmail.com మెయిల్ ఐడి ద్వారా ప్రజల అభిప్రాయాలు స్వీకరిస్తామని తెలిపారు.

మిగతా 2లో

# క్యాన్సర్ కౌగిట్లో రాష్ట్రం

- 2026 చివరి నాటికి కొత్తగా 46,762 కేసులు నమోదు
- మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ముప్పు ఎక్కువ
- పొగాకు వాడకంతో పురుషుల్లో 58.8 శాతం కేసులు నమోదు
- నిర్ధారణ జాప్యంతో ప్రమాదకర పరిస్థితులు
- ఐసీఎంఆర్ నివేదికలో కీలక అంశాలు వెల్లడి



**హైదరాబాద్, మార్చి 31 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణపై క్యాన్సర్ పంజా విసురుతోంది. మునుపెన్నడూ లేని విధంగా కేసులు భారీగా నమోదవుతున్నాయి. సకాలంలో వ్యాధి నిర్ధారణ, చికిత్సలో జరుగుతోన్న జాప్యంతో ప్రాణాలకు ముప్పు పొంచి ఉంది. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది చివరి నాటికి కొత్తగా 46,762 కేసులు నమోదయ్యే అవకాశం ఉందని ఐసీఎంఆర్ నివేదిక వెల్లడించింది. మహిళల్లో రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ ముప్పు ఎక్కువగా ఉన్నా.. స్క్రీనింగ్ రేటు 4 శాతం కంటే తక్కువగా ఉండటం ఆందోళనకరంగా ఉంది. పొగాకు వాడకంతో పురుషుల్లో 58.8 శాతం కేసులు నమోదవుతున్నాయని నివేదిక ద్వారా వెల్లడైంది. వ్యాధిని ముందస్తుగా గుర్తించకపోవడంతో చికిత్స ఫలితాలు ఆశాజనకంగా ఉండటం లేదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముందస్తు పరీక్షలు చేయించుకోకపోవడంతోనే చాలా మంది రోగులు వ్యాధి ముదిరిన తర్వాత ఆస్పత్రులకు వస్తున్నారని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేసే అవకాశం ఉన్నప్పటికీ.. ఆలస్యం కావటంతో చికిత్స క్లిష్టతరంగా మారుతోందన్నారు. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా స్క్రీనింగ్ కార్యక్రమాలను ముమ్మరం చేయాలని.. పొగాకు నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

**యేటా వేలల్లో కేసులు..** క్యాన్సర్ బాధితుల సంఖ్య ప్రతి ఏడాది వేలల్లో పెరుగుతున్నా.. ముందస్తు పరీక్షల పట్ల ప్రజల్లో అవగాహన లోపించడం ఆందోళన కలిగిస్తోంది. దీనిపై తెలంగాణ క్యాన్సర్ బర్డెన్ ప్రొఫైల్-2026 పేరుతో ఐసీఎంఆర్ విడుదల చేసిన తాజా నివేదిక దిగ్భ్రాంతికర నిజాలను వెల్లడించింది. తెలంగాణలో క్యాన్సర్ కేసులు ప్రమాదకర స్థాయిలో పెరుగుతున్నాయని హెచ్చరించింది.

మిగతా 2లో



# 11న పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ

### ట్యాంకు బండ్ పై చేపట్టనున్నట్టు మంత్రి పొన్నం వెల్లడి

### బిసిలు ఐక్యంగా సాగాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, మార్చి 31 (వుదయం ప్రతినిధి) :** రాష్ట్రంలోని బీసీ వర్గాలు తమ అభ్యు న్నతి కోసం ఐక్యతతో ముందుకు సాగాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. బీసీల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం చేపడుతోన్న కార్యక్రమాలకు అండగా నిలవాలన్నారు.



### బీహార్ గుడిలో
# తొక్కిసలాట
### 8 మంది దుర్మరణం



**వుదయం డెస్క్, మార్చి 31 :** బీహార్‌లోని నలందలో ఉన్న శీతలా మాత ఆలయం వద్ద మంగళవారం అధిక రద్దీ కారణంగా జరిగిన తొక్కిసలాటలో కనీసం ఎనిమిది మంది మరణించగా, మరో 12 మంది గాయపడ్డారు. ఈ నేపథ్యంలో బాధితుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.6 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రకటించారు. సాధారణంగా మంగళవారాలు భారీ జనసందోహంతో ఉంటాయి కనుక, పూజలు చేయడానికి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయం వద్ద గుమిగూడారు. భక్తులు తొక్కిసలాట నుండి తప్పించుకునే ప్రయత్నంలో ఈ ఘటనకు జరిగింది. మృతులలో ఇద్దరిని మధురాపూర్ నూర్స రాయ్‌కు చెందిన దినేష్ రజక్ భార్య రీటా దేవి (50), కమలేష్ ప్రసాద్ భార్య రేఖా దేవి(45) గా గుర్తించారు. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి, అనంతరం పెద్ద ఆసుపత్రికి మార్చారు. ఈ ఘటన తర్వాత ఆలయ ప్రాంగణాన్ని ఖాళీ చేయించి, అధికారులు ప్రాంగణాన్న, దానికి అనుబంధంగా జరుగుతున్న జాతరను మూసివేశారు.

మిగతా 2లో

# 6 రాష్ట్రాలకు రూ.1500 కోట్లు

### తెలంగాణకు రూ. 247.94 కోట్ల అన్‌టైడ్ గ్రాంట్స్
### 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు విడుదల చేసిన కేంద్రం

**హైదరాబాద్, మార్చి 31 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు మంగళవారం రూ. 1,500 కోట్లకు పైగా గ్రాంట్లు విడుదల చేసింది. అయితే ఈ నిధులను జీతాలకు కాకుండా కేవలం అభివృద్ధి పనులకే వినియోగించాలని నిబంధన విధించింది. దీంతో ఆయా రాష్ట్రాల్లోని గ్రామాల్లో అభివృద్ధి పనుల ఆర్థిక వెసులుబాటు కలిగింది. ఇందులో భాగంగా తెలంగాణ పంచాయతీరాజ్ సంస్థలకు రూ. 247.94 కోట్ల అన్‌టైడ్ గ్రాంట్స్ కేటాయించింది. ఈ నిధులతో రాష్ట్రంలోని 12600 గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పన జరగనుంది. ఇవి అన్‌టైడ్ గ్రాంట్స్ కావడంతో, స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభలు నిర్ణయించిన ప్రాధాన్యత పనులకు ఈ నిధులను ఖర్చు చేసే వెసులుబాటు ఉంటుంది. గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, మురుగునీటి కాల్వల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, శ్మశాన వాటికల నిర్వహణ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు ఊతమివ్వనున్నాయి. అయితే ఈ నిధులను కేవలం అభివృద్ధి పనులకే వాడాలని, సిబ్బంది జీతాలు లేదా కార్యాలయ నిర్వహణ



ఖర్చులకు వినియోగించరాదని కేంద్రం స్పష్టమైన నిబంధనలు విధించింది. కాగా అత్యధికంగా మహారాష్ట్రకు రూ. 800 కోట్లు కేటాయించగా.. రాజస్థాన్‌కు రూ. 315.61 కోట్లు విడుదలయ్యాయి. ఉత్తరాఖండ్‌కు రూ. 91.31 కోట్లు, మేఘాలయకు రూ. 49.20 కోట్లు అందాయి.

#### నిధులు పక్కదారి పట్టకుండా

గతంలో నిధుల వినియోగంలో జరిగిన జాప్యం, మళ్లింపు ఆరోపణల నేపథ్యంలో కేంద్రం ఇప్పుడు కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ప్రతి పైసా ఆడిట్ కావాలని, గ్రామ పంచాయతీలు తమ అభివృద్ధి ప్రణాళికలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించింది. తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ నిధులను సకాలంలో పంచాయతీలకు చేరవేసి, గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. పల్లె ప్రగతిలో ఈ నిధులు కీలక పాత్ర పోషించనున్నాయి. కాగా, గతేడాది డిసెంబర్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగ్గా.. పల్లెల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. దాదాపు రెండేళ్లు ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు ఉండగా.. పాలకవర్గం కొలువుదీరటంతో అభివృద్ధి పనులు స్పీడ్‌గా కొనసాగుతున్నాయి.

### ఇండిగోకి కొత్త సిఈవో విలియం వాల్ష్



### 5 సంక్షోభం నుంచి గట్టెక్కించేనా?

# చర్చను అడ్డుకున్న బిఆర్ఎస్

- అన్ని వర్గాల సంక్షేమ బాధ్యతను భుజాన వేసుకున్న సర్కార్
- తల్లిదండ్రులు, ఉద్యోగులు, ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాలు
- మూసీ డీపీఆర్ చర్చకు రాకుండా డ్రామా
- కేంద్ర మంత్రి ప్రకటనతో కాళేశ్వరం అవినీతి తేటతెల్లం
- మీడియాతో ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**11 బిల్లుల్లో పదింటికి ఆమోదం**

**హైదరాబాద్, మార్చి 31 (ఎఎంఎస్) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉద్యోగులు, ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టాలు రూపొందించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. గత నెల 31న అసెంబ్లీలో ప్రభుత్వం 11 బిల్లులను ప్రవేశపెట్టగా, అందులో 10 బిల్లులు ఆమోదం పొందాయని వివరించారు. ప్రజల సంక్షేమం దృష్ట్యా ఈ బిల్లులను తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. మంగళవారం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. సమాజంలో ప్రేమాభిమానాలు పెంపొందించే లక్ష్యంతో చర్యలు తీసు



కుంటున్నామ న్న యెన్నం... మత సామరస్యాన్ని కాపాడుతూ, విద్వేషపూరిత నేరాలను అరికట్టే బిల్లు ప్రవేశపెట్టామని చెప్పారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో న్యాయవాదులు అన్యాయానికి గురయ్యాయనీ వారిపై దాడులు జరిగినా సరైన రక్షణ ఇవ్వలేదని ఆరోపించారు.

మిగతా 2లో

# మమ అనిపించారు

### తూతూ మంత్రంగా అసెంబ్లీ

### మీడియాతో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు



**హైదరాబాద్, మార్చి 31 (వుదయం ప్రతినిధి) :** శాసనసభ సమావేశాలు ఒక దిశా నిర్దేశం లేకుండా ముగిశాయని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. ఆరు గ్యారెంటీలపై స్పష్టత వస్తుందని, ప్రజా సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించిన రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం తీవ్ర నిరాశనే మిగిల్చిందన్నారు. బడ్జెట్, బిల్లులు పాస్ చేసుకోవడానికి, రాజ్యాంగ అనివార్యతను పూర్తి చేయడానికి మాత్రమే తూతూ మంత్రంగా సభను నడిపారని విమర్శించారు. నిజమైన ప్రజా సమస్యలు చర్చించడానికి ప్రభుత్వం కనీసం ముందుకు రాలేదని ఆరోపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న 19 సమస్యలపై షార్ట్ డిస్కషన్ కోసం బీఆర్ఎస్ పక్షాన నోటీసులు ఇచ్చినా, ఏ ఒక్క అంశం పైనా ప్రభుత్వం చర్చకు రాలేదని దుయ్యబట్టారు.

మిగతా 2లో

# శ్రీశైలంలో ఏపి జల దోపిడీ




- జలాశయంలో తన వాటా తగ్గినా అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి
- అక్కడ తెలంగాణకు 64 శాతం భాగం ఉంది
- రైతుల హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం : మంత్రి జూపల్లి

**హైదరాబాద్, మార్చి 31 (వుదయం ప్రతినిధి) :** శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా ఆంధ్రప్రదేశ్ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో మా పంటలు ఎండుతుంటే మీరు ఎలా విద్యుత్ ఉత్పత్తి చేస్తారని మండిపడ్డారు. తాగడానికి కూడా నీళ్లు లేకుండా చేస్తారా అని నిలదీశారు.

శ్రీశైలంలో నీటి దోపిడీని గత ప్రభుత్వం పట్టించుకోలేదన్న మంత్రి... ఆ తప్పిదాలను ఏపీ ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని ధ్వజమెత్తారు. తెలంగాణ రైతుల హక్కుల కోసం సమిష్టిగా పోరాడుతామని హెచ్చరించారు. మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి కేటాయింపుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. అందుకు ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ - ప్రజా ప్రతినిధులం సిద్ధంగా ఉన్నామని చెప్పారు. శ్రీశైలంలో తెలంగాణకు 64 శాతం వాటా ఉందన్నారు. ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల రైతుల హక్కులు కాలరాస్తే ఊరుకోబోమన్నారు. నీటి నిల్వలు తక్కువగా ఉంటే విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయాలనే నిబంధనలు ఉన్నా ఏపీ మాత్రం అందుకు భిన్నంగా అక్రమంగా నీటిని వాడుతోందని దుయ్యబట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో ఇలాగే అక్రమంగా నీటిని తరలించుకుపోయిందని, మేం ధర్నా చేస్తాం అనే వరకు నీళ్లు దోచుకుందన్నారు. నాడు తాము హైకోర్టుకు వెళ్లడంతో న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు.

రెండు రాష్ట్రాల మధ్య నీటి కేటాయింపులు ఇంకా జరగలేదన్నారు. ఈ విషయంలో సమాచారం ఇవ్వక పోవడానికి ఏమైనా చదువురాని వారా? అని ప్రశ్నించారు. జీవోలు ఉన్నా ఇంకా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఏముందన్నారు. తెలంగాణ ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసిందన్న జూపల్లి... చట్టప్రకారం నడుచుకోవాలని ఏపీ ప్రభుత్వానికి సూచించారు.

# చిక్కుల్లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

- ఈ నెల 4న విచారణకు రావాలని సీఐడీ నోటీసులు
- కరీంనగర్ సీపీ గౌస్ ఆలంపై వివాదాస్పద వ్యాఖ్యలపై ఎంక్వైరీ
- అసెంబ్లీలో కడియంకు బెదిరింపుపై చర్యలకు దిశగా సర్కార్



**హైదరాబాద్, మార్చి 31 (ఉదయం ప్రతినిధి):** వివాదస్పద ఎమ్మెల్యేగా గుర్తింపు పొందిన హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చుట్టు ఉచ్చు బిగిస్తోంది. వరుస వ్యాఖ్యలతో చిక్కుల్లో పడ్డ ఆయనపై దర్యాప్తు సంస్థలతో పాటు ప్రభుత్వము చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసింది. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని బెదిరించారన్న ఆరోపణలు ముమ్మరమవుతున్న ఆయనపై ప్రభుత్వం చర్యలకు సిద్ధమైంది. తాజాగా.. కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేసులో ఆయనకు సీఐడీ నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల ఏప్రిల్ 4న హైదరాబాద్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని మంగళవారం జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది. కాగా గత కొంతకాలంగా అధికార పక్షంపై నిప్పులు చెరుగుతున్న కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు రావడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. ఇది కక్షపూరిత చర్య అని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తున్నాయి. అధికార కాంగ్రెస్ మాత్రం చట్టం తన పని తాను చేసుకుపోతుందని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని అంటోంది.

### అసలు కేసు ఇది...

ఈ ఏడాది జనవరి 29న వీణవంక మండలంలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా బందోబస్తులో ఉన్న పోలీసులకు, ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు తనను, తన కుటుంబాన్ని జాతర వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారని కౌశిక్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను ఉద్దేశించి ఆయన మతంపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో స్థానిక పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసును ప్రభుత్వం సీఐడీకి అప్పగించింది. ఈ క్రమంలోనే సీఐడీ అధికారులు తాజాగా నోటీసులు జారీ చేశారు. ఏప్రిల్ 4న జరిగే విచారణలో కౌశిక్ రెడ్డి వివరణ తీసుకోనున్నారు.

### ప్రజల కోసం పోరాడుతూనే ఉంటా...

సీఐడీ నోటీసులపై ట్విట్టర్ వేదికగా స్పందించిన పాడి కౌశిక్ రెడ్డి ప్రశ్నించే గొంతును అణచలేరని.. ప్రజల కోసం తన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. ఏ తప్పు చేయకపోయినా నోటీసులు పంపారని.. ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. ఎన్ని నోటీసులు ఇచ్చినా.. తాను వెనక్కి తగ్గేది లేదని ట్వీట్ చేశారు. 'ఏ తప్పు చేయకపోయినా ఏదో ఒక విధంగా ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశంతో నాకు, నా కుటుంబానికి, మా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు సీఐడీ నోటీసులు ఇవ్వడం ఎంతో బాధాకరం. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతో నా కుటుంబ సభ్యులను ,మా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులను ఇలా బెదిరింపులకు గురిచేయడం తగునా? రాజకీయాలు నాపై చేయండి.. కానీ నా కుటుంబాన్ని, మా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం? రేవంత్ రెడ్డి గారు.. నన్ను లక్ష్యంగా చేసుకోండి.. నాపై కేసులు పెట్టండి.. నాకు నోటీసులు ఇవ్వండి.. కానీ నా కుటుంబాన్ని, నా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టడం మాత్రం బాధాకరం. అయినా సరే.. నన్ను ఎన్ని ఇబ్బందులు పెట్టినా.. ఎన్ని నోటీసులు ఇచ్చినా..నేను వెనక్కి తగ్గను. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు.. ప్రజల తరఫున మిమ్మల్ని ప్రశ్నిస్తూనే ఉంటాను. నిలదీస్తూనే ఉంటాను. ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు. ప్రజల కోసం చేసే బాధ్యత. ప్రశ్నించే గొంతును అణచలేరు..ప్రజల కోసం నా పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.' అని కౌశిక్ రెడ్డి ట్వీట్ చేశారు.

# సినీ యాక్టర్లందరూ డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలి

**టెస్ట్ చేయించుకోని యాక్టర్లు.. డ్రగ్స్ తీసుకున్నట్లే**
**జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**



**హైదరాబాద్, మార్చి 31 (ఉదయం ప్రతినిధి) :** సినీ నటీనటులందరూ డ్రగ్స్ టెస్ట్ చేయించుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి సంచలన డిమాండ్ చేశారు. డ్రగ్స్ టెస్ట్ చేయించుకుంటేనే వారి సినిమాల విడుదలకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. డ్రగ్స్ టెస్ట్ చేయించుకోని యాక్టర్లు.. డ్రగ్స్ తీసుకున్నట్లే అని హాట్ కామెంట్స్ చేశారు. తాను ఎవర్నీ తప్పు బట్టడం లేదని.. అందరూ బాధ్యతగా ఉండాలని అనుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కూడా మద్యం తాగొద్దని భర్తలతో భార్యలు ఒట్టువేయించుకోవాలని కోరారు. . మంగళవారం గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీలో ఇప్పపువ్వు సారాపై తాను మాట్లాడితే ట్రోలింగ్ చేశారని మండిపడ్డారుఇప్ప పువ్వు సారాపై తాను చేసిన వ్యాఖ్యలపై జరుగుతోన్న ట్రోలర్స్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ నాయకుడిగా తాను సారా గురించి మాట్లాడితే ట్రోల్స్ చేస్తున్నారన్న ఆయన ఇదే సారాను ఖుషీ సినిమాలో పవన్ కల్యాణ్ తాగుతున్నట్లు నటిస్తే జనాలు ఈలలు కేకలు వేశారన్నారు. బాలకృష్ణ ఏకంగా 'మామ ఏక్ పెగ్ లా' అనే పాటకు డ్యాన్స్ చేసినా ఎంజాయ్ చేశారన్నారు. అదే మేము ప్రజల ఆరోగ్యం గురించి ఇప్పపువ్వు ప్రస్తావన తీసుకొస్తే ట్రోల్స్ చేస్తున్నారనీ ఇది సరైన పద్దతి కాదని అనిరుధ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# చర్చను అడ్డుకున్న బిఆర్ఎస్

మొదటి పేజీ తరువాయి..

తమ ప్రభుత్వంలో లక్షలాది న్యాయవాదులకు రక్షణ కల్పించే చట్టాన్ని తీసుకొచ్చినట్లు వివరించారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం రూ.15 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని రూపొందించిందన్న యెన్నం... 75 ఏళ్లు దాటి రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమం అమలు చేస్తామని వెల్లడించారు. అలాగే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించిన డీపీఆర్ సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కానీ ఆ డీపీఆర్ అంశం చర్చకు ముందుకు రాకుండా బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. గతంలో వివక్షకు గురైన శ్రీధర్ బాబు, భట్టి విక్రమార్క వంటి నాయకులు ఇప్పుడు సభను సమర్థంగా నడిపిస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షాలకు సమయం ఇవ్వలేదని విమర్శించిన బీఆర్ఎస్, అసెంబ్లీలో చర్చలకు ముందుకు రాలేదన్నారు. మెట్రో రైల్ నిధుల అంశంపై కూడా బీఆర్ఎస్ హాజరు కాలేదని విమర్శించారు. అసెంబ్లీలో బడ్జెట్ పత్రాలను చింపి సభ గౌరవాన్ని దిగజార్చే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై చర్చ జరగకుండా సభను అడ్డుకున్నారన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలకు చేరితే ప్రభుత్వం మంచి పేరు వస్తుందని భయంతో బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. గల్ఫ్ కార్మికుల సమస్యల చర్చలపైనా బీఆర్ఎస్ స్పందించడం లేదన్నారు. గడ్డి మందు నిషేధంపై చర్చకు ఎందుకు దూరంగా ఉంటోందో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. రైతుల తీర్మానం నుంచి పారిపోయిన బీఆర్ఎస్ రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఎద్దేవా చేశారు. నోటీసుల పేరుతో సభను అడ్డుకోవడం బీఆర్ఎస్ కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కాళేశ్వరం అవినీతి అంశంపై కేంద్ర మంత్రి చేసిన వ్యాఖ్యలతో నిజాలు బయటపడుతున్నాయని చెప్పారు. ఆ అంశంలో తమ కుంభకోణం బయట పడుతుందనే భయంతో బీఆర్ఎస్ చర్చకు దూరంగా ఉంటోందని ఆరోపించారు.


# మూసీపై జనవాణి

మొదటి పేజీ తరువాయి..

ఆన్ లైన్ లో వచ్చిన విలువైన సలహాలు, సూచనలను అన్నింటిని అధికారులతో కూర్చొని విశ్లేషించుకుంటామన్నారు. ఆ తర్వాత అభిప్రాయాలు వెల్లడించిన వారితో నేరుగా సబ్ కమిటీ సభ్యులు దశలవారీగా సంప్రదింపులు జరుపుతారన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మంత్రి, మూసి క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యుడు పొన్నం ప్రభాకర్ తో కలిసి మూసి పునర్జీవనం పనుల ప్రగతిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసి నది ఒడ్డున ఓంకారేశ్వర ఆలయం పనులకు గత నెల 28న శంకుస్థాపన జరిగిందన్నారు. ఆ రోజు నుంచి మూసి ఫేస్ -1, ఫేస్- 2 వరకు చేయాల్సిన పనులకు సంబంధించిన రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. డిఫెన్స్ భూములు, మూసి పునరావాసితులతో సంప్రదింపులు, నిర్మాణ డిజైన్లు తుది దశకు తీసుకురావడం, బ్యాంకర్స్ తో మాట్లాడటం ఇలా పనులను ఎక్కడికి అక్కడ విభజన చేసుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు భట్టి సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి యావత్ క్యాబినెట్ సంకల్పాన్ని అర్థం చేసుకొని అధికారులు ఉత్సాహంగా ముందుకు వెళ్లాలన్నారు. మీ జీవితాల్లో ఈ ప్రాజెక్టు ఒక మైలు రాయిగా నిలుస్తుందని అధికారులకు సూచించారు. అధికారులకు ఎలాంటి సలహా, సూచన ఇతర ఏ అవసరాలు ఉన్నా మూసి సబ్ కమిటీ సభ్యులు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ సీఎస్ రంజన్, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి. ఇవి. నరసింహారెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అధికారులు వినయ్ కృష్ణారెడ్డి , అశోక్ రెడ్డి, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, మన చౌదరి, జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్ పాల్గొన్నారు.

# తెలంగాణలో 'బాబు' పాలన

**రాష్ట్ర పాలనను సీఎం.. ఆంధ్రా పాలకులకు అప్పజెప్పారు**
**బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**




**హైదరాబాద్, మార్చి 31 (ఉదయం ప్రతినిధి) :** ఏ పాలకుల మీదైతే పోరాడి తెలంగాణ సాధించుకున్నామో మళ్లీ ఆ పాలకులే ఇక్కడ రాజ్యమేలుతున్నారని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి నామమాత్రంగా సీఎం కుర్చీలో కూర్చున్నారని.. పరిపాలన మొత్తం ఆంధ్రా పాలకులకే అప్పజెప్పారని అన్నారు. తెలంగాణను పాలిస్తోందని రేవంత్‌రెడ్డి కాదన్న ఆయన చంద్రబాబు డైరెక్షన్‌లో పాలన జరుగుతోందని ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడకూడదనే అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ప్రవేశ పెట్టారని విమర్శించారు.

# క్యాన్సర్ కౌగిట్లో రాష్ట్రం

మొదటి పేజీ తరువాయి..

ప్రతి ఏటా వేల సంఖ్యలో కొత్త కేసులు వెలుగుచూస్తున్నాయని.. అయినా వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించే స్క్రీనింగ్ పరీక్షల రేటు మాత్రం అత్యల్పంగా ఉందని నివేదిక తేటతెల్లం చేసింది. నివేదిక ప్రకారం.. రాష్ట్రంలో 30-49 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న మహిళల్లో కనీసం 4 శాతం మంది కూడా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవడం లేదు. ఇది వేలాది మంది ప్రాణాలను ముప్పులోకి నెడుతోంది. మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ రేటు కేవలం 0.3 శాతంగానే ఉందని నివేదిక వెల్లడించింది. అలాగే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు 3.3 శాతం, నోటి క్యాన్సర్ పరీక్షలు 2.5 శాతం మంది మహిళలు మాత్రమే చేయించుకుంటున్నారు. పురుషుల్లో కేవలం 2.6 శాతం మంది మాత్రమే నోటి క్యాన్సర్ పరీక్షలు చేయించుకున్నారు. నిమ్స్‌తో పాటు మరో 10 హాస్పిటల్స్ నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా ఈ నివేదికను రూపొందించారు. 2026 చివరి నాటికి తెలంగాణలో కొత్తగా 46,762 క్యాన్సర్ కేసులు నమోదవుతాయని అంచనా. ఇందులో పురుషులు 21,252 మంది కాగా.. మహిళలు 25,510 మంది ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య ఏడాదికి 47,314కు చేరుతుందని అంచనా వేస్తున్నారు.



### దశాబ్దంలో 30శాతం వృద్ధి...

దశాబ్ద కాలంలో క్యాన్సర్ కేసుల సంఖ్య 30 శాతం పెరిగింది. 2015లో 40,177గా ఉన్న కేసులు, 2024 నాటికి 52,334 కు చేరడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మహిళల్లో ప్రతి లక్ష మంది జనాభాకు 183.8 మంది క్యాన్సర్ బారిన పడుతుండగా.. పురుషుల్లో ఈ రేటు 141.9గా ఉంది. రాష్ట్రంలో నమోదవుతున్న క్యాన్సర్లలో పొగాకు వాడకం వల్ల వచ్చే కేసులే ఎక్కువగా ఉన్నాయి. పురుషుల్లో 58.8 శాతం, మహిళల్లో 29.7 శాతం క్యాన్సర్లు పొగాకు వల్లే వస్తున్నాయి. ముఖ్యంగా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, గొంతు క్యాన్సర్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. దీనికి తోడు ఊబకాయం, మధుమేహం, బీపీ వంటి జీవనశైలి వ్యాధులు కూడా క్యాన్సర్ ముప్పును పెంచుతున్నాయి. మహిళల్లో పీసీఓడీ, హార్మోన్ల సమస్యలు కూడా క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి.

# పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ

మొదటి పేజీ తరువాయి..

ఈ నెల 11న ట్యాంక్ బండ్ ఐమాక్స్ థియేటర్ ఎదురుగా లేక్ వ్యూ పార్క్ వద్ద మహాత్మా జ్యోతిబాపూలే,సావిత్రి బాయి పూలే విగ్రహాలను ఆవిష్కరించుకోనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అక్కడ కొనసాగుతోన్న నిర్మాణ పురోగతి పనులను మంత్రి కొండా సురేఖ, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, బీసీ సంఘాల సభ్యులతో కలిసిమంత్రి మంగళవారం పరిశీలించారు. అనంతరం ప్రారంభ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహాత్మ జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలేలు మార్గదర్శకులుగా నిలుస్తారని మంత్రి అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే అందించిన మహనీయ సేవలు వెలకట్టలేమని చెప్పారు. అధికారులు పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పనులను వేగవంతంగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్దేశించిన విధంగా పనులను రెండు రోజుల ముందే పనులు పూర్తి ప్రారంభానికి అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చే అతిథులకు సభ ప్రాంగణంలో ఎవరికి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్సీ, ఎస్టీ ,బీ,సీ మైనార్టీ ల ఆశీర్వాదంతో ప్రజా పాలన ప్రభుత్వం వచ్చిందన్న ఆయన ప్రగతి భవన్ కు మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్ గా మార్చుకున్నామని తెలిపారు. జ్యోతిబాపులే సామాజిక న్యాయం కోసం ఎన్నో పోరాటాలు చేశారని , సావిత్రి బాయి పూలే ప్రతి మహిళ చదువుకోవడం కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. ఖైరతాబాద్ సర్కిల్లో దాదాపు రూ. 4 కోట్లతో మహాత్మాజ్యోతిబాలే, సావిత్రి బాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నామని అన్నారు. విగ్రహాలు చూడగానే వారి జీవిత చరిత్ర ప్రజల్లో వారు అందించిన సేవలు, సంస్కరణలు ఆలోచింపజేసేల విగ్రహాలు పెట్టుకుంటామన్నారు. మహిళలు చదువుకోవాలని సావిత్రి బాయి పూలే కృషి ఎంతో గొప్పదని తెలిపారు. వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయం కోసం మహాత్మా జ్యోతిబా పూలే ఎన్నో పోరాటాలు చేశారని అన్నారు. . 11న ఉదయం మీ గ్రామాల్లో జ్యోతి బాపూలే కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని సాయంత్రం సభ కార్యక్రమాన్ని విచ్చేసి విజయవంతం చేయాలని సూచించారు. జ్యోతి బాపులే సావిత్రి బాయి పూలే విగ్రహాలకు ఒక పక్కన ఉక్కు మహిళ ఇందిరా గాంధీ, మరో పక్కన మహనీయుడు బి ఆర్ అంబేద్కర్, ఇటువైపు ఆర్థిక సంస్కరణల నిపుణులు పీవీ నరసింహారావు గారి విగ్రహాలు ఉన్నాయి.. మహనీయులు ఉన్న ఈ ప్రాంతం నేటితరానికి వారి జీవిత చరిత్ర తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అలాగే ఈ మార్గానికి పూలే మార్గ్ గా పెట్టాలని స్థానిక శాసన సభ్యులు దానం నాగేందర్ సూచించారన్నారు. హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైదరాబాద్ జిల్లా వాళ్ళ సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మంత్రి కొండా సురేఖా మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సామాజిక సంస్కర్త, విద్యా ప్రాధాన్యతను ముందుకు తెచ్చి నడిపించారని అన్నారు. అలాగే కుల వివక్షను ఎదుర్కొని సమానత్వం కోసం ఎంతో పోరాడారని అన్నారు. మహిళల విద్య ప్రోత్సాహన, బాల్య వివాహాల నిరోధంలో జ్యోతిబా పూలే, సావిత్రి బాయ్ పూలే కీలక పాత్ర పోషించారని తెలిపారు. 'గులాం గిరి' వంటి రచనల ద్వారా సామాజిక దోపిడీపై పోరాటంతో పాటు బలహీన వర్గాల చైతన్యం పరచటంలో తమ విశ్వసనీయత చాటుకున్నారని చెప్పారు. అలాంటి మహానుభావుల విగ్రహాలు ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమన్నారు.

## ప్రభుత్వ ఔట్‌లెట్లలో

# ఆటో ఎల్‌పీజీని అందుబాటులో ఉంచండి

- రాష్ట్రంలో ఆటో ఎల్‌పీజీ రంగం ప్రభావితం
- డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా వంద శాతం కొనసాగించాలి
- కమర్షియల్ ఎల్‌పీజీ పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలి
- కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్‌కి రాష్ట్ర మంత్రి ఉత్తమ్ లేఖ



**హైదరాబాద్, మార్చి 31 (ఉదయం ప్రతినిధి) :** హైదరాబాద్‌లో ఎల్‌పీజీ ఆటోరిక్షాలు ఎదుర్కొంటున్న గ్యాస్ కొరతపై కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు ఎల్‌పీజీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల కోసం డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా వంద శాతం కొనసాగించాలని కోరారు. కమర్షియల్ ఎల్‌పీజీ పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆటో ఎల్‌పీజీ రంగం తీవ్రంగా ప్రభావితమైందన్నారు. తెలంగాణలో సుమారు ఒక లక్ష ఎల్‌పీజీ ఆటోరిక్షాలు రోడ్లపై నడుస్తున్నాయనీ ప్రభుత్వ సంస్థల (ఐఓసీఎల్, హెచ్ పీ సీఎల్, బీపీసీఎల్) వాటా కేవలం 20శాతం మాత్రమే ఉందన్నారు. ప్రైవేట్ కంపెనీలు 80శాతం మార్కెట్‌ను ఆక్రమించాయని లేఖలో వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 110 ప్రైవేట్ ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉన్నాయన్న మంత్రి.. రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీ కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు డ్రై అవుట్ పరిస్థితి నెలకొందనీ దీంతో ప్రజా రవాణాలో అంతరాయం, ప్రజల్లో ఆందోళన కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కంపెనీలకు పీఎస్ యుల నుంచి సరఫరా అంతరాయం ఏర్పడిందని లేఖలో మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ ఔట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ అందుబాటు ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేట్ కంపెనీలకు తక్షణ సరఫరా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.75, ప్రైవేట్ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.93 వరకు విక్రయిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై నియంత్రణ చర్యలు అవసరమని.. కేంద్రం తక్షణ జోక్యంతో ప్రజా రవాణా సేవలు నిలకడగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# హార్మూజ్ ద్వారా మీ చమురు మీరే తెచ్చుకోండి

మొదటి పేజీ తరువాయి..



అని ఆయన తన ఆగ్రహాన్ని అందులో వ్యక్తం చేశారు. యుద్ధంలో ఫ్రాన్స్ అస్సలు సహాయపడలేదని ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. సైనిక సామగ్రితో ఇజ్రాయెల్‌కు వెళ్తున్న విమానాలను ఫ్రాన్స్ గగనతలం మీదుగా వెళ్లనివ్వలేదు. విజయవంతంగా హతమైన ఇరాన్ కసాయి విషయంలో ఫ్రాన్స్ ఏమాత్రం సహాయపడలేదు! అని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, దేశంలోని చమురు బావులను, విద్యుత్ గ్రిడ్‌ను ధ్వంసం చేస్తామని ట్రంప్ బెదిరించిన తర్వాత, అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు సైనిక స్థావరాలు, క్యాన్సర్ మందుల కర్మాగారం, ఒక మతపరమైన ప్రదేశంపై జరిగాయని ఇరాన్ మీడియా మంగళవారం పేర్కొంది. మధ్య ఇరాన్‌లోని ఇస్ఫాహాన్‌లో కనీసం రెండు భారీ పేలుళ్లు, పొగ స్తంభాలు కనిపించినట్లు ఏఎఫ్‌పీ ధృవీకరించిన వీడియో ఫుటేజ్‌లో వెల్లడైంది. వాయువ్య ప్రాంతంలోని జంజాన్‌లో ఉన్న షియా మత కేంద్రమైన గ్రాండ్ హుస్సేనియా దెబ్బతిన్నట్లు ప్రభుత్వ మీడియా నివేదించింది.


క్యాన్సర్ మందులు, అనస్థీటిక్స్ ఉత్పత్తి చేసే ఒక ఫార్మాస్యూటికల్ ప్లాంట్‌పై వైమానిక దాడులు జరిగాయని ఇరాన్ ప్రభుత్వం కూడా తెలిపింది. అదే సమయంలో, హార్మూజ్ జలసంధిలోని ఖేష్మ్ ద్వీపంలో ఉన్న ఒక డీశాలినేషన్ ప్లాంట్‌పై జరిగిన బాంబు దాడి దానిని పూర్తిగా పనికిరాకుండా చేసిందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారి ఒకరు ఐఎస్ఎన్ఎ వార్తా సంస్థకు తెలిపారు. డీశాలినేషన్ ప్లాంట్‌పై దాడి ఎప్పుడు జరిగిందనేది స్పష్టంగా తెలియలేదు, కానీ నెల రోజులుగా సాగుతున్న ఈ సంఘర్షణలో, తన మౌలిక సదుపాయాలపై జరిపే దాడులకు ప్రతిగా పొరుగు దేశాలపై కూడా దాడులు చేస్తామని ఇరాన్ శపథం చేసింది. పొరుగు దేశాలను కూడా ఈ వివాదంలోకి లాగుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పౌరుల తాగునీటిపై ఏ దాడి అయినా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసి, ఇరాన్ పొరుగు దేశాలను కూడా ఈ వివాదంలోకి లాగుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అయితే, ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చి, లొంగిపోయేలా చేసి, అమెరికా ప్రతిపాదించిన ఒప్పందాన్ని అంగీకరించేలా చేయాలనే ఉద్దేశంతో ట్రంప్ తన తాజా హెచ్చరికలో ఏమాత్రం వెనుకాడలేదు. విరమణ దిశగా కొన్ని సందర్భాల్లో, నౌకాయానాన్ని పునరుద్ధరించకపోతే పౌర ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని ఆయన బెదిరించారు. మరికొన్ని సందర్భాల్లో, అమెరికాకు ఈ జలసంధికి ఉన్న ప్రత్యక్ష ప్రాముఖ్యతను ఆయన తక్కువ చేసి చూపారు, దీని మూసివేత ఇతర ఆర్థిక వ్యవస్థలకు పెద్ద సవాలుగా నిలుస్తుందని సూచించారు.

### తీవ్రమవుతున్న ప్రపంచ ఆర్థిక ప్రమాదాలు...

ప్రపంచ ఇంధన సరఫరాలకు కీలకమైన జలసంధిలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న అంతరాయం ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లలో ప్రకంపనలు సృష్టిస్తోంది. అమెరికాకు కీలక మిత్ర దేశాలతో సహా పలు దేశాలు తగ్గిన ఇంధన ప్రవాహాలతో సతమతమవుతున్నాయి. ఇది ఇంధన ధరలను పెంచుతూ, సరఫరా గొలుసులపై ఒత్తిడిని పెంచుతోంది. వ్యవసాయంలో ఉపయోగించే ఎరువుల నుంచి సెమీకండక్టర్ ఉత్పత్తికి అవసరమైన హీలియం వరకు, కీలకమైన ముడి పదార్థాలపై ఆధారపడిన పరిశ్రమలు, రవాణాకు అంతరాయం కొనసాగుతుండటంతో పలు దేశాలు తీవ్రమైన కొరతను ఎదుర్కొంటున్నాయి. అమెరికా సెక్రెటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో, ప్రస్తుత దశ సైనిక చర్యలు వారాల్లో ముగియవచ్చని అన్నారు. అప్పుడు మనం హార్మూజ్ జలసంధి సమస్యను ఎదుర్కోవాల్సి ఉంటుంది, అని రూబియో అల్ జజీరాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అన్నారు. నిర్ణయం తీసుకోవాల్సింది ఇరాన్, లేదా అమెరికా భాగస్వామ్యంతో ప్రపంచం, ఈ ప్రాంతంలోని దేశాల కూటమి, ఏదో ఒక విధంగా ఆ జలసంధిని తెరిచేలా చూస్తుంది అని ఆయన వ్యాఖ్యానించారు.

# రేపటి నుంచి గ్రామసభలు

**సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం**
**జూన్ 2 నుంచి అమలు చేయనున్న కొత్త పథకాలపైనా**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**
**ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్**



**హైదరాబాద్, మార్చి 31 (ఉదయం ప్రతినిధి) :** ఈ నెల 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్ని జిల్లాల కలెక్టర్లకు సూచించారు. సభలన్నీ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదట సీఎం సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సాధ్యమైనంత వరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అలాగే జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు. ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ, ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

# బీహార్ గుడిలో తొక్కిసలాట

మొదటి పేజీ తరువాయి..



ఈ ఘటనతో ఆలయం, ఆసుపత్రి వద్ద విషాదఛాయలు నెల కొన్నాయి. మృతులంతా మహిళలేనని అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధరీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. బాధిత కుటుంబాలను అన్నిరకాలుగా ఆదుకుంటామని చెప్పారు. విచారణకు ఆదేశం బీహార్ ముఖ్య కార్యదర్శి ప్రతయ అమృత్ ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. పాట్నా డివిజనల్ కమిషనర్, రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌లను నివేదిక సమర్పించాలని ఆయన కోరారు. ఎస్‌డీపీఓతో సహా జిల్లా ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. తొక్కిసలాటకు గల కచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు.

# మమ అనిపించారు

మొదటి పేజీ తరువాయి..

మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం చేసిన మంచి పనులు చెప్పుకోవడానికి ఒక్క ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం కూడా లేని దయనీయ స్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. సభా సాంప్రదాయాలను పూర్తిగా తిలోదకాలిచ్చిన అధికార పార్టీ సభ్యులు... నియమ నిబంధనలు, సభా మర్యాదలను, ప్రతిపక్షాల పట్ల కనీస గౌరవాన్ని తుంగలో తొక్కారని మండిపడ్డారు. ప్రతిపక్షాల విషయంలో రేవంత్ రెడ్డి ప్రవర్తించిన తీరు సభానాయకుడి హోదాకు తగింది కాదన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నించడానికి ప్రతిపక్షం ఉంటుందన్న హరీశ్ రావు... ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రశ్నించడమే ప్రతిపక్ష బాధ్యత అన్నారు. ఆ బాధ్యతను బీఆర్ఎస్ నిర్వహిస్తుంటే కాంగ్రెస్ తట్టుకోలేకపోతోందని దుయ్యబట్టారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజైనా, అప్రాప్రియేషన్ రోజైనా ప్రశ్నోత్తరాల సమయం ఉంటుందన్నారు. కానీ ఈ ప్రభుత్వం ప్రశ్నోత్తరాల సమయాన్ని కూడా ఎత్తివేసిందన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం రోజు, ఆర్థిక మంత్రి బడ్జెట్ పెట్టిన రోజు ప్రశ్నోత్తరాలు లేవన్నారు. సభ జరిగిన రోజుల్లో సగం రోజులు ప్రశ్నోత్తరాలు నడపలేదనీ ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నలు చర్చకు రాకుండా చేశారని ఆరోపించారు. అలాగే ఏ ఒక్కరోజు కూడా అసెంబ్లీని సమయానికి ప్రారంభించలేదని చెప్పారు. బీఏసీ సమావేశంలో సభను ఉదయం 8:30 కి ప్రారంభించాలని అడిగాము, 10 గంటలకు ప్రారంభిస్తామని చెప్పి ఏ రోజూ పదింటికి కూడా మొదలుపెట్టలేదన్నారు. సమయపాలన లేదు, సభ అంటే గౌరవం లేదు. శాసనసభను గాంధీభవన్‌లాగా మార్చేశారని ఫైర్ అయ్యారు. సీఎం ఢిల్లీ నుంచి వస్తున్నాడని ఏకంగా 4 గంటలు టీ బ్రేక్ ఇచ్చిన ప్రభుత్వం ఫైనాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని 3 గంటలపాటు సభను ఆపి వెయిట్ చేయించారన్నారు. ప్రిపరేషన్ ఇంట్లో చేసుకోవాలి కానీ సభకు వచ్చాక చేస్తారా అని నిలదీశారు. కావాలనే రాత్రి ఆలస్యం వరకు సభ నడిపి, సభ్యులు లేకుండా చేయాలని చూశారన్నారు. అసెంబ్లీ పని దినాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. వారం రోజులు సభను పెంచాలని కోరినా ప్రభుత్వం ముందుకు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేరళ ఎన్నికల ప్రచారం కోసం అసెంబ్లీని 30వ తేదీనే హడావుడిగా ముగించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రజలు, ప్రజా సమస్యలు ముఖ్యమా? లేక కేరళ ఎన్నికల ప్రచారం ముఖ్యమా? అని ప్రశ్నించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని సాక్ష్యాధారాలతో సహా సభలో బయటపెడితే.. ప్రజల దృష్టి మరల్చడానికి డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడ్డారనీ రవీంద్రభారతిలో నాటకాలు వేశారన్నారు. అవినీతి నుంచి మంత్రిని కాపాడటానికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను రెండు రోజుల పాటు సస్పెండ్ చేసి, ప్రతిపక్షం లేకుండానే ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకున్నారని విమర్శించారు. హేట్ స్పీచ్ బిల్లును చివరి రోజు తెచ్చి ఎలాంటి చర్చ లేకుండానే ముగించారనీ పద్దులన్నీ చివరి రోజు పెట్టి గిలెటిన్ చేసుకొని పారిపోయారన్నారు. ఇరిగేషన్ పద్దు మీద కూడా కనీస చర్చ లేకుండా పాస్ చేసుకున్నారన్నారు. హౌస్ కమిటీ పనికి రాదని చెప్పి, శాసనసభ్యులకు, శాసనసభకు గౌరవాన్ని తగ్గించారని ఆరోపించారు. చిరుద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీలు సహా అన్ని వర్గాల పక్షాన బీఆర్ఎస్ పార్టీ సభలో ప్రభుత్వాన్ని నిలదీసిందన్నారు.

పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ కాళేశ్వరంపై చేసిన వ్యాఖ్యలను పార్టీ తరపున ఖండించారు. ఆయన వ్యాఖ్యలు అచ్చం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న భాషలాగే ఉన్నాయని ఆరోపించారు. పాటిల్ వ్యాఖ్యలతో బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు కాంగ్రెస్, బీజేపీల ఫెవికాల్ బంధం బయటపడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ. 90 వేల కోట్లు, రూ. లక్ష కోట్లు కొట్టుకుపోయాయని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర మంత్రి ఎలా మాట్లాడుతారని నిలదీశారు. అసలు కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని రకాల అనుమతులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే ఆదర్శం అని కేంద్ర మంత్రులు, అధికారులు కితాబిచ్చారన్నారు. ఇది తెలంగాణకు వరప్రదాయిని అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, తెలంగాణకు ఇది ముక్తేశ్వర ప్రాజెక్టు అని ఆనాటి గవర్నర్ నరసింహన్ కొనియాడిన విషయాలను హరీశ్ రావు గుర్తు చేశారు. కాళేశ్వరం వృథా ప్రాజెక్టు అయితే ఆ ప్రాజెక్టుతో లబ్ధి పొందుతోన్న జిల్లాల్లో పర్యటనకు తమతో కలిసి రావాలని హరీశ్ రావు సవాల్ చేశారు.



# గ్రేటర్ హైదరాబాద్



## నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



**గుమ్మడిదల, మార్చి 31 (ఉదయం):** మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. నూతన బోరు ఏర్పాటు పనులకు శంకుస్థాపన చేశారు. వార్డు కౌన్సిలర్ ఆకుల మాధవి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, కమిషనర్ దశరథ్ భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు మురళి, కిషన్, నరేందర్ రెడ్డి, ప్రమీల, రాజిరెడ్డి పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హుస్సేన్, ఆంజనేయులు యాదవ్, మున్సిపల్ అధికారులు, కాలనీ వాసులు, వివిధ పార్టీల కార్యకర్తలు హాజరయ్యారు.

## షాద్ నగర్ చౌరస్తా విస్తరణకు రంగం సిద్ధం

**షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్**



**షాద్ నగర్, మార్చి 31 (ఉదయం):** ఎంతోకాలంగా షాద్ నగర్ పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న చౌరస్తా విస్తరణ కార్యక్రమం త్వరలోనే అధికారులు చేపట్టే అవకాశాలు ఉన్నాయని షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ స్పష్టం చేశారు. మంగళవారం పట్టణ చౌరస్తాలో హెచ్ఎండిఏ శాఖకు చెందిన ఏఈ విశ్వతేజ సందర్శించి ప్రాంగణాన్ని పరిశీలించారు. చౌరస్తా విస్తరణలో భాగంగా సదర్ ప్రాంతాన్ని తిలకించారు. ఈ సందర్భంగా చౌరస్తా విశేషాలను స్థానిక మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కౌన్సిలర్లు మురళీమోహన్ అప్పి, పెంటయ్య, కళ్యాణ్ కార్ దిలీప్, నాయకులు ముబారక్ అలీ ఖాన్, సాదిక్, వీర్లపల్లి మహబూబ్ తదితరులు వారి వెంట ఉన్నారు. ఎంతోకాలంగా చౌరస్తా విస్తరణ పనులు చేపట్టేందుకు రంగం సిద్ధం అయ్యిందని అయితే అన్ని అవసరాలకు అనుగుణంగా ప్రజల సౌకర్యార్థం చేపట్టబోయే పనులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలబడతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో పట్టణ అభివృద్ధికి పూర్తి సహకారం ప్రజలు వ్యాపారస్తులు అందిస్తున్నారని చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## కాటేదాన్‌లో కల్తీ 'పేస్ట్' గుట్టురట్టు

- 4 వేల కిలోల కల్తీ పేస్ట్ స్వాధీనం
- రూ. 22 లక్షల సామగ్రి సీజ్, నిందితుడి అరెస్ట్

**మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 31 (ఉదయం ప్రతినిధి):** ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతూ, అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో కలుషిత అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న కేంద్రంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. హైదరాబాద్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ పర్యవేక్షణలో మంగళవారం ఖైరతాబాద్ టాస్క్‌ఫోర్స్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో భారీగా కలుషిత పేస్ట్, ముడి సరుకులను స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారంతో పోలీసులు ఐడీఏ కాటేదాన్‌లోని 'ఎస్‌కేఆర్ ఫుడ్ ప్రొడక్ట్స్' (ప్లాట్ నెం. 25)పై ఆకస్మిక దాడి చేశారు. అబిడ్స్ నివాసి అయిన హసన్ అలీ రూపానీ (55) అనే వ్యక్తి ఎటువంటి ఆహార భద్రతా ప్రమాణాల సర్టిఫికేట్ లేకుండా ఈ అక్రమ వ్యాపారం సాగిస్తున్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కుళ్ళిపోయిన అల్లం, వెల్లుల్లి తొక్కలను ఉపయోగిస్తూ ప్రజల ప్రాణాలతో నిందితుడు ఆడుకుంటున్నాడు. పేస్ట్ ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు మరియు రంగు కోసం ఎసిటిక్ యాసిడ్, గ్జాంతమ్ గమ్ పౌడర్ వంటి రసాయనాలను కలుపుతున్నట్లు నిర్ధారించారు. ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వ ఉంచిన ఈ పేస్ట్‌పై ఈగలు, దుమ్ము పేరుకుపోయి ఉండటాన్ని చూసి అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. దీనిని నగరంలోని హోల్‌సేల్ దుకాణాలు, క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తున్నారు. 6,000 కిలోల నాణ్యత లేని వెల్లుల్లి, 210 కిలోల అల్లం, వెల్లుల్లి పొట్టు సంచులను వస్తువులను సీజ్ చేశారు. వీటి విలువ సుమారు రూ. 22 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. 250 కిలోల ఉప్పు, రసాయనాలు, 5 గ్రైండింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సామగ్రిని తదుపరి చర్యల నిమిత్తం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. ఈ ఆపరేషన్‌లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి. రాఘవేందర్, ఎస్సైలు శ్రీకాంత్, విశ్వనాథ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కార దిశగా
# కీలక అడుగు

- మురికి డ్రైనేజీ పనులకు కౌన్సిలర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో ప్రారంభం
- డ్రైనేజీ పక్కన చెత్త తొలగింపు, చెట్ల నరికివేతతో పరిశుభ్రత కార్యక్రమం
- కరెంటు వైర్లకు ప్రమాదం లేకుండా చెట్ల కొమ్మల తొలగింపు
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ



**శంకర్‌పల్లి, మార్చి 31 (ఉదయం)** శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న మురికి డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. డ్రైనేజీ సమస్యలు పూర్తిగా పరిష్కరించే లక్ష్యంతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంగళవారం ఉదయం నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి 7వ వార్డు కౌన్సిలర్ బండ్లగూడెం ప్రశాంత్ ప్రత్యేకంగా హాజరై అధికారులతో కలిసి పనుల ప్రారంభాన్ని పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటం, దుర్వాసన రావడం, దోమల బెడద పెరగడం వంటి సమస్యలు ఎదురవుతున్న నేపథ్యంలో ఈ పనులు చేపట్టడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీ పనులతో పాటు పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించి పరిశుభ్రత కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. డ్రైనేజీ పక్కన ఉన్న చెత్త కుప్పలను తొలగించి, అనవసరంగా పెరిగిన పొదలు, చెట్లను నరికివేసి ప్రాంతాన్ని శుభ్రంగా మార్చారు. ప్రజారోగ్యం దృష్ట్యా పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామని కౌన్సిలర్ ప్రశాంత్ తెలిపారు. అదేవిధంగా డ్రైనేజీ మార్గంలో ఉన్న విద్యుత్ వైర్లకు ప్రమాదం ఏర్పడకుండా, వైర్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టడం ప్రశంసనీయమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు నాయకులు కురుమ శ్రీనివాస్ , వెంకటేష్ గౌడ్, రాములు సెట్ తదితరులు పాల్గొని పనులను పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా డ్రైనేజీ వ్యవస్థను మరింత పటిష్టంగా మార్చి, శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ స్థానిక ప్రజలు తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ప్రశాంత్ మాట్లాడుతూ, "7వ వార్డులో డ్రైనేజీ సమస్యలు ఇకపై పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపుతాం. పరిశుభ్రత, భద్రత, ప్రజల సౌకర్యమే మా లక్ష్యం. ఇచ్చిన మాట ప్రకారం పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం" అని స్పష్టం చేశారు. వార్డును అభివృద్ధి దిశగా నడిపించేందుకు కృషి కొనసాగుతుందని తెలిపారు.





## అభివృద్ధి పనులపై పర్యవేక్షణ



**చేవెళ్ల, మార్చి31(ఉదయం) :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా, చేవెళ్ల మున్సిపల్ పరిధిలో జరుగుతున్న శానిటేషన్ మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలను మంగళవారం ప్రత్యేక అధికారి పద్మావతి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పట్టణంలోని ప్రకృతి వనాలు, స్మశానవాటికలు, వాటర్ ట్యాంకులు, అలాగే కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు పరిశీలించారు. అదేవిధంగా ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశం, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రెడ్డి, ఆర్ఐ, శ్రీనివాస్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారిని కలిసిన ఎస్సీసీఎల్ నాయకులు



**శంకర్‌పల్లి, మార్చి 31 (ఉదయం) :** షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి అల్టూరి లక్ష్మణ్ కుమార్ ను ఎస్సీసీఎల్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ కడమంచి ముత్తయ్య తో పాటు కడమంచి సహదేవుడు కలిసి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. సందర్భంగా బేడ బుడగ జంగాల వర్గానికి సంబంధించిన పలు సమస్యలను అధికారికి వివరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తమ వర్గానికి న్యాయం జరిగేలా సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రత్యేక శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేకంగా బాబు జగజ్జీవరావు కు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెలబ్రేషన్ కమిటీలో బేడ బుడగ జంగాల తరపున ప్రాతినిధ్యం కల్పించాలని వారు అధికారిని కోరారు. ఈ కమిటీలో తమ వర్గానికి ప్రాతినిధ్యం లభిస్తే సామాజిక న్యాయం, సమాన అవకాశాలు మరింత బలపడతాయని కడమంచి ముత్తయ్య, కడమంచి సహదేవుడు పేర్కొన్నారు.

ఈ అంశంపై అధికారి అల్టూరి లక్ష్మణ్ కుమార్ స్పందిస్తూ, వినతిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. బేడ బుడగ జంగాల హక్కులు, సంక్షేమం కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని కడమంచి ముత్తయ్య స్పష్టం చేశారు.

## గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలి



**రంగారెడ్డి, మార్చి 31 (ఉదయం):** ప్రజా పాలన ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి గారి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్ధిదారుల పేర్లు, 200 యూనిట్ల విచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు.

ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ మరియు ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీఆర్ఓ సంగీత, స్పెషల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా రేణుక ఎల్లమ్మ జాతర

- భక్తజన సంద్రంతో కిటకిటలాడిన ఎల్లమ్మ ఆలయం
- క్యూలైన్లో నిలబడి తల్లిని దర్శించుకున్న భక్తులు
- కోరికలు నెరవేరుతున్నాయని భక్తుల విశ్వాసం
- భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసిన గుడి కమిటీ



**శంకర్‌పల్లి, మార్చి 31(ఉదయం ) :** శంకర్‌పల్లి మండలం చెందిప్ప గ్రామంలో ఈరోజు శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి జాతర బ్రహ్మాండంగా, అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామంలో జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు, కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం భక్తజన సంద్రంతో కళకళలాడింది. జాతర సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు. ఎల్లమ్మ తల్లిని దర్శించుకోవడానికి భక్తులు క్యూలైన్లలో నిలబడి క్రమశిక్షణతో దర్శనం చేసుకున్నారు. ఆలయం పరిసర ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొని, గ్రామం మొత్తం పండుగ వాతావరణంతో ఉత్సాహంగా మారింది. ఈ సందర్భంగా భక్తులు ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు భక్తులు బోనాలు సమర్పించగా, మరికొందరు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తల్లి దర్శనం చేసుకున్న తర్వాత ఎంతోమంది భక్తులు ఆనందంతో జాతరలో పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లిని భక్తితో ప్రార్థిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. "ఎల్లమ్మ తల్లి దయతో మా కుటుంబాలకు శుభం కలుగుతోంది. ప్రతి ఏటా జాతరను ఘనంగా నిర్వహిస్తాం" అంటూ గ్రామస్తులు భక్తిశ్రద్ధతో తెలిపారు.

జాతర నిర్వహణలో ఆలయ గుడి కమిటీ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ చూపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూలైన్లు, తాగునీరు, దర్శన ఏర్పాట్లు చక్కగా నిర్వహించారు. భక్తులు కూడా కమిటీ సభ్యుల సేవలను అభినందించారు. గ్రామంలో ఈ జాతరను ప్రతి సంవత్సరం సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. చెందిప్ప గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ జాతర మరింత ఘనంగా కొనసాగాలని భక్తులు తల్లిని ప్రార్థించారు.

## అప్పుల తెలంగాణగా మార్చారు

**కవిత మండిపాటు**

**హైదరాబాద్, మార్చి 31 (ఉదయం ప్రతినిధి) :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. రోజువారీ ఖర్చులకు ఆర్బీఐ దగ్గర చేయి చాచాల్సిన దుస్థితిలోకి రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నెట్టేసిందని దుయ్యబట్టారు. కాగ్ 202425 నివేదికలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వెల్లడించిన అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అధికారంలోకి రాకముందు "సంపద పెంచుతాం.. పేదలకు పంచుతాం" అని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణ మార్చే పనిలో పడిందన్నారు. ఈ మేరకు మంగళవారం ఆమె మీడియాకు ప్రకటన విడుదల చేశారు. 202425 ఆర్థిక సంవత్సరంలో రెండు రోజులు మినహా మిగతా అన్ని రోజులు ఆర్బీఐ నుంచి చేబదులుగా డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని నెట్టుకురావడం సిగ్గుచేటన్నారు. ఏడాది కాలంలో రూ.1.30 లక్షల కోట్లు చేబదులు అప్పులు తెచ్చి సర్కారును నడిపించటమంటే కచ్చితంగా అది చేతకాని తనమేనని విమర్శించారు. ఆర్థిక సంవత్సరం ముగిసినా తెచ్చిన అప్పుల్లో మరో రూ.6 వేల కోట్లు చెల్లించలేదనే విషయాన్ని కాగ్ బట్టబయలు చేసిందన్నారు. నెలకు రూ. 12 వేల కోట్ల సొంత ఆదాయం ఉన్న తెలంగాణలో రోజువారీ కనీస అవసరాల కోసం రూ. 1.38 కోట్ల బ్యాలెన్స్ కూడా మెయింటెన్ చేయలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సంపద పెంచటం మాట అటుంచితే కేవలం అప్పులతోనే కాలం గడుపుతున్నారని విమర్శించారు. ఇప్పటికే అడ్డగోలుగా రూ. 8.65 లక్షల కోట్ల అప్పులు చేసి, రాష్ట్రంలోని ఒక్కో కుటుంబంపై దాదాపు రూ. 9 లక్షల అప్పు భారాన్ని మోపారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంతటి ఆర్థిక సంక్షోభంలో కూడా ఇంకా "మిగులు బడ్జెట్" అని చెప్పుకుంటూ తెలంగాణ ప్రజలను పచ్చి దగా చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఇకనైనా ప్రచార ఆర్భాటాలు బంద్ చేసి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

**నష్టపోయిన రైతులను ఆదుకోవాలి**

అకాల వర్షాలు రైతులను ఆగం చేశాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల్లో అకాల వర్షాల కారణంగా చేతికొచ్చే దశలో ఉన్న పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. వందలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న మొక్కజొన్న, మామిడి కాయలు నేలరాలాయని తెలిపారు. నువ్వులు, పసుపు, వరి పంటలకు తీరని నష్టం జరిగిందన్నారు. అకాల వర్షాల కారణంగా రైతుల కష్టం అంతా నేల పాలైందని విచారం వ్యక్తం చేశారు. సోమవారం అర్ధరాత్రి, మంగళవారం తెల్లవారుజామున కురిసిన అకాల వర్షానికి పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

**IN THE COURT OF THE HON'BLE I JUNIOR CIVIL JUDGE: AT SECUNDERABAD**
**OS NO. 482 of 2022**

**Between:**
State Bank of India, Retail Assets Central Processing Centre -I,SARC Wing, Patny Centre, Secunderabad, Rep. by its Manager
**...Plaintiffs**
**AND**
Mr. Thota Kumar
**...Defendant**

To,
Mr. Thota Kumar S/o Sri Jangaiah Thota R/o H.No. 2-95, Astakameshwari Nagar Kuntur, Pedda Amberpet, Rangareddy, Telangana-501505 O/o Supervisor Information & Reservation Office TSTDC-UN, Tankbund- Hyderabad-63.

Please take notice that the above-named plaintiff instituted the above suit against you as"Defendants for recovery of Rs 3,64,563-00 Ps You are hereby summoned to appear in this"court in person or by pleader duly instructed and able to answer all material questions 16 - 04-"2026 at 10.30 AM. In default of your appearance, the suit will be heard and decided in your"absence.

**(BY ORDER OF THE COURT)**
Sd/-
**D.K. Lakshmi Kumari,**
**Advocate**
**Flat no.304, Manikanta Paradise Apart. Dwarakanagar, Phase-II, Uppal, Hyderabad-39**
**Counsel for the Plaintiff**

**IN THE COURT OF X JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD**
**O.S.No.663 of 2026**

**Between:**
Prince Amar Anand & others
**...Plaintiffs**
**AND**
1.The Tahsildar, Musheerabad Mandal, Hyderabad
2.All concerned
**...Defendant**

**To,**
**ALL CONCERNED**
Please take notice that the Plaintiffs have filed the above suit for declaring them as the legal heirs of Late G. Kanakam Subhushanam, who expired on 25.02.2010 at Hyderabad leaving behind the Plaintiffs viz., 1) Prince Amar Anand 2) G. Cecil Prem Anand and 3) G. Vincent Vinod Anand as her surviving Legal Heirs. That if any person (s) is having any objection, claims, rights whatsoever relating to the above said matter, may appear on 09.04.2026 at 10 A.M. in person or through a duly appointed advocate, failing which the matter will be heard and decided ex-parte.

**(BY ORDER OF THE COURT)**
Sd/-
**M.A.BASITH**
**M.A; LLM**
**ADVOCATE**
**Flat No.308, Sakina Complex Mehdipatnam 'X' Road, Hyderabad**
**Ph.No.9393300445**

**IN THE COURT OF IX JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S.No.664 of 2026**

**Between:**
Mrs. G. Vijayalakshmi
**...Plaintiffs**
**AND**
1.The Tahsildar, Asif Nagar Mandal, Hyderabad
2.All concerned
**...Defendant**

**To,**
**ALL CONCERNED**

Please take notice that the Plaintiff has filed the above suit for declaring herself as the sole legal heir of Late G. Venkat Reddy, who expired on at Hyderabad leaving behind the Plaintiff viz., Mrs. G. Vijayalakshmi as his surviving Legal Heir. That if any person (s) is having any objection, claims, rights whatsoever relating to the above said matter, may appear on 09.04.2026 at 10 A.M. in person or through a duly appointed advocate, failing which the matter will be heard and decided ex-parte.

**(BY ORDER OF THE COURT)**
Sd/-
**M.A.BASITH**
**M.A; LLM**
**ADVOCATE**
**Flat No.308, Sakina Complex Mehdipatnam 'X' Road, Hyderabad**
**Ph.No.9393300445**

**IN THE COURT OF THE HONOURABLE IX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD**
**O.S.NO. 732 OF 2026**

**Between:**
**1 Smt. Aparna Ankam,**W/o Late Sri Ankam Narahariaged 51years, Hindu, Occ: House wife,
**2 Ms. Ankam Amulya,**D/o Late Sri Ankam Narahari,aged 24 years, Hindu, Occ: Student,
3 **Ankam Hriday Kamal,**S/o Late Sri Ankam Narahari,Aged 22 years, Hindu, Occ: Student,
**...Plaintiffs**
All are R/o H.No.13-6-250/3/12/A, Jaffarguda, Karwan, Hyderabad-500 067.
**AND**
1. The Tahsildar, Asifnagar, Hyderabad District.
2. All Concerned
**...Defendant**

**Public Notice**
Please take notice that the Plaintiffs filed the above suit to declare them as legal heirs of Late Sri Ankam Narahari, who died on 6th June, 2023 at Apollo Hospital in Hyderabad.Therefore, the Plaintiffs hereby call upon the general public for filing any objections, if any, concerning the above prayer. The suit is posted to 16-04-2026 before the Hon'ble IX Junior Civil Judge, City Civil Court, Hyderabad and that the persons having any objections may file their respective objections by 10.30 AM on or before the above said date failing which the matter will be heard and decided according to law.

**(BY ORDER OF THE COURT)**
Sd/-
**RODDA RAJA MOHAN**
**ADVOCATE**
**1-10-250/1 & 2, Ashoknagar, Hyderabad-500 020. Cell No.9849334767**

**IN THE COURT OF HON'BLE II ADDITIONAL CHIEF JÜDGE, CITY CIVIL COURT AT:HYDERABAD**
**IA No, 3822 OF 2025**
**IN**
**0.S. No, 501 OF 2015**

**Between:**
Mohd. Nayeem & another
**...Plaintiffs**
**AND**
1. Mr. Saleh @ Babu Jabri & others
**...Defendant**
22. Pathipati Chalamaiah Naidu
...(Proposed Respondents Nos. 22-32/ Defendants Nos. 22-32)

To,
22. Pathipati Chalamaiah Naidu S/o. late Pathipati Veeraiah Naidu,
Aged about 71 years, Occ: Business,
23. Pathipati Usha Rani, W/o. Pathipati Chalamaiah Naidu,
Aged about 66 years, Occ: Retd. Scientist,
(Proposed Defendants 22 & 23 are R/o. H. No. 6-3-654/4, Hindi Nagar, Punjagutta, Hyderabad, T.S.)
26. Dr. Pamidimukala Gayatri,
W/o. Pamidimukala Venkata Keshava Gurnada Kumar,
Aged about 40 years, Occ: Doctor,
R/o. H. No. 10-4-35/302, Vindyachal Apartments, Asif Nagar, Humayun Nagar, Hyderabad, T.S
29. Sri. Baktula Sandeep, S/o. Sri. Baktula Vijay Kumar, Aged about 42 years, Occ: Business, R/o. Plot No. 519-B.Road No. 28, Jubilee Hills, Near Peddamma Temple, Hyderabad, T.S.)

Take notice that the above Petitioner/Plaintiff has filed the above IA. No. 3822 of 2025 in OS No. 501 of 2015 to implead the proposed Respondents No.22 to 32 as Defendants No. 22 to 32 and the said application is posted on 13.04.2026 at 10:30 A.M. for your annearance and Objections, if any. Hence, you are required to appear either in person or through your counsel, failing which the matter may be decided in your absence.

**(BY ORDER OF THE COURT)**
Sd/-
**M/S. SHARAD SANGHI & ASSOCIATES**
**Advocate**
**Mail @: sanghisharad@gmnail.com**




"బెంగాల్ ప్రజల ప్రజాసామ్య హక్కులకు వ్యతిరేకంగా తీవ్రమైన కుట్ర నడుస్తోంది. రాష్ట్ర శాసన సభ ఎన్నికలకు ముందు సాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమంలో నకిలీ ఓట్లను చేర్పించడానికి పెద్దఎత్తున్న దరఖాస్తులు వస్తున్నాయి. రాష్ట్ర ఓటర్ల జాబితాలను ఫేక్ ఓట్లతో నింపడానికి కేంద్ర ఎన్నికల సంఘం, భారతీయ జనతా పార్టీ కలిసి పనిచేస్తున్నాయి. ఇందుకోసం చాలా రాష్ట్రాల నుంచి బిజెపి ఏజెంట్లు చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయంలో ఫార్మ్ 6 దరఖాస్తులను భారీ సంఖ్యలో సమర్పిస్తున్నారు. ఇవి మామూలుగా ఓటర్లు తమ పేర్లు చేర్పించుకోవడానికి పెట్టుకుంటున్న దరఖాస్తుల మాదిరిగా లేవు. బెంగాల్ వాస్తవ్యులు కానీ వారు ఈ దరఖాస్తులను సమర్పించడం చాలా ఆందోళనకరమైన విషయం. బీహార్, హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల శాసన సభల ఎన్నికల ముందు కూడా ఇలాగే జరిగింది."

* మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

## వే'మన'పద్యం

**హీనుడెన్ని విద్య లభ్యసించినగాని**
**ఘనుడుగాడు హీన జనుడెగాని**
**పరిమళముల మోయ గార్ధభము గజమౌనె**
**విశ్వదాభిరామ! వినురవేమ**



## సంపాదకీయం

# అయోమయంలో ట్రంప్!

దుష్టులకు ఇష్టులు దుష్టులే అవుతారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కి ఇప్పుడు ఇజ్రాయెల్ కి మించిన మిత్రులే లేరు. ఈ రెండు దేశాలు కలిసి ఏకపక్షంగా ఇరాన్ పై సాగిస్తున్న యుద్ధంలో సాధారణంగా అమెరికా మిత్ర దేశాలనిపించుకున్న యూరోపు దేశాలు కూడా ట్రంప్ కి దూరంగా జరిగిపోయాయి. గత గల్ఫ్ యుద్ధంలో మాదిరిగా అమెరికా అబద్ధాలను నమ్మి దానితో కలిసి ఇరాన్ పై దాడికి వెళ్లకపోవడంలోనే వాటి విజ్ఞత దాగి ఉంది.దీనిని ట్రంప్ బొత్తిగా సహించలేకపోతున్నాడుశాపనార్థాలు పెడుతున్నాడు. ముఖ్యంగా బ్రిటన్, ఫ్రాన్స్ లంటే అగ్గి మీద గుగ్గిలమవుతున్నాడు. బద్ధలైన అగ్గి కొండ అవుతున్నాడు.ఇరాన్ అనే హంతకుడిని రక్తపిపాసిని దారిలోకి తెచ్చే విషయంలో సహకరించడం లేదంటూ విరుచుకుపడ్డాడు.హోర్ముజ్ జలసంధి లో చమురు నౌకలు చిక్కుకుపోయినవారు వాటిని విడిపించుకోడానికి తమ సొంత యుద్ధనౌకలను అక్కడికి పంపించుకోవాలి లేదా అమెరికా నుంచి ఆయిల్ ను కొనుక్కోవాలి అని హెచ్చరించాడు.వాస్తవానికి ట్రంప్, నెతన్యాహూ లు అప్రకటిత యుద్ధ నేరస్థులుగా రుజువై పోయారు. గాజా వెలుగులో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును మానవాళి శత్రువుగా యుద్ధ నేరస్థుడుగా ప్రకటిస్తూ అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నెతన్యాహుకు 2024 నవంబర్ లోనే అరెస్టు వారెంటు జారీ చేసింది. ఎన్ని నష్టాలను తట్టుకుని అయినా రోజు రోజుకూ గట్టి ప్రతిఘటన ఇచ్చి రోజులు, వారాలు గడచి నెల రోజులు దాటినా రణరంగం నుంచి ఇరాన్ తప్పుకోకపోడం, హోర్ముజ్ ను అలాగే తన గుప్పెట్లో పెట్టుకుని ఉండడం ట్రంప్, నేతన్యాహులను నివ్వెరపరుస్తున్నది.అమెరికా స్థావరాలున్న ఇరుగు పొరుగు అరబ్ దేశాలపై నిర్విరామ డ్రోన్ దాడులు జరపడం వల్ల వాటితో బాటు అమెరికా కూడా నష్టపోయింది. భారతంలో వికర్ణుడి మాదిరిగా ఈ మొత్తం యుద్ధంలో స్పెయిన్ ప్రదర్శించిన పాత్ర అమోఘమైనది.యుద్ధం ఆరంభం నుంచి అమెరికా - ఇజ్రాయెల్ వైఖరిని సోషలిస్టు ప్రధాని శాంచెజ్ నాయకత్వంలో స్పెయిన్ తీవ్రంగా వ్యతిరేకించింది. నాటో లో కొనసాగుతూనే అమెరికా ఇరాన్ లకు అణువంత చోటివ్వలేదు. తన అదుపులోని ఏ ప్రాంతాన్నీ అవి ఇరాన్ పై యుద్ధానికి వాడుకోకుండా అడ్డుకున్నది. ఇది చరిత్రలో నిలిచిపోయే అంశం. గడువు మీద గడువు పొడిగించినా తాను ఆశించిన విధంగా ఇరాన్ లొంగివచ్చే అవకాశాలు కనిపించడం లేదు. యుద్ధం సుదీర్ఘం అయ్యే కొద్దీ ప్రపంచం చమురు సంక్షోభంలో మరింతగా కూరుకుపోతున్నది.అమెరికాలోనూ పెట్రోల్ ధరలు పెరిగాయి. ఇరాన్ వంచడానికి అమెరికా భీషణ దాడులు చేస్తున్నది, ఇరాన్ దీటుగా ఎదుర్కొంటున్నది, యుద్ధానికి శాంతి ఆశల మధ్య ప్రపంచం అతలాకుతలమవుతున్నది.


## రచనలు పంపండి


వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.



voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020


# కాగితపు పులి, అమెరికా సామ్రాజ్యవాదం!

ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దాడి ప్రారంభించి ఈ రోజు ( 31-3-26) కి 32 రోజులు. దాడికి ముందు దాడి తర్వాత అమెరికా, ఇరాన్ ను అనేక విధాల బెదిరించింది, బెదిరిస్తున్నది. ముఖ్యమైన నాయకులు మరణించినా, ఏ మాత్రం భయపడని ఇరాన్, అమెరికా-ఇజ్రాయిల్ దాడులను ఎదుర్కొంటూ, ప్రతి దాడులు చేస్తున్నది. శత్రువుకి ఊహించని నష్టాలు కలుగజేస్తున్నది. అమెరికా యుద్ధంలో ఇరుక్కుని బయట పడలేక గిలగిలా కొట్టుకుంటూ ఉంది. అమెరికా- ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ లో రెండు వేలకు పైగా ప్రజలు మరణించగా, వేలాది మంది గాయపడ్డారు. అయినా ఇరాన్ ప్రజలు ఐక్యంగా అమెరికాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అమెరికా సామ్రాజ్యవాదం పశ్చిమాసియాపై ఆధిపత్యం చెలాయించి, ఆ ప్రాంతంలో ఉన్న ఆయిల్, ఇతర సహజ వనరులను తరలించుకు పోవడం ధ్యేయంగా పెట్టుకుంది. అందుకోసం ఈదు దరహం కార ఇజ్రాయిల్ ను పెంచి పోషించి అరబ్ దేశాలపై దాడులు చేయిస్తున్నది. పాలస్తీనా పై ఇజ్రాయిల్ దాడి ,గాజాలో నరమేధం అందులో భాగమే. తన ప్రయోజనాలను వ్యతిరేకించే దేశ ప్రభుత్వాలను కూల్చి తన అనుకూల ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. అందులో భాగమే సిరియాలో అస్సాద్ ప్రభుత్వ కూల్చివేత, ఇరాక్ పై సైనిక దాడి జరిపి సద్దాం హుస్సేన్ కు మరణ శిక్ష, లిబియాలో గథాఫీ హత్య. తన పెంపుడు బిడ్డ ఇజ్రాయిల్ కి ఆయుధాలు సప్లయ్ చేసి లెబనాన్, యెమన్ భూభాగాలను ఆక్రమించేలా చేసింది. అరబ్ దేశాలపై సైనిక దాడులు, పాలక ప్రభుత్వాల కూల్చివేతలే కాకుండా ,అనేక దేశాల్లో తన సైనిక స్థావరాలు ఏర్పాటు చేసుకున్నది అమెరికా. ఖతార్ ఆల్ ఉదీద్ ఎయిర్ బేస్ ఏర్పాటు చేసింది. ఇది మధ్య ప్రాచ్యంలో అతిపెద్ద అమెరికా సైనిక స్థావరం. ఇది సెంట్ కాం హెడ్ క్వార్టర్స్ (అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయం). బెహ్రెయిన్ లో అమెరికా నేవల్ ఫోర్సెస్ సెంట్రల్ కమాండ్, 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం ఉంది. కువైట్ లో అరిఫ్జన్ క్యాంపు. ఇక్కడ వేలాది మంది అమెరికా సైనికులు, ఆయుధాలు ఉన్నాయి. సౌదీ అరేబియా దేశంలో ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ నిర్మించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో అల్ దఫ్రా ఎయిర్ బేస్, ఇరాక్ లో ఐక్య అల్-అసద్ ఎయిర్ బేస్ లు ఏర్పాటు చేసింది. ఇవి గాక ఇంకా అనేక సైనిక స్థావరాలు ఉన్నాయి. ఈ స్థావరాలను తన ఆధిపత్య విధానాలను వ్యతిరేకిస్తున్న ఇరాన్ పై దాడి చేయడానికి, పశ్చిమ ఆసియాలో ఆధిపత్యాన్ని నిలబెట్టు కోవటానికి అమెరికా ఏర్పాటు చేసినవే. పశ్చిమాసియాలో అమెరికాకు చెందిన దాదాపు 50 వేల మంది సైనికులు ఉన్నారు. 5వ నౌకా దళం బహ్రెయిన్ లో ఉండగా, బహ్రెయిన్, ఖతార్ లో 28 వేల మంది సైనికులు ఉన్నారు. ఖతార్ సైనిక కేంద్ర ఖర్చులో సహ రాజ్యాలు సుమారు 650 ,మిలియన్ల అమెరికా డాలర్లు భరిస్తున్నాయి. ఈ స్థావరాల నుంచే అమెరికా ఇరాన్ పై దాడులు చేస్తున్నది. అమెరికా కుట్రలు, దాడులు - రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా, సోవియట్ యూనియన్ రెండు బలమైన రాజ్యాలుగా ఏర్పడ్డాయి. ఈ రెండు దేశాలు పరస్పర వ్యతిరేక విధానాలు కలిగి ఉన్నాయి. అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ ఆధిపత్య దురాక్రమణ విధానాలు అవలంబిస్తే, స్టాలిన్ నాయకత్వాన ఉన్న సోవియట్ యూనియన్,అమెరికా యుద్ధ విధానాలను వ్యతిరేకించి వెనుకబడిన దేశాలకు, ప్రపంచ ప్రజలకు బాసటగా ఉంది. స్టాలిన్ జీవించి ఉన్నంత కాలం ఈ వైరం కొనసాగుతూ వచ్చింది.




ఇతర దేశాల్లో రాజకీయ పరిణామాల మార్పు ను ప్రభావితం చేయడానికి లేదా మార్చడానికి అమెరికా అనేక చర్యలు చేపట్టింది. ఇవి ప్రత్యక్ష సైనిక దాడుల నుంచి రహస్య నిఘా కార్యకలాపాలు, ఆర్థిక ఆంక్షలు, ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలకు మద్దతు ఇవ్వడం వరకు ఉన్నాయి. ఐసన్ హోవర్ పరిపాలనలో రహస్య నిఘా కార్యక్రమాలు అమెరికా ప్రధాన విధానంగా మారింది. సైన్యాలను పంపడానికి బదులుగా, ఇతర దేశాల్లో సైనిక తిరుగుబాట్లు లేదాఅన్న దానిపై సీ ఐ ఏ ఆధారపడింది.1950లో ఉత్తర కొరియాపై దాడి చేసింది. 1960 దశకంలో కెన్నడీ, జాన్సన్ అధ్యక్షుల పాలనలో ఇతర దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యాలు పెరిగాయి. సోవియట్ యూనియన్ లో కృశ్చేవ్ ముందుకు తెచ్చిన శాంతియుత సహజీవనం ,పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ వల్ల జరిగిన అనేక పరిణామాలు గమనించాలి. క్యూబాపై జరిగిన ' బే ఆఫ్ పిగ్స్' దాడి( ఏప్రిల్ 1961లో అమెరికా నిఘా సంస్థ సిఐఎ మద్దతుతో క్యూబన్ ప్రవాసులు ఫిడేల్ కాస్ట్రో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి కెన్నడి అధ్యక్షతన దండయాత్రని బే ఆఫ్ పిగ్స్ దాడి అంటారు. ఈ దాడి మూడు రోజుల్లోనే విఫలమైంది), అంతేకాకుండా విప్లవాత్మక ప్రభుత్వాలను కూలద్రోయడానికి చేసే రహస్య సైనిక చర్యలు జరిగాయి. 1970 దశాబ్దంలో నిక్సన్ అధ్యక్ష కాలంలో జోక్యం తరచుగా బహిరంగ యుద్ధం కంటే, రహస్య అస్థిరత సృష్టించడం రూపంలో ఉండేది. వియత్నాం యుద్ధంలో కమ్యూనిస్టుల పోరాటానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష సైనిక జోక్యం చేసుకుంది.1973లో చిలీ అధ్యక్షుడు సాల్వడార్ అలెండీని పడగొట్టించడం, సైనిక నియంత పినోచెట్ ను అధికారంలో కూర్చోబెట్టడం జరిగింది. 1980లో రీగన్ అధ్యక్షతన ప్రాక్సీ ఘర్షణలు ( రెండు ప్రధాన దేశాలు తమ సొంత సైన్యాలను నేరుగా యుద్ధంలోకి దింపకుండా, వేరే దేశాల తిరుగుబాటు దారుల, మిలీషియా దళాల ద్వారా తమ శత్రువులపై జరిపే పరోక్ష దాడి ) పరాకాష్టగా నిలిచాయి. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైన తర్వాత అమెరికా ఏకైక అగ్ర రాజ్యంగా తన దుష్ట పన్నాగాలను ఎక్కువ చేసింది. జార్జ్ హెచ్ డబ్ల్యూ బుష్ కాలంలో 1989లో పనామాపై దాడి, 1991లో ఇరాక్ పై గల్ఫ్ యుద్ధం జరిగాయి. క్లింటన్ కాలంలో సోమాలియా హైతి, కొసావో లో తిరుగుబాట్లు జరిగాయి. బైడెన్, ట్రంప్ పాలనలో ఆఫ్ఘనిస్తాన్ పై యుద్ధం జరిగింది. నేడు ఇరాన్ పై ప్రత్యక్ష దాడి ప్రారంభించింది. నాటో దేశాల్లో వ్యతిరేకత: ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ జరుపుతున్న యుద్ధానికి కొన్ని నాటో దేశాలు మరియు యూరప్ దేశాలు మద్దతు నిరాకరించాయి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా మొదలైన దేశాలు యుద్ధంలో పాల్గొనమని చెప్పాయి. ఈ యుద్ధం తమది కాదని భావించాయి. స్వీడన్ అమెరికా విమాన రాకపోకలకు అనుమతి నిరాకరించి తన గగన స్థలాన్ని మూసి వేసింది . రష్యా, చైనా, ఉత్తర కొరియా ఇరాన్ కు మద్దతు తెలిపాయి. నాటో చీఫ్ మార్క్ రుట్టే ఇరాన్ పై అమెరికా,ఇజ్రాయిల్ దాడులను సమర్థించారు.మరి కొన్ని దేశాలు అమెరికాకు మద్దతు ప్రకటించాయి. యుద్ధంలో పాల్గొనమని చెప్పిన బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా మరియు భారత్ గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులను ఖండించాయి. గల్ఫ్ దేశాల్లో ఉన్న తన స్థావరాలనుంచే అమెరికా ఇరాన్ పై దాడులు చేస్తుంటే, ఆ దేశాలను అందుకు అనుమతించవద్దని ఈ దేశాలు ఎందుకు చెప్పడం లేదు. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడి చేయడం లేదు. ఆ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై మాత్రమే దాడి చేస్తున్నది. ఆ దేశాలను అమెరికాకు సహకరించ వద్దని కోరింది. ఐక్యరాజ్యసమితి పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు ఆపాలని తీర్మానం చేసిందే కాని, ఒక సార్వభౌమ దేశం ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయిల్ దాడులు ఖండించడం గాని,ఆపాలని గాని మాత్రం తీర్మానం చేయలేదు. దీన్ని గమనిస్తే ఐక్యరాజ్యసమితి, అమెరికా ప్రయోజనాలను ఏ విధంగా కాపాడుతుందో అర్థం అవుతుంది.


> అరబ్ దేశాలపై సైనిక దాడులు, పాలక ప్రభుత్వాల కూల్చివేతలే కాకుండా , అనేక దేశాల్లో తన సైనిక స్థావరాలు ఏర్పాటు చేసుకున్నది అమెరికా, ఖతార్ ఆల్ ఉదీద్ ఎయిర్ బేస్ ఏర్పాటు చేసింది. ఇది మధ్య ప్రాచ్యంలో అతి పెద్ద అమెరికా సైనిక స్థావరం. ఇది సెంట్ కాం హెడ్ క్వార్టర్స్ (అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రధాన కార్యాలయం). బెహ్రెయిన్ లో అమెరికా నేవల్ ఫోర్సెస్ సెంట్రల్ కమాండ్, 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం ఉంది. కువైట్ లో అరిఫ్జన్ క్యాంపు. ఇక్కడ వేలాది మంది అమెరికా సైనికులు, ఆయుధాలు ఉన్నాయి. సౌదీ అరేబియా దేశంలో ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ నిర్మించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో ఆల్ దఫ్రా ఎయిర్ బేస్, ఇరాక్ లో ఐక్య అల్-అసద్ ఎయిర్ బేస్ లు ఏర్పాటు చేసింది. ఇవి గాక ఇంకా అనేక సైనిక స్థావరాలు ఉన్నాయి. ఈ స్థావరాలను తన ఆధిపత్య విధానాలను వ్యతిరేకిస్తున్న ఇరాన్ పై దాడి చేయడానికి, పశ్చిమ ఆసియాలో ఆధిపత్యాన్ని నిలబెట్టు కోవటానికి అమెరికా ఏర్పాటు చేసినవే. పశ్చిమాసియాలో అమెరికాకు చెందిన దాదాపు 50 వేల మంది సైనికులు ఉన్నారు. 5వ నౌకా దళం బహ్రెయిన్ లో ఉండగా, బహ్రెయిన్, ఖతార్ లో 28 వేల మంది సైనికులు ఉన్నారు. ఖతార్ సైనిక కేంద్ర ఖర్చులో సహ రాజ్యాలు సుమారు 650 ,మిలియన్ల అమెరికా డాలర్లు భరిస్తున్నాయి. ఈ స్థావరాల నుంచే అమెరికా ఇరాన్ పై దాడులు చేస్తున్నది.

### యుద్ధ విరమణ ప్రతిపాదనలు:

అమెరికా ఊహించలేని విధంగా ఇరాన్ దాడులు, ఫలితంగా అమెరికాకు విపరీతమైన నష్టం జరగడం, అవసరం లేని యుద్ధానికి వ్యతిరేకంగా లక్షలాది అమెరికా ప్రజలు వీధుల్లోకి వచ్చి ట్రంప్ కు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేయడంతో, ట్రంప్ కి యుద్ధ విరమణ ప్రతిపాదనలు చేయక తప్ప లేదు. యుద్ధ విరమణకు అమెరికా ప్రతి ప్రతిపాదనలు: ఇరాన్ అణ్వాయుధాల కార్యక్రమాన్ని పూర్తిగా వదులుకోవడం, ఇరాన్ అణుశుద్ధిని నిలిపి వేయడం, ఇప్పటికే శుద్ధిచేసిన యురేనియం నిల్వలను అంతర్జాతీయ అణుశక్తి సంస్థకు అప్పగించడం, హోర్ముజ్ జలసంధిని నిరంతరం తెరిచి ఉంచడం, ఇరాన్ లోని అణు కేంద్రాలను ధ్వంసం చేయడం వంటివి అమెరికా ప్రతిపాదనల్లో ముఖ్యమైనవి. ఇరాన్ ప్రతిపాదనలు: వెంటనే తమపై దాడులు పూర్తిగా ఆపివేయడం, ఇక ముందు ఎలాంటి దాడులు చేయమని గ్యారంటీ ఇవ్వడం, దాడుల వల్ల ఇరాన్ కి జరిగిన నష్టానికి తగిన పరిహారం చెల్లించడం, గల్ఫ్ ప్రాంతంలో అమెరికా స్థావరాల మూసివేత, ఇరాన్ బాలిస్టిక్ క్షిపణుల తయారీ పై ఆంక్షలు విడనాడటం, హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ ఆధిపత్యాన్ని అధికారికంగా గుర్తించడం ఇరాన్ ప్రతిపాదన లో ముఖ్యమైనవి. పెద్దఎత్తున అణ్వాయుధాలతో ప్రపంచాన్ని భయపెడుతున్న అమెరికా, అణ్వాయుధ కార్యక్రమాన్ని వదులుకోమని ఇరాన్ చెప్పడం దాని ఆధిపత్య విధానాలకు నిదర్శనం. ఇరాన్ వల్ల అణ్వాయుధ ప్రమాదం ఉందని చెప్పే అమెరికా ముందుగా తన వద్ద ఉన్న అణ్వాయుధాలను నాశనం చేయాలి. తాను మాత్రం అణ్వాయుధాలు కలిగి ఉంటాను, అణ్వాయుధాల పరీక్షలు జరుపుతూనే ఉంటాను, ఇరాన్ మాత్రం తయారు చేయకూడదని చెప్పడం అమెరికా ద్వంద నీతికి నిదర్శనం. అణ్వాయుధాల తయారీ అనుమానాల తో ఇరాన్ పై దాడి చేసిన అమెరికా, పెద్ద ఎత్తున అణ్వాయుధాలు కలిగి ప్రపంచానికి ప్రధాన శత్రువుగా ఉన్న తనపై అన్ని దేశాలు కలసి దాడి చేయడం సరైందే గదా! అలా చేస్తే అమెరికా పరిస్థితి ఏమిటి. ఇరాన్ ప్రతిపాదనలు న్యాయంగా ఉన్నాయి. దాడి ప్రారంభించింది అమెరికా, ఇజ్రాయిల్ కాబట్టి ఇరాన్ కు పూర్తి నష్ట పరిహారం చెల్లించాలి. ఇరాన్ పై చీటికి మాటికి దాడులు చేస్తున్న అమెరికా, ఇజ్రాయిల్ ఇక ముందు దాడులు చేయమని అంతర్జాతీయంగా హామీ ఇవ్వాలనే ఇరాన్ డిమాండ్ న్యాయసమ్మతమే. అమెరికా సైనిక స్థావరాల వల్ల గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత పెరగడమే కాకుండా, పశ్చిమాసియా దేశాలకు ప్రమాదం పొంచి ఉంది. అమెరికాకు శాంతి వెడల చిత్తశుద్ధి ఉంటే పూర్తిగా యుద్ధాన్ని నిలిపి వేయాలి. ఇరాన్ షరతులకు ఆమోదం తెలపాలి. ఇరాన్ పై అమెరికా దాడి, ఇరాన్ ప్రతిగా చేస్తున్న దాడులు, ట్రంప్ హెచ్చరికలు, గడువులు ఒక వాస్తవాన్ని తెలియ చేస్తున్నది. అమెరికా సామ్రాజ్యవాదం కాగితపు పులి అని, ప్రజలు తిరగబడితే అది ఏమీ చేయలేదని మావో చెప్పిన వాస్తవాన్ని ఇరాన్ మరొక సారి రుజువు చేసింది. ఈ కాగితపు పులిని ప్రపంచ ప్రజలు ముక్కల ముక్కలుగా చించి పారేయాలి. అప్పుడే ప్రపంచంలో శాంతి పవనాలు వీస్తాయి.




బొల్లిముంత సాంబశివరావు
రైతు కూలీ సంఘం
( ఆం.ప్ర)
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు
సెల్: 9885983526

# పూర్తిగా ముగిసినట్లేనా?

భారతదేశంలో సాయుధ వామపక్ష ఉద్యమం చరిత్రను పరిశీలిస్తే అది ఒక్కసారిగా ఉద్భవించిన ప్రక్రియ కాదని, దీర్ఘకాలిక సామాజిక-ఆర్థిక అసమానతల నేపథ్యంలో రూపుదిద్దుకున్న రాజకీయ ప్రతిస్పందన అని స్పష్టమవుతుంది. 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరి గ్రామంలో చోటుచేసుకున్న రైతాంగ తిరుగుబాటు ఈ ఉద్యమానికి చిహ్నాత్మక ఆరంభం. భూస్వామ్య దోపిడీ, భూమిలేని కౌలు రైతుల సమస్యలు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం——ఈ మూడు అంశాలు కలిసే అక్కడి సంఘటనలకు దారితీశాయి. "భూమి ఎవరిది? దున్నేవారిదే" అనే నినాదం కేవలం రాజకీయ నినాదం కాకుండా, గ్రామీణ భారతదేశంలో దశాబ్దాలుగా పేరుకు పోయిన అసంతృప్తికి ప్రతీకగా నిలిచింది. ఆ చిగురుటాకుల చప్పుడు కొద్ది కాలంలోనే అరణ్య ప్రాంతాల గుండా విస్తరించి, సాయుధ సిద్ధాంతపర ఉద్యమంగా మారింది. 1980ల నాటికి ఆంధ్ర ప్రదేశ్‌లో పీపుల్స్ వార్ గ్రూప్, బీహార్-ఝార్ఖండ్ ప్రాంతాల్లో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ వంటి వర్గాలు గెరిల్లా యుద్ధాన్ని ప్రధాన వ్యూహంగా స్వీకరించాయి. గ్రామీణ ప్రాంతాల్లో 'జనతా కోర్టులు', 'లిబరేటెడ్ జోన్లు' వంటి ప్రయోగాలు ప్రారంభమయ్యాయి. 2004లో పీపుల్స్ వార్ గ్రూప్ మరియు మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ విలీనం చెంది సి పి ఐ మావోయిస్ట్ గా ఏర్పడింది. ఈ విలీనంతో ఉద్యమం ఒకే కేంద్రీకృత నాయకత్వం కిందకి వచ్చింది. పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ముప్పాల లక్ష్మణ్ రావు (గణపతి) సిద్ధాంతపరంగా "దీర్ఘకాల ప్రజాయుద్ధం" మార్గాన్ని బలంగా ముందుకు నడిపించారు. ఆయన నాయకత్వంలో దళాలు దండకారణ్యం, బస్తర్ అరణ్యాలు, ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులు, ఆంధ్ర-ఒడిశా బోర్డర్ ప్రాంతాల్లో ప్రభావాన్ని విస్తరించాయి. 2000ల మధ్య నాటికి కేంద్ర హోంశాఖ అంచనాల ప్రకారం దేశంలోని సుమారు 200కు పైగా జిల్లాల్లో మావోయిస్టు ప్రభావం ఉందని పేర్కొన బడింది. 2010 సంవత్సరం ఈ ఉద్యమానికి ఒక కీలక మలుపు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ దాడిలో 76 మంది భద్రతా సిబ్బంది మరణించడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన తర్వాత కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు హింసను "అంతర్గత భద్రతకు అతిపెద్ద ముప్పు"గా అధికారికంగా పేర్కొంది. ఇదే సమయంలో సమగ్ర భద్రతా వ్యూహానికి రూపకల్పన జరిగింది. రాష్ట్ర పోలీసు బలగాలు, సి ఆర్ పి ఎఫ్, కోబ్రా కమాండోలు, ప్రత్యేక దళాలు సంయుక్తంగా అరణ్య ప్రాంతాల్లో విస్తృత ఆపరేషన్లు ప్రారంభించాయి. మీడియా వర్గాల్లో "ఆపరేషన్ గ్రీన్ హంట్"గా ప్రాచుర్యం పొందిన చర్యల తరువాత మరింత లక్ష్య సాధనతో సాగిన సమన్వయ ఆపరేషన్లు కొన్ని ప్రాంతాల్లో "ఆపరేషన్ కగార్" పేరుతో కొనసాగాయి. ఈ ఆపరేషన్ల ప్రధాన లక్ష్యం గెరిల్లా దళాల సరఫరా మార్గాలను తెగదెంపులు చేయడం, అరణ్యాల్లో వారి కదలికలను పరిమితం చేయడం, ఇంటెలిజెన్స్ నెట్వర్క్‌ను బలోపేతం చేయడం. డ్రోన్ పర్యవేక్షణ, శాటిలైట్ కమ్యూనికేషన్, ఆధునిక ఆయుధ సదుపాయాలు భద్రతా బలగాలకు సాంకేతిక ఆధిక్యతను ఇచ్చాయి. ఫలితంగా 2010లో నమోదైన సుమారు 2,000కు పైగా హింసాత్మక ఘటనలు 2022-23 నాటికి 500కు లోపుగా తగ్గినట్లు కేంద్ర గణాంకాలు సూచించాయి. మరణాల సంఖ్య కూడా గణనీయంగా పడిపోయింది. ఇది కేవలం సైనిక విజయమే కాకుండా ఉద్యమ నిర్మాణంలో ఏర్పడిన చీలికల సంకేతం. లొంగుబాట్లు ఉద్యమ క్షీణతలో కీలక పాత్ర పోషించాయి. రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పునరావాస ప్యాకేజీలు, ఆర్థిక సహాయం, గృహ స్థలాలు, ఉపాధి శిక్షణలు కేడర్లను ఆకర్షించాయి. మధ్యస్థాయి నాయకులు, ఏరియా కమిటీ సభ్యులు కూడా లొంగిపోవడం వల్ల సంఘటిత నిర్మాణం దెబ్బతిన్నది. ఒకప్పుడు అడవుల్లో గెరిల్లా యుద్ధాన్ని నడిపిన నాయకులు ప్రజా ప్రధాన ప్రవాహంలోకి రావడం ఉద్యమానికి మానసిక దెబ్బ. లొంగుబాటు చేసిన పలువురు తమ అనుభవాలను బహిర్గతం చేయడంతో అంతర్గత విభేదాలు, కఠిన నియమాలు, జీవన కష్టాలు వెలుగులోకి వచ్చాయి. ఎదురుకాల్పులు కూడా పెరిగాయి. బస్తర్, సుక్మా, బీజాపూర్ ప్రాంతాల్లో జరిగిన సంయుక్త ఆపరేషన్లలో పలువురు కీలక నాయకులు మృతి చెందారు. అడవుల్లో సురక్షిత ఆశ్రయాల కొరత, స్థానిక మద్దతు తగ్గుదల, ఆర్థిక వనరుల లోపం——ఇవన్నీ కలసి గెరిల్లా వ్యూహాన్ని బలహీన పరిచాయి. ఒకప్పుడు "రెడ్ కారిడార్"గా పేర్కొనబడిన విస్తీర్ణం ఇప్పుడు భౌగోళికంగా సంకుచితమైంది. కేంద్ర హోంశాఖ ప్రకటనల ప్రకారం ప్రభావిత జిల్లాల సంఖ్య 90కు లోపుగా తగ్గింది. ఈ పరిణామాల్లో గణపతి పాత్ర విశ్లేషణీయ అంశం. 2004 నుంచి దాదాపు పదిహేనేళ్లకు పైగా పార్టీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన ఆయన సిద్ధాంతపర దిశానిర్దేశం ఉద్యమాన్ని సమన్వయ పరిచింది. అయితే వయసు, ఆరోగ్య సమస్యలు, భద్రతా ఒత్తిడి కారణంగా 2018 తర్వాత ఆయన క్రియాశీలక పాత్ర తగ్గిందని అధికార వర్గాలు సూచించాయి. నాయకత్వ మార్పు, అంతర్గత పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలు సాగినట్లు సమాచారం. గణపతి ప్రజా దృష్టికి దూరమవడం ఉద్యమానికి ఒక ప్రతీకాత్మక మలుపు. ఒక యుగం ముగింపు భావన కేడర్లలో కూడా స్పష్టమైందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఉద్యమం పూర్తిగా అంతరించి పోయిందని చెప్పడం తొందరపాటు. సామాజిక అసమానతలు, భూహక్కుల వివాదాలు, గనుల అనుమతులపై స్థానిక ప్రజల ఆందోళనలు, ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి లోపాలు ఇంకా పూర్తిగా పరిష్కార మవ్వలేదు. అరణ్య హక్కుల చట్ట అమలు, మౌలిక సదుపాయాల విస్తరణ, విద్య-ఆరోగ్య సేవల మెరుగుదల వంటి చర్యలు కొంతమేర ప్రభావం చూపుతున్నప్పటికీ, అసంతృప్తి విత్తనాలు పూర్తిగా నశించలేదు. సాయుధ పోరాటం బలహీన పడినా భావజాలం మౌనంగా కొనసాగవచ్చని కొందరు విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం కనిపిస్తున్న దృశ్యం ఒక చరమాంక దశలా అనిపిస్తోంది. గెరిల్లా దళాల సంఖ్య తగ్గింది; నాయకత్వం శూన్యంగా మారింది; లొంగుబాట్లు పెరిగాయి; ఎదురుకాల్పుల్లో నష్టం అధికమైంది; భద్రతా బలగాల ఆధిక్యం పెరిగింది. గణపతి యుగం ముగింపు దశలోకి వెళ్లగా ఉద్యమం కూడా సంక్షోభ దశను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించిన ఎర్రచరిత్ర ఇప్పుడు కొన్ని అరణ్య ప్రాంతాలకు మాత్రమే పరిమితమైంది. అంతిమంగా ఈ పరిణామం భారత ప్రజాస్వామ్యానికి ఒక పాఠం. సాయుధ ఉద్యమం క్షీణత భద్రతా విజయమే అయినప్పటికీ, దీర్ఘకాలిక శాంతి కోసం అభివృద్ధి, సామాజిక న్యాయం, రాజకీయ సంభాషణ సమానంగా అవసరం. నక్సల్బారి నుంచి దండకారణ్యం వరకు సాగిన ఈ ప్రయాణం ఒక యుగాన్ని నిర్వచించింది. ఇప్పుడు ఆ యుగం చరమాంకం లోకి చేరినట్టు కనిపిస్తున్నా, దాని మూల కారణాలపై సమగ్ర పరిష్కారం కనుగొనడమే స్థిరశాంతికి మార్గం.




సంగనబట్ల
9440595494


# ఉగ్ర సూచీలో పాక్ నం.1

"ఇనిస్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ (ఐఈపీ)" అనబడే స్వచ్ఛంద సంస్థ ప్రపంచవ్యాప్తంగా కోరలు చాస్తున్న ఉగ్రవాద ప్రతికూల ప్రభావాలను నివేదిక రూపంలో విడుదల చేయడం జరిగిందిది. ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న 99.7 శాతం జనాభాను కవర్ చేస్తూ 163 దేశాల్లో ఉగ్రవాద ప్రభావాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదికను "గ్లోబల్ టెర్రరిజమ్ ఇండెక్స్-2026 (జిటీఐ)" రూపంలో విడుదల చేయడం జరిగింది. ప్రపంచ దేశాల్లో ఉగ్రవాద చర్యలను పరిగణనలోకి తీసుకొని ఒక శాస్త్రీయ పద్ధతి ప్రకారం ప్రతి దేశానికి 0 నుంచి 10 వరకు ఉన్న స్కేల్‌పై స్కోర్లు ఇవ్వడం జరుగుతోంది. ఇందులో '0' జిటీఐ స్కోర్ పొందిన దేశంలో ఉగ్రవాదం ప్రభావం లేదని, జిటీఐ 10 ఉంటే అత్యధిక ఉగ్రవాద ప్రభావం ఉందని సూచిస్తుంది. గతంతో పోల్చితే 28 శాతం మరణాలు, 22 శాతం ఉగ్ర ఘటనలు తగ్గడం ఓ ఉపశమన పరిశీలనగా పరిగణించాలి. 2007 తర్వాత తక్కువ ఉగ్ర ఘటనలు, మరణాలు 2025లో గమనించడం కొంత ఊరటను ఇస్తున్నది.

గ్లోబల్ టెర్రరిజమ్ ఇండెక్స్-2026 నివేదికలో ఉగ్రవాద ప్రభావంతో మరణాలు, ఆస్తి నష్టాలు, ఘటనల సంఖ్య లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. 2026 జిటీఐ నివేదికలో 28 శాతం వరకు ఉగ్రవాద కారణ మరణాలు (5,582), 22 శాతం ఘటనలు (2,944) తగ్గాయని తగ్గాయని స్పష్టం చేశారు. 2025లో పాకిస్థాన్‌లో మాత్రమే 1,045 ఉగ్ర ఘటనల్లో 1,139 ఉగ్రవాద మరణాలు, 1,595 గాయపడిన వారు, 655 మంది హోస్టేజెస్‌గా నమోదు అయ్యాయి. అత్యధిక ఉగ్రవాదం నమోదు చేసుకున్న 10 దేశాల్లో ఆరు సహారా ఉప-ప్రాంత ఆఫ్రికాలో ఉండడం గమనార్హం. తొలిసారిగా, గ్లోబల్ టెర్రరిజమ్ ఇండెక్స్-2026 జాబితాలో అగ్ర స్థానంలో పాకిస్థాన్ నిలవడం విశేషం. మొత్తం 163 దేశాలకు చెందిన గ్లోబల్ టెర్రరిజమ్ ఇండెక్స్-2026 జాబితాలో ఉన్న 10 అగ్ర దేశాల్లో పాకిస్థాన్ (8.574), బుర్కినా ఫాసో (8.324), నైగర్ (7.816), నైజీరియా (7.792), మాలి (7.586), సిరియా (7.545), సోమాలియా (7.391), డెమక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో (7.171), కొలంబియా (7.116), ఇజ్రాయిల్ (6.790) అనే దేశాలు ఉన్నాయి. ఈ జాబితాలో 13వ స్థానంలో 5.822 స్కోర్‌తో భారత్ ఉన్నది. ఈ జాబితాలో ఇరాన్(18), అమెరికా(28), ఆస్ట్రేలియా (3.732), ఫ్రాన్స్ (35), యూకె (38), న్యూజిలాండ్ (95) దేశాలు ఉన్నాయి. ఉగ్రవాద కార్యకలాపాలు లేని (జీరో జిటీఐ స్కోర్) దేశాలుగా భూటాన్, క్యూబా, మడగాస్కర్, పనామా లాంటి దాదాపు 64 దేశాలు ఉన్నాయి. 2025లో కేవలం భారత్‌లో 142 ఉగ్ర ఘటనలు, 100 వరకు మరణాలు, 118 గాయపడిన వారు ఉన్నారు. తీవ్రవాది నానాటికి పెరగడం, మొత్తం ఉగ్రవాద మరణాల్లో 87 శాతం వరకు పది దేశాల్లోనే నమోదు కావడం విచారకరం. అత్యంత ప్రమాదకర ఉగ్రవాద సంస్థల్లో ఇస్లామిక్ స్టేట్, తెహ్రిక్-ఎ-తాలిబన్, జమాత్ నుస్రత్ అల్-ఇస్లామ్ ఉల్ ముస్లిమీన్, అల్-షబాబ్ లాంటి ఇస్లామిక్ ఉగ్రవాద గ్రూపులు ఉన్నాయి. ఇప్పటికైనా ఇస్లామిక్ ఉగ్రవాద గ్రూపులు బుద్ధి తెచ్చుకొని, హింసతో మరణాలు తప్ప ఏదీ సాధ్యం కాదని, శాంతి మార్గమే శరణ్యం అని భావించి చర్చల ద్వారా తమ అభిప్రాయాలను వ్యక్తం చేయాలని, ప్రపంచ శాంతికి ఊతం ఇవ్వాలని ప్రపంచ మానవాళి కోరుకుంటున్నది.


డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037




# జాతీయం-అంతర్జాతీయం



## బిజెపి బెంగాల్‌కు అక్రమ ఓటర్లను తరలిస్తోంది

### మమత ఆరోపణ



**కోల్‌కత, మార్చి 31 (వుదయం) :**

ఎన్నికల ఫలితాలను తనకి అనుకూలంగా మార్చుకోవడానికి, బీహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల నుండి అక్రమ ఓటర్లను రాష్ట్ర ఓటర్ల జాబితాలో చేర్చడానికి బిజెపి ప్రయత్నిస్తోందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం ఆరోపించారు. పశ్చిమ మేదునిపూర్‌లోని చంద్రకోనలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ, రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీఎంసీ అభ్యర్థులు ఎవరనే విషయాన్ని పట్టించుకోకుండా, మొత్తం 294 స్థానాలకు తననే అభ్యర్థిగా పరిగణించాలని బెనర్జీ సభికులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. కొత్త ఓటర్లను చేర్చుకోవడానికి ఒక్క రోజులోనే సుమారు 30,000 ఫారాలు దాఖలయ్యాయని సమాచారం అందడంతో, అభిషేక్ తన ప్రచార కార్యక్రమం మధ్యలోనే కోల్‌కతాలోని ఈసీ కార్యాలయానికి హుటాహుటిన వెళ్లాల్సి వచ్చిందని నిన్న నాకు తెలియజేశారని టిఎంసి అధినేత్రి అన్నారు. బీహార్, రాజస్థాన్, హర్యానా, ఉత్తర ప్రదేశ్‌ల నుంచి అక్రమ ఓటర్లను బెంగాల్ ఓటర్ల జాబితాలో చేర్చడానికి బిజెపి ప్రయత్నిస్తోంది. బీహార్‌లో చేసినట్లే, ఇతర ప్రాంతాల ఓటర్లను రైల్వేల ద్వారా తరలించడానికి వారు ప్రణాళిక వేస్తున్నారు, అని ఆమె ఆరోపించారు.

కాషాయ పార్టీకి బెంగాల్, దాని ప్రజల పట్ల 'ఎలాంటి గౌరవం' లేదని పేర్కొంటూ, ఎస్ఐఆర్ (సర్) ప్రక్రియ ముసుగులో ఎన్నికల సంఘంతో కుమ్మక్కై, రాష్ట్ర ఓటర్ల జాబితా నుండి మహిళలు, మైనారిటీల పేర్లను తొలగిస్తోందని ముఖ్యమంత్రి బిజెపిపై తీవ్ర ఆరోపణలు చేశారు. బిజెపి, ఈసీ ప్రజల పౌరసత్వాన్ని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య హక్కులను లాక్కుంటున్నాయి. మేము వారిని చివరి వరకు ఎదుర్కొంటాం, అని బెనర్జీ అన్నారు.

రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బీజేపీ బెంగాలీలపై మాంసాహార వినియోగంపై నిషేధం విధిస్తుందని పేర్కొంటూ, రాష్ట్రంలో దొడ్డిదారిన ఎన్ఆర్‌సిని అమలు చేయడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాలను, లక్షిత పౌరులను నిర్బంధ శిబిరాలకు పంపే ప్రణాళికలను టిఎంసి అడ్డుకుంటుందని ముఖ్యమంత్రి అన్నారు.

## అధికారుల బదిలీలపై పిల్‌ను కొట్టివేసిన కలకత్తా హైకోర్టు

**కోల్‌కతా, మార్చి 31(వుదయం):**

త్వరలో ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లో ఐఎఎస్, ఐపీఎస్, పోలీసు అధికారులతో పాటు ఇతర రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా సిబ్బంది బదిలీలను సవాలు చేస్తూ అధికార తృణమూల్ కాంగ్రెస్ దాఖలు చేసిన అప్పీల్‌ను కలకత్తా హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్, జస్టిస్ పార్థ ప్రతీమ్ సేన్‌లతో కూడిన ధర్మాసనం, పిటిషన్‌ను కొట్టివేస్తూ, అధికారుల బదిలీల కారణంగా ప్రజలకు ఏదైనా నష్టం జరిగిందని రిట్ పిటిషనర్ నిరూపించలేక పోయారని తాము నిర్ధారించవలసి వస్తోందని వ్యాఖ్యానించింది. పిటిషన్‌లో సారం లేదని ధర్మాసనం పేర్కొంది. సోమవారం అధికార పక్షం దాఖలు చేసిన పిటిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలిపింది. కేవలం రాష్ట్రం పిటిషనర్‌కు మద్దతు ఇస్తున్నంత మాత్రాన, పిటిషనర్ వాదనల పరిధిని దాటి వెళ్లడానికి అనుమతించలేం అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అందువల్ల, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు పిటిషనర్ కేసును మెరుగుపరచదు. అదేవిధంగా, ప్రతివాదిగా రాష్ట్రం పిటిషనర్ స్థానంలోకి ప్రవేశించజాలదు, అని ధర్మాసనం తన ఉత్తర్వులో పేర్కొంది. రాష్ట్రంలో జరగబోయే ఎన్నికల నేపథ్యంలో ఐఎఎస్, ఐపీఎస్, పోలీసు అధికారులతో పాటు పోలీస్ స్టేషన్ల ఆఫీసర్ఇన్‌ఛార్జ్ (ఓసీ), బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు (బీడీఓ) వంటి ఇతర రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా సిబ్బందిని భారత ఎన్నికల సంఘం బదిలీ చేయడం రాజకీయ ప్రేరేపితమని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, న్యాయవాది కళ్యాణ్ బెనర్జీ సోమవారం ఆరోపించారు. న్యాయవాది అర్కా కుమార్ నాగ్ సోమవారం ఇదే విషయంపై హైకోర్టును ఆశ్రయించారు. నాగ్ దాఖలు చేసిన మొదటి పిటిషన్‌లో 46 మంది ఐఎఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీని సవాలు చేయగా, ఆ తర్వాత 267 మంది పోలీస్ స్టేషన్ల ఇన్‌చార్జ్ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు, బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారుల బదిలీకి వ్యతిరేకంగా రెండవ పిటిషన్‌ను దాఖలు చేశారు. పోలింగ్ తేదీలను ప్రకటించిన కొన్ని గంటల తర్వాత, మార్చి 16 రాత్రి, అప్పటి ప్రధాన కార్యదర్శి నందిని చక్రవర్తి , హోం కార్యదర్శి జగదీష్ ప్రసాద్ మీనా బదిలీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఒక ప్రధాన కార్యదర్శిని పదవి నుంచి తొలగించడం ఇదే మొదటిసారి. మార్చి 18న, ఈసీఐ బిధాన్ నగర్, సిలిగురి పోలీస్ కమిషనర్లతో సహా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డిఐజి), ఇన్‌స్పెక్టర్ జనరల్ (IG) హోదాలో ఉన్న 10 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. దీంతో, మార్చి 16 నుంచి బదిలీ అయిన పోలీసు అధికారుల మొత్తం సంఖ్య 33కి చేరింది. మార్చి 25న, కమిషన్ తూర్పు మిద్నాపూర్ జిల్లా మేజిస్ట్రేట్, జిల్లా ఎన్నికల అధికారి యూనిస్ రిషిన్ ఇస్మాయిల్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో 2007 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అయిన నిరంజన్ కుమార్‌ను నియమించింది. ఎన్నికల మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ, ఎన్నికల విధుల్లో నియామకం కోసం సిద్ధం చేసిన డేటాబేస్‌లో కొంతమంది కాంట్రాక్ట్ ఉద్యోగుల పేర్లను చేర్చినట్లు కమిషన్ గుర్తించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. మాల్దా జిల్లాలో, అతని భార్యకు బీహార్‌లోని బీజేపీ నాయకులతో సంబంధాలు ఉన్నాయని తృణమూల్ ఆరోపించిన తర్వాత, కేంద్ర ఎన్నికల సంఘం నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించిన పోలీసు పరిశీలకుడిని మార్చింది. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి జయంత్ కాంత్‌ను మాణిక్‌చక్, మోతాబారి, సుజాపూర్, బైష్ణబ్‌నగర్ పోలీస్ అబ్జర్వర్ పాత్ర నుండి తొలగించారు. ఆయన స్థానంలో బీహార్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి హృదయ్ కాంత్‌ను మార్చి 28న నియమించారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీని విధించి, తన ప్రభుత్వాన్ని స్తంభింపజేస్తున్నాయని బిజెపి, కమిషన్‌పై ఆరోపణలు చేస్తూ, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన ఎన్నికల ప్రచారంలో బదిలీల అంశాన్ని లేవనెత్తారు. ఈసీ గణనీయ సంఖ్యలో అధికారులను బదిలీ చేసినంత మాత్రాన, ఆ చర్య ఏకపక్షమైనది, అహేతుకమైనది లేదా దురుద్దేశపూరితమైనది అని చెప్పలేం, అని హైకోర్టు ఉత్తర్వులో పేర్కొంది. ఈసీఐ తరఫు న్యాయవాది దామా శేషాద్రి నాయుడు, ప్రధాన కార్యదర్శి స్థానంలో ఆమె కంటే ఒక సంవత్సరం సీనియర్ అయిన అధికారిని నియమించారని, అలాగే ప్రస్తుత హోం కార్యదర్శికి గతంలో పనిచేసిన వారి కంటే ఏడు సంవత్సరాలు ఎక్కువ అనుభవం ఉందని ధర్మాసనం ముందు సమర్పించారు. బెంగాల్‌లో 23 మంది ఆలిండియా సర్వీస్ అధికారులను నియమించినట్లు మార్చి 17 నాటి ఒక పత్రికా క్లిప్పింగ్‌ను కూడా నాయుడు సమర్పించారు. ఎన్నికలు జరగనున్న మరో రెండు రాష్ట్రాలైన తమిళనాడు, కేరళలలో ఇలాంటి నియామకాల సంఖ్య వరుసగా 25, 16గా ఉందని ఆయన కోర్టుకు తెలిపారు.



## బిజెపిలో చేరిన టెన్నిస్ దిగ్గజం పేస్



**న్యూఢిల్లీ, మార్చి 31 (వుదయం) :**

త్వరలో జరుగనున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో, టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్ మంగళవారం న్యూఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీలో చేరడం ఒక కీలకమైన రాజకీయ పరిణామంగా నిలిచింది. ఆయన కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, సుకాంత మజుందార్ సమక్షంలో పార్టీలో చేరారు. కోల్‌కతాలో పార్టీ ఇన్‌చార్జ్ నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షుడు సమీక్ భట్టాచార్యలతో సహా సీనియర్ బీజేపీ నాయకులను పేస్ కలిసిన కొద్ది రోజులకే ఈ పరిణామం చోటుచేసుకుంది. గతంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)తో అనుబంధం ఉన్న పేస్ నిర్ణయం, ఆయన రాజకీయ వైఖరిలో ఒక ముఖ్యమైన మార్పును సూచిస్తుంది. ఆయన గోవాలో 2021 అక్టోబర్‌లో టీఎంసీలో చేరారు. అక్కడ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆయనను తమ్ముడు అని సంబోధిస్తూ బహిరంగంగా స్వాగతించారు. అయితే, ఆ తర్వాత కొద్దికాలానికే పార్టీలో ఆయన రాజకీయ భవిష్యత్తు అనిశ్చితంగా కనిపించింది. జనవరి 2022లో టీఎంసీ ప్రకటించిన 69 మంది సభ్యుల గోవా రాష్ట్ర కమిటీలో ఆయనకు చోటు దక్కకపోవడంతో, ఆ సమయంలో సంస్థలో ఆయన పాత్ర, భవిష్యత్తుపై ప్రశ్నలు తలెత్తాయి. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాజకీయంగా సున్నితమైన తరుణంలో పేస్ బీజేపీలో చేరడం గమనార్హం.

రాష్ట్ర ఎన్నికల ఫలితాలను మే 4న ప్రకటించనున్న విషయం తెలిసిందే. 22 ఏళ్లకే 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో పురుషుల సింగిల్స్‌లో కాంస్యం నెగ్గి, పేస్ సరికొత్త చరిత్ర సృష్టించిన సంగతి తెలిసిందే. కోల్‌కతాలో పుట్టిన పేస్.. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో టెన్నిస్ వైపు నడిచారు. తన కెరీర్‌లో ఏకంగా 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచాడు. అందులో 10 మిక్స్‌డ్ డబుల్స్‌లో, 8 పురుషుల డబుల్స్ లో నెగ్గారు.

## స్మార్ట్ సిటీ మిషన్ అసంపూర్ణ పథకం

### ప్రభుత్వంపై రాహుల్ విమర్శలు



**న్యూఢిల్లీ, మార్చి 31 (వుదయం) :**

స్మార్ట్ సిటీస్ మిషన్ పథకం అసలు లక్ష్యం నగరం మొత్తాన్ని అభివృద్ధి చేయడం కాదని, సంపూర్ణ పరివర్తన అనే కథనంతో దేశానికి ఒక అసంపూర్ణ పథకాన్ని అంటగట్టారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం మోడీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ పథకం మోడీ ప్రభుత్వపు నిజమైన పనితీరుకు ఒక ప్రధాన ఉదాహరణగా నిలుస్తుందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అన్నారు. గొప్ప ప్రకటనలు, అంతకంటే గొప్ప ప్రచారం, సున్నా జవాబుదారీతనమే అదని ఆయన ఎద్దేవా చేశారు. ఒక నగరం తన పౌరులకు ప్రాథమికమైన స్వచ్ఛమైన నీరు, స్వచ్ఛమైన గాలి, భద్రతను అందించడంలో విఫలమైతే, ఆ నగరం నిజంగా స్మార్ట్ నగరం కాలేదు. మోడీ ప్రభుత్వ స్మార్ట్ సిటీస్ మిషన్ మీకు ఖచ్చితంగా గుర్తుండే ఉంటుంది. ప్రధానమంత్రి ఆ పథకాన్ని పొగడటంలో ఎప్పుడూ అలసిపోలేదు! అని గాంధీ తన వాట్సాప్ ఛానెల్‌లో ఒక పోస్ట్‌లో పేర్కొన్నారు. ఇప్పుడు ఈ పథకం ముగింపు దశకు చేరుకుంటున్నందున, దాని వాస్తవ ఫలితాల గురించి నేను పార్లమెంటులో ప్రభుత్వం నుండి వివరణ కోరాను. బయటపడిన నిజాన్ని ఒక మోసంగా మాత్రమే వర్ణించవచ్చు. వాస్తవానికి, ఈ పథకం లక్ష్యం నగరం మొత్తాన్ని అభివృద్ధి చేయడం కాదు, అని ఆయన అన్నారు. సంపూర్ణ పరివర్తన అనే కథనం ముసుగులో దేశానికి ఒక అసంపూర్ణ పథకాన్ని అంటగట్టారని గాంధీ ఆరోపించారు. స్మార్ట్ సిటీ అంటే ఏమిటి, ఏ ప్రాతిపదికన విజయాన్ని నిర్ధారిస్తారు, ఎన్ని నగరాలు నిజంగా రూపాంతరం చెందాయి, ప్రజల జీవితాల్లో ఎలాంటి స్పష్టమైన మార్పులు వచ్చాయి అనే ప్రశ్నలను తాను వేసినట్లు గాంధీ పేర్కొన్నారు. ఎలాంటి స్పష్టమైన సమాధానాలు లభించలేదని ఆయన వాదించారు.

స్మార్ట్ సిటీస్ మిషన్ పై లోక్‌సభలో గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఆయన ప్రశ్నించిన కొద్ది రోజులకే ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రశ్నలలో గాంధీ, స్మార్ట్ సిటీస్ మిషన్ ప్రారంభమైనప్పటి నుండి నగరాల వారీగా మంజూరు చేసిన, విడుదల చేసిన, వినియోగించిన మొత్తం నిధులు ఎంత అని; జాతీయ స్థాయిలో సదరు మిషన్ మొత్తం సాధనను అంచనా వేయడానికి ఉపయోగించే కొలమానాల వివరాలు, అలాగే వాటిపై మిషన్ పనితీరు వివరాలను కోరారు.

## ఇజ్రాయెల్ తాజా దాడిలో 4 మృతి



**వుదయం డెస్క్, మార్చి 31 :**

మంగళవారం జరిగిన అమెరికాఇజ్రాయెల్ దాడుల్లో వాయువ్య ఇరాన్‌లో నలుగురు మరణించారని, ఒక షియా ముస్లిం మసీదు, మతపరమైన ప్రదేశం దెబ్బతిన్నాయని ఇరాన్ మీడియా పేర్కొంది. తెహ్రాన్‌కు వాయువ్యంగా సుమారు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న పారిశ్రామిక ప్రావిన్షియల్ రాజధాని జంజాన్‌లోని ఫెర్డోసి వీధిపై ఇరు దేశాలు మంగళవారం ఉదయం జరిపిన దాడిలో, షియా సమావేశాలు, సంతాప కార్యక్రమాల కోసం ఉపయోగించే గ్రాండ్ హుస్సేనియా భవనం దెబ్బతిన్నదని ప్రభుత్వ టెలివిజన్ తెలిపింది. ఈ దాడుల్లో ఆ ప్రాంతంలో నలుగురు మరణించగా, మరో 26 మంది గాయపడ్డారని ప్రాంతీయ డిప్యూటీ గవర్నర్ అలీ సదేఘీని ఉటంకిస్తూ ఐఎస్ఎన్ఏ వార్తా సంస్థ వెల్లడించింది. ఇదిలా ఉండగా, వ్యూహాత్మకమైన హొర్ముజ్ జలసంధిలోని ఇరాన్ ఖేష్మ్ ద్వీపంలో ఉన్న ఒక డీశాలినేషన్ ప్లాంట్‌ను వైమానిక దాడుల ద్వారా పనికి రాకుండా చేశారని ఇరాన్ మీడియా తెలిపింది. అయితే, ఈ దాడి ఎప్పుడు జరిగిందో ఆ నివేదికలో స్పష్టంగా పేర్కొనలేదు. ఖేష్మ్ ద్వీపంలోని డీశాలినేషన్ ప్లాంట్లలో ఒక దానిని లక్ష్యంగా చేసుకొని దాడి జరిగింది. స్వల్పకాలంలో దానికి మరమ్మతులు చేయడం సాధ్యం కానందున, అది ఇప్పుడు పూర్తిగా పనికిరాకుండా పోయింది, అని ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారి మొహ్సెన్ ఫర్హా దీని ఉటంకిస్తూ ఐఎస్ఎన్ఏ పేర్కొంది. మార్చి 7న అక్కడ ఒక దాడి జరిగిందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తెలిపారు. బహ్రెయిన్‌లోని తమ సైనిక స్థావరం నుండి అమెరికా ఈ దాడిని నిస్సిగ్గుగా చేసిందని ఆయన ఆరోపించారు. గల్ఫ్‌లోని అతిపెద్ద ఇరాన్ ద్వీపం ఖేష్మ్. ఇది హొర్ముజ్ జలసంధికి అడ్డంగా సుమారు వంద కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. ఇక్కడి అరుదైన, యునెస్కో జాబితాలో ఉన్న రాతి నిర్మాణాలు, నీలం రంగు నీటి కారణంగా ఇటీవలి సంవత్సరాలలో ఇది ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా మారింది. అయితే, ఇది ఇక్కడ భారీగా సైనికుల మోహరింపు ఉందని విశ్లేషకులు అంటున్నారు.

ఐక్యరాజ్యసమితి ప్రకారం, ఇరాన్‌లోని యునెస్కో జాబితాలో ఉన్న 29 ప్రదేశాలలో కనీసం నాలుగు యుద్ధంలో దెబ్బతిన్నాయి. వీటిలో తెహ్రాన్‌లోని గోలెస్తాన్ ప్యాలెస్, ఇస్ఫహాన్‌లోని చెహెల్ సోటౌన్ ప్యాలెస్, అదే నగరంలోని మస్జిద్‌ఎ జామే మసీదు, ఖొర్రమాబాద్ లోయలోని అత్యంత ప్రాచీన ప్రదేశాలు ఉన్నాయి. తెహ్రాన్ నగర మండలి వారసత్వ కమిటీ అధిపతి అహ్మద్ అలావి గత వారం మాట్లాడుతూ, యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి దేశవ్యాప్తంగా వైమానిక దాడుల వల్ల కనీసం 120 సాంస్కృతికంగా లేదా చారిత్రాత్మకంగా ముఖ్యమైన ప్రదేశాలు దెబ్బతిన్నాయని చెప్పారు. రాజధానిలో అత్యధికంగా సందర్శించే పర్యాటక ప్రదేశాలలో ఒకటైన తెహ్రాన్‌లోని మార్బుల్ ప్యాలెస్, తైమూర్తాష్ హౌస్, సాదాబాద్ ప్యాలెస్ సముదాయాన్ని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా, ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులతో మొదలైన ఈ యుద్ధంలో, డీశాలినేషన్ ప్లాంట్లపై అనేక దాడులు జరిగాయి. కువైట్‌లోని ఒక డీశాలినేషన్, విద్యుత్ ప్లాంట్‌పై సోమవారం ఇరాన్ దాడి చేసిందని ఆరోపించగా, అది ఇజ్రాయెల్ చేసిన దాడి అని తెహ్రాన్ పేర్కొంది. బహ్రెయిన్‌లోని ఒక ప్లాంట్‌పై ఇరాన్ దాడి చేసినట్లు ఆ దేశం ఆరోపించింది. అంతకు ముందు రోజు ఖేష్మ్‌పై అమెరికా దాడికి దీనిని ప్రతీకార చర్యగా భావిస్తున్నారు.

మధ్యప్రాచ్యం ప్రపంచంలోనే అత్యంత పొడి ప్రాంతాలలో ఒకటి. ఇక్కడి అనేక దేశాలు తమ గృహ, పారిశ్రామిక నీటి సరఫరా కోసం డీశాలినేషన్ ప్లాంట్లపై ఆధారపడి ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం ఇరాన్ విద్యుత్ మౌలిక సదుపాయాలను, చమురు బావులను, బహుశా అన్ని ఉప్పునీటి శుద్ధి కర్మాగారాలను తుడిచిపెట్టేస్తామని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలు సంఘర్షణను నాటకీయంగా తీవ్రతరం చేసే అవకాశం ఉంది. ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ థింక్ ట్యాంక్ 2022 నివేదిక ప్రకారం, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో 42 శాతం, సౌదీ అరేబియాలో 70 శాతం, ఒమన్‌లో 86 శాతం, కువైట్‌లో 90 శాతం త్రాగునీటిని శుద్ధి చేసిన నీటి ద్వారా అందిస్తున్నారు.

## హొర్ముజ్ జలసంధిగుండా వెళ్లే నౌకలపై ఇరాన్ టోల్

### యుఎస్, ఇజ్రాయెల్ నౌకలపై నిషేధం

**వుదయం డెస్క్, మార్చి 31:**

మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఘర్షణల నేపథ్యంలో, ఇరాన్ పార్లమెంట్ భద్రతా కమిటీ మంగళవారం హొర్ముజ్ జలసంధికి సంబంధించిన ఒక ప్రణాళికను ఆమోదించింది. ఈ జలసంధి గుండా పలు నౌకలు వెళ్లకుండా ఇరాన్ అడ్డుకోవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్తతలు మరింత పెరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, జలసంధి మార్గంలో వెళ్లే ఓడలపై టోల్ విధించడం, కొన్ని దేశాలపై ఆంక్షలు విధించడం వంటి ప్రతిపాదనలకు ఇరాన్ కమిటీ ఆమోదం తెలిపింది. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ (ఐఆర్ఐబి) ప్రకారం, ఈ వ్యూహాత్మక జలమార్గం గుండా వెళ్లే ఓడలకు రియాల్ ఆధారిత టోల్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఈ ప్రణాళికలో సముద్ర భద్రత, నౌకల భద్రత, జలసంధి గుండా నౌకలు వెళ్ళడానికి అవసరమైన ఆర్థిక యంత్రాంగాలకు సంబంధించిన నిబంధనలను కూడా సూచించారు. ఇది అమెరికా, ఇజ్రాయెల్ నౌకల రాకపోకలను నిషేధించడంతో పాటు, ఇరాన్‌పై ఆంక్షలు విధించిన దేశాలపై కూడా పరిమితులను పొడిగించింది. దీనికి సంబంధించి ఒక చట్టపరమైన చట్రాన్ని ఏర్పాటు చేయడానికి ఒమన్‌తో ఇరాన్ సహకారాన్ని కూడా ఈ ప్రణాళిక ప్రముఖంగా ప్రస్తావించింది.

## ఇండిగోకి కొత్త అధిపతి వాల్ష్



**న్యూఢిల్లీ, మార్చి 31 (వుదయం) :**

తన కార్యకలాపాలను విస్తరిస్తున్న తరుణంలో, వ్యూహాత్మక నాయకత్వ మార్పుకు సంకేతంగా, ఇండిగో తన తదుపరి వృద్ధి దశకు సారథ్యం వహించడానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విమానయాన రంగ ప్రముఖుడిని సంస్థకు అధిపతిగా తీసుకువస్తోంది. చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా విలియం వాల్ష్‌ను నియమించడానికి ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ బోర్డు ఆమోదం తెలిపింది. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ నుండి భద్రతా అనుమతికి లోబడి, 2026 మార్చి 31న జరిగిన బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. వాల్ష్ ప్రస్తుతం అంతర్జాతీయ విమాన రవాణా సంఘం డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఆయన బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఇంటర్నేషనల్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ వంటి ప్రధాన విమానయాన సంస్థలకు నాయకత్వం వహించారు. ఆయన వృత్తి జీవితంలో ఏరో లింగస్‌తో సహా ప్రపంచ వ్యాప్త విమానయాన రంగంలోని వివిధ నాయకత్వ పాత్రలను నిర్వహించారు.

మొత్తం కార్యకలాపాలను, వ్యూహాత్మక దిశను వాల్ష్ పర్యవేక్షిస్తారని యాజమాన్యం సూచించింది. విమానయాన సంస్థ నూతన వృద్ధి దశలోకి ప్రవేశిస్తున్నందున, కార్యాచరణ పనితీరును బలోపేతం చేయడం, నెట్‌వర్క్‌ వ్యూహాన్ని విస్తరించడం, కస్టమర్ అనుభవాన్ని మెరుగుపరచడం వంటివి అతని బాధ్యతలలో భాగంగా ఉంటాయి. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింతగా విస్తరించాలనే లక్ష్యంతో ఇండిగో సాగిస్తున్న పరివర్తన ప్రయాణానికి ఈ నియామకం అనుగుణంగా ఉంది. జూలై 31, 2026 తర్వాత వాల్ష్ సంస్థలో చేరనున్నారు. మారుతున్న పరిశ్రమ పరిస్థితుల నేపథ్యంలో ఎయిర్‌లైన్‌కు మార్గనిర్దేశం చేసేందుకు ఆయన తన ప్రపంచవ్యాప్త నైపుణ్యాన్ని తీసుకువస్తారు. పోటీతత్వం, వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన మార్కెట్‌లో తన స్థానాన్ని పటిష్టం చేసుకోవడంపై ఇండిగో దృష్టిని ఈ నాయకత్వ మార్పు ప్రతిబింబిస్తుంది.

## హొర్ముజ్ జలసంధి దిగ్బంధనం ఉన్నా ఇరాన్ యుద్ధాన్ని ముగించడానికి ట్రంప్ సుముఖంగా ఉన్నారా?



**వుదయం డెస్క్, మార్చి 31 :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరొక్కసారి యుద్ధ విరమణ గురించి మాట్లాడారు. వ్యూహాత్మకంగా కీలకమైన హొర్ముజ్ జలసంధి చాలా వరకు మూసివేసి ఉన్నప్పటికీ, ఇరాన్‌పై వాషింగ్టన్ సైనిక చర్యను ఉపసంహరించుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని ట్రంప్ సూచించినట్లు ప్రభుత్వ అధికారులు తెలిపినట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. సంఘర్షణ కీలక దశలోకి ప్రవేశిస్తున్న తరుణంలో, ట్రంప్ వైఖరి ప్రాధాన్యతలలో మార్పుకు అవకాశాన్ని సూచిస్తోంది. ఈ చర్య సమీప భవిష్యత్తులో కీలకమైన సముద్ర మార్గంపై ఇరాన్ నియంత్రణను కొనసాగించేలా చేయవచ్చు, అదే సమయంలో అమెరికా మిత్రదేశాల నేతృత్వంలో దానిని పూర్తిగా తిరిగి తెరవాలనే ఏ ప్రయత్నాన్నైనా, బహుశా తర్వాతి దశకు నెట్టివేస్తుంది. ఇటీవలే, జలసంధిని తిరిగి తెరవడానికి చేపట్టే ప్రత్యక్ష సైనిక చర్య, నాలుగు నుండి ఆరు వారాల కాలపరిమితిని మించి ఉండే అవకాశం ఉందని ట్రంప్, ఆయన సీనియర్ సహాయకులు నిర్ధారించారు. దానికి బదులుగా, క్రియాశీల ఘర్షణలను తగ్గించే ముందు, ఇరాన్ నావికా సామర్థ్యాలను బలహీనపరచడం, దాని క్షిపణి ఆయుధాగారాన్ని నాశనం చేయడం వంటి కీలక సైనిక లక్ష్యాలను సాధించడంపై దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు. సైనిక ఒత్తిడిని దౌత్యంతో కలిపి, జలమార్గం ద్వారా స్వేచ్ఛా వాణిజ్య ప్రవాహాన్ని పునరుద్ధరించాలని తెహ్రాన్‌ను కోరడంపైనే ఈ వ్యూహం ఆధారపడి ఉందని వారు తెలిపారు. ఒకవేళ ఆ ప్రయత్నాలు విఫలమైతే, ఆ మార్గాన్ని తిరిగి తెరిపించే యత్నానికి నాయకత్వం వహించేలా యూరోపియన్, గల్ఫ్ భాగస్వాములను అమెరికా ప్రోత్సహించే అవకాశం ఉంది. సైనిక ప్రత్యామ్నాయాలు ఉన్నప్పటికీ, అవి తక్షణ ప్రాధాన్యత కాదని అధికారులు నొక్కి చెబుతున్నారు. వ్యూహాత్మక జలమార్గంపై ట్రంప్ నుండి మిశ్రమ సంకేతాలు హొర్ముజ్ జలసంధిపై ట్రంప్ చేసిన బహిరంగ వ్యాఖ్యలు ఇటీవలి వారాల్లో మారుతూ వచ్చాయి, ఇది ఈ సంఘర్షణకు సంబంధించి ఆయన వైఖరిలో వస్తున్న మార్పుల సరళిని ప్రతిబింబిస్తోంది. కొన్ని సందర్భాల్లో, నౌకాయానాన్ని పునరుద్ధరించకపోతే పౌర ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని ఆయన బెదిరించారు. మరికొన్ని సందర్భాల్లో, అమెరికాకు ఈ జలసంధికి ఉన్న ప్రత్యక్ష ప్రాముఖ్యతను ఆయన తక్కువ చేసి చూపారు, దీని మూసివేత ఇతర ఆర్థిక వ్యవస్థలకు పెద్ద సవాలుగా నిలుస్తుందని సూచించారు.

**తీవ్రమవుతున్న ప్రపంచ ఆర్థిక ప్రమాదాలు**

ప్రపంచ ఇంధన సరఫరాలకు కీలకమైన జలసంధిలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న అంతరాయం ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లలో ప్రకంపనలు సృష్టిస్తోంది. అమెరికాకు కీలక మిత్రదేశాలతో సహా పలు దేశాలు తగ్గిన ఇంధన ప్రవాహాలతో సతమతమవుతున్నాయి. ఇది ఇంధన ధరలను పెంచుతూ, సరఫరా గొలుసులపై ఒత్తిడిని పెంచుతోంది. వ్యవసాయంలో ఉపయోగించే ఎరువుల నుంచి సెమీకండక్టర్ ఉత్పత్తికి అవసరమైన హీలియం వరకు, కీలకమైన ముడి పదార్థాలపై ఆధారపడిన పరిశ్రమలు, రవాణాకు అంతరాయం కొనసాగుతుండటంతో పలు దేశాలు తీవ్రమైన కొరతను ఎదుర్కొంటున్నాయి. అమెరికా సెక్రెటరీ ఆఫ్ స్టేట్ మార్కో రూబియో, ప్రస్తుత దశ సైనిక చర్యలు వారాల్లో ముగియవచ్చని అన్నారు. అప్పుడు మనం హొర్ముజ్ జలసంధి సమస్యను ఎదుర్కోవాల్సి ఉంటుంది, అని రూబియో అల్ జజీరాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో అన్నారు. నిర్ణయం తీసుకోవాల్సింది ఇరాన్, లేదా అమెరికా భాగస్వామ్యంతో ప్రపంచం, ఈ ప్రాంతంలోని దేశాల కూటమి, ఏదో ఒక విధంగా ఆ జలసంధిని తెరిచేలా చూస్తుంది అని ఆయన వ్యాఖ్యానించారు.

## ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని విజయ్‌పై కేసు



**చెన్నై, మార్చి 31 (వుదయం) :**

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించడంతో పాటు, ఎన్నికల నిర్వహణ నియమాలను కూడా ఉల్లంఘించారనే ఆరోపణలపై తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత విజయ్‌పై పెరవల్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఒక బహిరంగ సభా కార్యక్రమంలో నటుడు, రాజకీయవేత్త అయిన విజయ్ పలు ఉల్లంఘనలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కుమార్ దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు ఈ చర్య తీసుకున్నారు.

లౌడ్‌స్పీకర్లు, జనసమూహం, అంబులెన్స్‌కు ఆటంకం ఫిర్యాదు ప్రకారం, విజయ్ సరైన అనుమతి లేకుండా సుమారు 30 లౌడ్‌స్పీకర్లను ఉపయోగించి, 5,000 మందికి పైగా ప్రజలను సమీకరించి, ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించారు. రాజకీయ సమావేశాల సమయంలో ప్రజా భద్రతపై ఆందోళనల నేపథ్యంలో, అంబులెన్స్ కు మార్గాన్ని అడ్డుకున్నారనే ఆరోపణ కూడా అధికారుల దృష్టిని ప్రత్యేకంగా ఆకర్షించింది.

**పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు**

ప్రజలకు ఇబ్బంది కలిగించడం, ప్రజా మార్గానికి ఆటంకం కలిగించడం, చట్టవిరుద్ధమైన సమావేశంలో పాల్గొనడం వంటి నిబంధనలతో సహా ఐదు సెక్షన్ల కింద ఈ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు సమాచారం ఉన్న విజయ్‌తో పాటు సుమారు 5,000 మంది టీవీకే పార్టీ కార్యకర్తల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు.

**నివేదిక తర్వాత చర్యలు ప్రారంభం**

పర్యవేక్షణ అధికారి కుమార్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఈ కేసు నమోదు చేశామని, ఫిర్యాదు మేరకు పెరవల్లూరు పోలీసులు చట్టపరమైన చర్యలు చేపడుతున్నారని అధికారులు ధృవీకరించారు.




# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఆలయ చైర్మన్ పదవి ఎవరికి వరించనుందో.?

**జయశంకర్ భూపాలపల్లి, మార్చి 31(వుదయం జిల్లా ప్రతినిధి):**



కాళేశ్వర ముక్తేశ్వర ఆలయ సేవలకోసం ఆలయ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారు దరఖాస్తులు సమర్పించుకున్నారు దానిలో భాగంగా సోమవారం దేవాదాయ శాఖ కాళేశ్వర దేవస్థానం డైరెక్టర్లుగా నియమిస్తూ మంచినీళ్ల దుర్గయ్య, దొడ్ల అశోక్, కుంభం పద్మ, అద్దూరి శ్రీధర్ రావు, బీసుల నరసయ్య, గంధసిరి సత్యనారాయణ, సుంకరి సీతారాం, ఏ మోహన్ శర్మ, జే సీతారాం, కే సత్తయ్య, శ్యాంసుందర్లను కమిటీ సభ్యులుగా నియమించినట్లు దేవదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు ఈ మేరకు చైర్మన్ పదవి ఎవరికి వరించునో అనే చర్చ మండల వ్యాప్తంగా జోరుగా కొనసాగుతోంది దేవాలయం డైరెక్టర్లుగా అవకాశం పొందిన ఆశావాహులైనా కొందరు చైర్మన్ పదవి కోసం కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అనుమతులు కోసం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు చుట్టు ప్రదక్షణలు చేస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉంటే సమాజం దృష్టిలో కాళేశ్వర ఆలయ చైర్మన్ పదవికి అర్హత కలిగి ఉన్న పలువురు నాయకులు మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబు కనుసైగల మేరకు చైర్మన్ పదవి కోసం దరఖాస్తు చేసుకోకుండా వెనుకడుగు వేసినట్లు చర్చలు జరుగుతున్నాయి ఇదే కాక గతంలో బిఆర్ఎస్ పార్టీలో ఉండి కాళేశ్వర ఆలయ పాలక మండలిలో డైరెక్టర్లుగా ఉన్నవారు మళ్ళీ కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రస్తుతం కాళేశ్వర ఆలయ పాలకమండలిలో అవకాశం దక్కడంతో కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో అసహనం వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది. అదే కాక ప్రతిపక్షానికి చెందిన ఓ మాజీ మంత్రి అనుచరుడు వేరే నియోజకవర్గానికి చెందిన వ్యక్తికి మళ్లీ కాళేశ్వర దేవస్థానం డైరెక్టర్ గా అవకాశం రావడం అదే కాక ఒకే సామాజిక వర్గానికి చెందిన వారిలో ఇద్దరికీ డైరెక్టర్ గా అవకాశం ఇవ్వడంతో కాంగ్రెస్ పార్టీ కష్టనష్టాల్లో ఉన్న పార్టీని వీడకుండా పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన పలువురు నాయకులు కార్యకర్తలు రాజకీయ నిరుద్యోగులు, కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థానం డైరెక్టర్ పదవిని గౌరవపదంగా భావించే పలువురు నాయకులు అసంతృప్తి వ్యక్తపరుస్తూ పార్టీ అభివృద్ధి కోసం శ్రమించిన వారిని గుర్తిస్తలేరని చర్చలు జరుగుతున్నాయి మరోవైపు మరికొందరు పార్టీ కోసం శ్రమించిన ప్రతి ఒక్కరిని మంత్రి శ్రీధర్ బాబు గుర్తించి అవకాశం కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి కాటారం సబ్ డివిజన్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులలో కార్యకర్తలలో కాళేశ్వర ఆలయ సేవ కోసం చైర్మన్ పదవి ఎవరికి వరించునోనని చర్చలు జోరందుకున్నాయి.?

## హుజూర్‌నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

**సూర్యాపేట, మార్చి 31(వుదయం):**




నూతన పాలకవర్గం హుజుర్నగర్ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దెందుకు కృషి చేయాలని, మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ కోరారు.హుజుర్ నగర్ మున్సిపల్ బడ్జెట్ 2026 27 ఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పై మంగళవారం హుజుర్ నగర్ మున్సిపాలిటీ లో నిర్వహించారు..ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగించి సత్ఫాలితాలు రాబట్టలని కోరారు. మున్సిపాలిటీ 2026 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.33 కోట్లతో బడ్జెట్ రూపొందించడం జరిగిందని వివరించారు. హుజుర్నగర్ మున్సిపాలిటీని దశల వారీగా అభివృద్ధి చేసుకునేందుకు పాలక వర్గం కృషి చేయాలన్నారు. వార్డులలో ఉన్న సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని ముందుకు పోవాలని సూచించారు. ప్రాధాన్యత అంశాలైన త్రాగునీరు, పరిశ్శుధ్యం, రోడ్లకు సంబంధించిన పనుల కోసం ప్రత్యేక గ్రాంట్ల నిధులను వినియోగించుకుని పూర్తి చేయాలని తెలిపారు. రానున్న వేసవికాలం దృష్టిలో పెట్టుకొని త్రాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. రామస్వామి గుట్ట వద్ద నిర్మిస్తున్న మోడల్ కాలనీలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆర్డిఓ కు సూచించారు వార్డులలోని ముఖ్యమైన ప్రదేశాలలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తే మహిళ భద్రత కల్పించడం జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల కార్యక్రమాన్ని మున్సిపాలిటీలలో సమర్థవంతంగా నిర్వహించాలని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేయాలని ఆయన సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వార్డుల్లో పర్యటించి కాలనీల్లో చెత్త తొలగింపు, డ్రైనేజీల శుభ్రపరచడం, రోడ్లను శుభ్రంగా ఉంచడం వంటి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. పట్టణాన్ని పరిశుభ్రంగా మరియు అందంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్ పర్సన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసిల్దార్ కవిత, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఏప్రిల్ 3న కొమురయ్య జయంతి

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం, మార్చి -31(వుదయం):**

ఏప్రిల్ 2న ఉదయం 10 గంటలకు ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించి, వారి విగ్రహానికి పుష్పమాలంకరణ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 31 (వుదయం ప్రతినిధి):**



పోలీస్ శాఖలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి పదవీ విరమణ పొందిన ఇద్దరు ఎస్సైలను,ఒక ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ను ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఘనంగా సత్కరించారు.37 సంవత్సరాలు పోలీసు శాఖలో పనిచేసి ప్రస్తుతం కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఎస్సై మీర్జా కమల్షా బేగ్,37 సంవత్సరాలు పోలీసు శాఖలో పనిచేసి ప్రస్తుతం దమ్మపేట పోలీస్ స్టేషన్ నందు విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఎస్సై వంక రామరాఘవయ్య మరియు 36 సంవత్సరాలు తమ సేవలను అందించి జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ పరిశిక మల్లికార్జున రావు లు మంగళవారం నాడు పదవీ విరమణ పొందడం జరిగింది. పదవీ విరమణ పొందిన ఈ ముగ్గురు అధికారులను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శాలువాలతో , పూలమాలతో ఘనంగా సత్కరించడం జరిగింది.అనంతరం పోలీస్ శాఖలో వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు.ఈఎంతో కాలంగా పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందించిన అధికారుల అనుభవాలను నూతనంగా పోలీస్ శాఖలో భర్తీ అయిన అధికారులు సిబ్బంది స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.తమ దైనందిన కార్యక్రమాలలో వ్యాయామం,యోగా, ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అనంతరం పదవీ విరమణ పొందిన ఇద్దరు అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.పదవీ విరమణ అనంతరం వారికి ప్రభుత్వం నుంచి అందవలసిన ప్రతిఫలాలు త్వరితగతిన అందేలా చూడాలని కార్యాలయ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మంజ్యా నాయక్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,అడ్మిన్ ఆర్ఐ లాల్ బాబు,ఎంటిఓ సుధాకర్,వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణ మరియు జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు,పాల్గొన్నారు.

## పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడమే లక్ష్యం**

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**జనగామ, మార్చి 31 (వుదయం ప్రతినిధి) :**



జిల్లాలోని విద్యా సంస్థలు, సంక్షేమ కేంద్రాల్లో అందుతున్న సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జనగామ మండలం అడవికేశ్వాపూర్ ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రంతో పాటు జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చదువు స్థాయిని కలెక్టర్ స్వయంగా పరీక్షించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించి, మెనూ ప్రకారం శుభ్రమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అంగన్వాడి సెంటర్ ను తనిఖీ చేశారు. అంగన్వాడీలో చిన్నారుల ఎత్తు, బరువు కొలతలను తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పోషకాహారం సక్రమంగా అందేలా చూడాలని, కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు.

మహిళా సాధికారత, రక్షణ కోసం ఏర్పాటు చేసిన 'సఖి' కేంద్రం పనితీరును సమీక్షించారు. బాధితులకు తక్షణ న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందించడంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## మహాలక్ష్మి పథకం మహిళలకు దిక్సూచి

- రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్ల ఉచిత ప్రయాణాలు
- మేయర్ గుండు సుధారాణి
- త్వరలో రూ. 200 కోట్లతో ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్
- జిల్లా కలెక్టర్ డా. సత్య శారద

**వరంగల్, మార్చి 31 (వుదయం ప్రతినిధి) :**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం రాష్ట్ర చరిత్రలో ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిందని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం వరంగల్ బస్ స్టేషన్ ఆవరణలో ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ డా. సత్య శారదతో కలిసి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు.పథకం ప్రారంభమైనప్పటి నుండి రాష్ట్రవ్యాప్తంగా మహిళలు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు చేయగా, సుమారు రూ. 10,000 కోట్ల ప్రయాణ చార్జీలు ఆదా అయ్యాయని మేయర్ వెల్లడించారు. ఈ పథకం వల్ల గ్రామీణ మహిళలు పట్టణాలకు వచ్చి వ్యాపారాలు చేసుకునే వీలు కలిగిందని, టెక్స్‌టైల్ పార్క్‌లోని కేటెక్స్, యంగ్ వన్ వంటి సంస్థల్లో ఉపాధి పొందుతూ మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని ఆమె పేర్కొన్నారు. వరంగల్ జిల్లాలో 6 కోట్ల ఉచిత ప్రయాణాల ద్వారా మహిళలకు రూ. 270 కోట్ల ఆదా కలిగిందని కలెక్టర్ సత్య శారద తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గీసుగొండ, సంగెం మండలాల్లో మహిళా సంఘాల ద్వారా ఎలక్ట్రిక్ బస్సులను నిర్వహిస్తున్నామని, త్వరలోనే రూ. 200 కోట్లతో అత్యాధునిక ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.ఈ సందర్భంగా పథకాన్ని విరివిగా ఉపయోగిస్తూ అత్యధికంగా ప్రయాణాలు చేసిన వివిధ రంగాల మహిళలను మేయర్, కలెక్టర్లు శాలువాలతో సత్కరించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యా రాణి, కార్పొరేటర్ అనిల్ కుమార్, డీఆర్ఓ విజయలక్ష్మి, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## మహిళా ఉచిత బస్సు సౌకర్య ఉత్సవాలు

- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఆర్థిక భరోస
- కలెక్టర్ దివాకర టి.ఎస్

**ములుగు, మార్చి 31 (వుదయం ప్రతినిధి):**

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ప్రతి మహిళా ఆర్థికంగా బలోపేతం కావాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన "మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ ఉత్సవాలు 2026" కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల సాధికారత కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని కొనియాడారు.రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు మహిళలు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు చేయగా, సుమారు ₹10,000 కోట్ల ప్రయాణ ఛార్జీలు ఆదా అయ్యాయి.ములుగు జిల్లాలో 1.90 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు ₹133.25 కోట్లు ఆదా చేసుకున్నారని కలెక్టర్ వెల్లడించారు.సామాన్యులకు వరం: కూలీలు, మధ్యతరగతి మహిళలు, ఉద్యోగినులకు ఈ పథకం ఎంతో ఊరటనిస్తోందని, ప్రయాణ ఖర్చులు మిగలడం వల్ల ఆ సొమ్ము కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతోందని తెలిపారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకుల నిర్వహణను వారికి అప్పగించనున్నట్లు ప్రకటించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలని కోరారు.గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ, కేవలం ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణం కల్పించడం గర్వకారణమన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ మాట్లాడుతూ, 'ఇందిరా మహిళా శక్తి' ద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, డి ఆర్ డి ఓ శ్రీనివాస్, ఆర్టీసీ డిఎం రవిచందర్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, ఇతర అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## క్లిష్టమైన సర్జరీతో ప్రాణదానం!

- పగిలిన మెదడు రక్తనాళం ప్రాణాలు నిలిపిన
- యశోద హాస్పిటల్ వైద్యుల అద్భుతం
- కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ జయానంద్ సుధీర్, డాక్టర్ వంశీ రెడ్డి బృందం వివరాలు వెల్లడి

**హనుమకొండ, మార్చి 31 (వుదయం ప్రతినిధి) :**




ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక రోగికి మలక్‌పేట యశోద హాస్పిటల్ వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. అత్యంత సంక్లిష్టమైన 'బ్రెయిన్ అన్యూరిజం' (మెదడులోని రక్తనాళం ఉబ్బి పగిలిపోవడం) సమస్యతో వచ్చిన 49 ఏళ్ల వ్యక్తికి అత్యవసరంగా ఓపెన్ బ్రెయిన్ సర్జరీ నిర్వహించి ప్రాణాలను కాపాడమని కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ జయానంద్ సుధీర్, డాక్టర్ వంశీ రెడ్డి బృందం తెలిపారు. మంగళవారం రోజున హనుమకొండ ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 5న, సదరు బాధితుడు తీవ్రమైన తలనొప్పితో ఆసుపత్రిలో చేరారు. వైద్యులు వెంటనే సిటీ స్కాన్ నిర్వహించగా, మెదడులో తీవ్ర రక్తస్రావం (Acute Hemorrhage) జరిగినట్లు గుర్తించారు. ప్రధాన రక్తనాళంపై ఉన్న అన్యూరిజం పగిలిపోవడమే దీనికి కారణమని నిర్ధారించారు. అన్యూరిజం నిర్మాణం చాలా క్లిష్టంగా ఉండటంతో, సాధారణంగా చేసే 'కాయిలింగ్' లేదా 'స్టెంట్' పద్ధతులు ఈ కేసులో పని చేయవని వైద్యులు గుర్తించారు. దీనితో కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ జయానంద్ సుధీర్, డాక్టర్ వంశీ రెడ్డి బృందం తక్షణమే 'ఓపెన్ బ్రెయిన్ మైక్రో సర్జికల్ క్లిప్పింగ్' చేయాలని నిర్ణయించారు. తల భాగాన్ని తెరిచి మెదడులో పేరుకుపోయిన రక్తస్రావాన్ని అదుపు చేశారు. పగిలిన రక్తనాళం యొక్క బలహీనమైన భాగాన్ని మైక్రోస్కోపిక్ పద్ధతిలో చిన్న టైటానియం క్లిప్‌తో మూసివేశారు.కీలకమైన ఇతర రక్తనాళాలకు ఎటువంటి నష్టం కలగకుండా రక్త ప్రసరణను పునరుద్ధరించారు. "ఆకస్మికంగా వచ్చే తీవ్రమైన తలనొప్పిని కేవలం సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయవద్దు. ఈ కేసులో రోగిని సకాలంలో ఆసుపత్రికి చేర్చడం వల్లే మేము కాపాడగలిగాము" అని డాక్టర్ జయానంద్ సుధీర్ తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఎటువంటి శారీరక ఇబ్బందులు లేకుండా కేవలం 5 రోజుల్లోనే (డిసెంబర్ 13న) డిశ్చార్జ్ అయ్యారు.యశోద హాస్పిటల్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాసరెడ్డి, ఏవీపీ శ్రీనివాస్ చిదుర వైద్య బృందాన్ని అభినందించారు. అత్యాధునిక న్యూరో సర్జరీ వసతులు, 24/7 అందుబాటులో ఉండే నిపుణులైన క్రిటికల్ కేర్ టీమ్ వల్లే ఇలాంటి అసాధ్యమైన కేసులను సుసాధ్యం చేస్తున్నామని వారు పేర్కొన్నారు.




## ప్రకాశం స్టేడియంలో జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ఎంపికలు

**భద్రాద్రి కొత్తగూడెం,మార్చి 31 (వుదయం ప్రతినిధి):**

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మంగళవారం తెలంగాణ క్రీడా పాఠశాలలో నాలుగవ తరగతి ప్రవేశాల కోసం జిల్లా స్థాయి ఎంపిక పరీక్షలను నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియలో భాగంగా విద్యార్థులకు పలు శారీరక దృఢత్వం మరియు నైపుణ్యాల ఆధారిత పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా అభ్యర్థులకు ఎత్తు, బరువు కొలతలతో పాటు 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 6×10 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల పరుగు పందెం, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ తదితర విభాగాలలో పరీక్షలు నిర్వహించారు.ఈ పరీక్షల్లో మొత్తం 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థిని, విద్యార్థులను ఎంపిక చేసి, మొత్తం 20 మందిని వచ్చే నెల సికింద్రాబాద్ హకీంపేటలో గల రాష్ట్ర స్థాయి క్రీడా పాఠశాలలో జరిగే తుది ఎంపికలకు పంపించనున్నట్లు జిల్లా క్రీడా శాఖ అధికారి పరందామరెడ్డి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్.జి.ఎఫ్ నరేష్, కోచ్ మల్లికార్జున్, మంగీలాల్, స్టెల్లా, వేణుగోపాల్, యుగంధర్, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధ దంపతుల సమస్యపై క్షేత్రస్థాయిలో విచారణ

- తక్షణ చర్యలకు కలెక్టర్ ఆదేశాలు

**నల్లగొండ, మార్చి 31 (వుదయం ప్రతినిధి) :**

నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం రామంజపురం గ్రామానికి చెందిన 85 సంవత్సరాల వయస్సు గల వృద్ధురాలు ఈశ్వరమ్మ, ఆమె భర్త మారోజు ఓంకారం పరిస్థితిపై ఇటీవల వెలువడిన పత్రికా కథనానికి స్పందించిన జిల్లా యంత్రాంగం వెంటనే చర్యలు ప్రారంభించింది. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశాల మేరకు జిల్లా సంక్షేమ అధికారి కే.వి. కృష్ణవేణి సూచనలతో సంబంధిత అధికారులను విచారణకు పంపించారు. సీడీపీఓ అస్సరా అంజు, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ మునగాల నాగిరెడ్డి గ్రామానికి వెళ్లి వృద్ధ దంపతుల ఇంటి వద్ద సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. విచారణలో తెలిసిన వివరాల ప్రకారం, వృద్ధ దంపతులకు ఐదుగురు కుమారులు ఉండగా, ఐదేళ్ల క్రితం ప్రతి కుమారుడికి సుమారు ఒక్క ఎకరం నాలుగు గుంటల చొప్పున భూమిని పంచిపెట్టినట్లు వెల్లడైంది. ప్రస్తుతం వృద్ధ దంపతుల పేరిట ఒక ఎకరం భూమి మాత్రమే మిగిలి ఉంది. వారు నివసిస్తున్న ఇల్లు కూడా తండ్రి పేరిటనే ఉన్నట్లు గుర్తించారు. వృద్ధ దంపతులు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. ప్రస్తుతం ప్రభుత్వం నుండి ఆసరా పెన్షన్ మాత్రమే అందుతుండగా, కుమారులలో నలుగురు సంవత్సరానికి రూ.8,000 చొప్పున ఇస్తున్నా, అది అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా పెద్ద కుమారుడు ఇంట్లోకి అనుమతించక ఇబ్బందులు కలిగిస్తున్నాడని వృద్ధ దంపతులు ఫిర్యాదు చేశారు.ఇక పెద్ద కుమారుడు తనకు ఇచ్చిన భూమిని అమ్ముకున్నట్లు, మిగతా కుమారులు మాత్రమే సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో వృద్ధ దంపతులకు సరైన పోషణ అందే విధంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కుమారుల ద్వారా నెలవారీ పోషణ భత్యం లేదా ఒక్కో కుమారుడు ఒక్కో నెల బాధ్యత తీసుకునే విధంగా పరిష్కారం పరిశీలించాలని అధికారులు సూచించారు. ఈ విచారణలో మెడికల్ అండ్ హెల్త్ విభాగానికి చెందిన డాక్టర్ శిల్ప, ఐసీడీఎస్ సూపర్వైజర్ మాధవి, హెల్త్ సూపర్వైజర్ రాములమ్మ, మరియా, ఏఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వృద్ధుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



## ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**కలెక్టర్ అనురాగ్ జయంతి**

**ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై కలెక్టర్ సమీక్ష**

**యాదాద్రి భువనగిరి / మార్చి వుదయం జిల్లా ప్రతినిధి :**



జిల్లాలో చేపట్టబోయే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా బూత్ లెవల్ అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శిస్తారని తెలిపారు. అధికారులు తమతో పాటు ఎన్యూమరేటర్ ఫారమ్‌లను తీసుకువచ్చి ఓటర్ల వివరాలను సేకరిస్తారని పేర్కొన్నారు. సేకరించిన వివరాలతో నింపిన ఫారమ్‌లలో ఒక ప్రతిని అధికారుల వద్ద ఉంచుకుని, మరొక ప్రతిని సంబంధిత ఓటరుకు అందజేస్తారని వివరించారు. మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా పూర్తి చేయడానికి రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పని చేసేటప్పుడు రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్, వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు మరియు అధికారులు పాల్గొన్నారు.




## మహిళల ఆర్థిక ప్రగతికి సరికొత్త బాటలు!

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**మహబూబాబాద్, మార్చి 31 (వుదయం ప్రతినిధి) :**

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళల భద్రతకు భరోసా ఇవ్వడమే కాకుండా, వారి ఆర్థిక వృద్ధికి బాటలు వేస్తోందని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఉచిత ప్రయాణం ద్వారా రూ. 10 వేల కోట్ల చార్జీలు ఆదా చేసిన సందర్భంగా, మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆర్టీసీ, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ**

గత రెండేళ్లలో మహిళలు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు చేయడం అభినందనీయమన్నారు. ఆదా అయిన డబ్బును మహిళలు తమ పిల్లల చదువులకు, స్వయం ఉపాధికి, పొదుపనకు వినియోగిస్తున్నారని తెలిపారు. మహిళా ప్రాధాన్యత: కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందిరమ్మ ఇళ్లు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, యూనిఫాంల తయారీ వంటి బాధ్యతలను మహిళా సంఘాలకే అప్పగించామని గుర్తుచేశారు.సంక్షేమ ఫలాలు: వడ్డీ లేని రుణాలు, ప్రమాద బీమా వంటి సౌకర్యాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, డి.ఆర్.డి.ఓ మధుసూదనరాజు, మెప్మా అధికారి విజయ, ఆర్టీసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

**కోరుట్ల మార్చి 31 (వుదయం ప్రతినిధి)** మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలోని నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను మంగళవారం పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు అనంతరం జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ మంజూరైనా ఇందిరమ్మ ఇండ్లను పూర్తి స్థాయిలో గ్రౌండింగ్ చేయాలన్నారు ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్మించుకునే ప్రతి ఇంటికి తెలంగాణ ప్రభుత్వం 5 లక్షల రూపాయలు అందజేస్తుందని తెలిపారు ఇటుక కంకర బేస్మెంట్ పై ధరల నియంత్రణ ఇండ్లు లబ్ధిదారులకు ధరలు అనుగుణంగా ఉండేలా అధికారులను కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వెనుకబడి ఉన్నట్లయితే వేగవంతం పెంచాలని అధికారులకు ఆదేశించారు గడువు లోపు వారికి కేటాయించిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ భవనాలు ప్రభుత్వం నిర్దేశించిన పరిణామం కలిగి ఉండాలని లబ్ధిదారులకు నిర్మాణాన్ని సకాలంలో నిర్మించుకునేందుకు కావాల్సిన మేస్త్రీలు కార్మికులను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు ఆర్థిక పరమైన సమస్యలుంటే ఐకేపి సహకార సంఘాల ద్వారా రుణాలు పొందాలన్నారు దశల వారిగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపు నేరుగా ఆధార్ లింక్ చేయబడిన లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు అనంతరం పలు మార్కింగ్ బెస్మెంట్ స్లాబ్ లెవెల్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఇళ్ల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహా రావు హౌసింగ్ పిడి ప్రసాద్ తహసీల్దార్ ఎంపిడివో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు



# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల (వుదయం ప్రతినిధి)** రాష్ట్రంలోని మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి, ఆర్ టి సి మంచిర్యాల డిపో మేనేజర్, జిల్లా మహిళా సమాఖ్య ప్రతినిధి అనితలతో కలిసి ఎ పి ఎం లు, డి పి ఎం లు, స్వయం సహాయక సంఘాల మహిళలతో మహాలక్ష్మి పథకం అమలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ద్వారా రాష్ట్రంలోని మహిళలకు దాదాపు 10 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని తెలిపారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుండి ఏ ప్రాంతానికైనా ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు నగదు పొదుపు జరుగుతుంని, తద్వారా ఆ నగదును కుటుంబ పోషణ నిమిత్తం వినియోగించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు పథకంలో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ మహిళల పేరిట పథకం అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని, 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేస్తూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలలో దాదాపు 5 వేల మంది విద్యార్థుల సంఖ్య పెరిగిందని అభినందించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ప్రహరీ గోడ, వంటశాల, త్రాగునీరు, అదనపు గదులు ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు గుణాత్మక విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజున స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేయబడిన ఏకరూప దుస్తులను సకాలంలో విద్యార్థులకు అందించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా 16 బస్సులు వస్తున్నాయని, ఆర్ టి సి సంస్థకు లీజ్ కి ఇవ్వడం ద్వారా అదనపు ఆదాయం చేకూరుతుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చేపట్టిన ఇందిరా మహిళ శక్తి భవన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని, రాష్ట్రంలో ప్రథమంగా నిర్మాణం పూర్తి చేయబడి ప్రారంభానికి సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ భవన్ లో స్వయం సహాయక సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవచ్చు అని, శిక్షణ తరగతులు ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. మహిళల సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని అన్నారు. మహిళను కుటుంబ పెద్దగా నిర్ధారించి అన్ని ప్రభుత్వ పథకాలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డులను మహిళల పేరిట జారీచేసి చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం అందించడం జరుగుతుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాలు అన్ని వ్యాపార రంగాలలో అభివృద్ధి చెందే దిశగా బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీ లేని రుణాలను అందించడం జరుగుతుందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ మహాలక్ష్మి ఉచిత బస్ సౌకర్యం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అధికారులుపాల్గొన్నారు.

## కేజీబీవీల్లో జాతీయ స్థాయి.. పోటీ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్




**పెద్దపల్లి, (వుదయం ప్రతినిధి)** పెద్దపల్లి జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (KGBVs) చదువుతున్న విద్యార్థినులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధం చేసే దిశగా ప్రత్యేక కోచింగ్ కార్యక్రమాలను ప్రారంభించినట్లు జిల్లా గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ (GCDO) కవిత ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. గ్రామీణ ప్రాంత బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలనే లక్ష్యంతో ప్రత్యేక కోచింగ్ ప్రారంభిస్తున్నామని, కేజీబీవీ జూలపల్లి లో, వైద్య రంగంలో రాణించాలనుకునే విద్యార్థినుల కోసం NEET (నీట్) కోచింగ్ , కేజీబీవీ రామగుండం లో ఇంజనీరింగ్ రంగం పై ఆసక్తి ఉన్న వారి కోసం JEE (జేఈఈ) కోచింగ్ , కేజీబీవీ సుల్తానాబాద్ లో ,న్యాయ రంగంలో స్థిరపడాలనుకునే విద్యార్థినుల కోసం CLAT (క్లాట్) కోచింగ్ ,నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో, పక్కా ప్రణాళికతో కూడిన బోధన అందిస్తున్నామని , విద్యార్థినులకు అవసరమైన స్టడీ మెటీరియల్ పంపిణీ చేయడంతో పాటు, వారిలోని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు క్రమం తప్పకుండా మాక్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల బాలికలకు పట్టణ విద్యార్థులతో సమానంగా అవకాశాలు కల్పించి, మెడికల్, ఇంజనీరింగ్, లా వంటి ప్రతిష్ఠాత్మక రంగాలలో వారు ప్రవేశాలు పొందేలా చేయడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశమని, విద్యార్థినులు సద్వినియోగం చేసుకొని జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని పేర్కొన్నారు.



## ఆర్టీసీ నిర్మల్ బస్టాండ్ లో.. మహాలక్ష్మీలకు సన్మానం



**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)** మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం నుండి 9 డిసెంబర్ 2023 నుండి 29.03.2026 వరకు రాష్ట్ర ములోని మహిళలు మహిళా సారిత లక్షంగా 10 వేల కోట్ల రూపాయలు లబ్ధిపొందారని సుమారు 290 కోట్ల ప్రయాణికులు ఉచిత ప్రయాణం పూర్తి చేసుకున్నారని డిపోమేనేజర్ కే. పందరి తెలిపారు.మహిళలు చిన్న చిన్న గ్రామాల నుండి నాణ్యమైన వైద్యం కోసం హైదరాబాద్ వెళ్తుంటారని, కుటుంబ సభ్యులతో కలిసి పుణ్య క్షేత్రలకు వెళ్తున్నారని, సామాన్య, మధ్యతరగతి మహిళలు, విద్యార్థినీలు కూలీలు ఎందరో ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకుంటున్నారని , ఈ పథకం ద్వారా ఎందరో నిరుద్యోగ మహిళలు షాపింగ్ మాల్, మరియు చిన్న,చిన్న ప్రయివేట్ ఉద్యోగాలు చేస్తున్నారని ఆయన తెలిపారు.ముఖ్య అతిథీగా ఏ.ఎం.వి.ఐ.ఆసిఫ్ హాజరయ్యారు.ప్రభుత్వం చేపట్టిన పథకాలను మహిళలు ఉపయోగించుకోవాలని ఆయన తెలిపారు.కార్యక్రమములో మహిళా సమైక్య కార్యదర్శి కట్ల లక్ష్మి ఆర్టీసీ లో తరచూ ప్రయాణిస్తున్న ప్రయాణికులు బూర్గు రాధిక, ప్రీతీ సుందర్, స్రవంతి, ప్రసన్న బస్ స్టేషన్ మేనేజర్ వి.జి.రెడ్డి, డి. సి.ఎస్. ఆర్.శేఖర్,టి. వి.రమణ ఉద్యోగులు ప్రయాణికులు పాల్గొన్నారు.

# జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దినేష్‌కు ఘన సన్మానం



**ధర్మపురి, వుదయం ప్రతినిధి ):** జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన సంగ నభట్ల దినేష్‌ను ధర్మపురి మండ ల ప్రైవేట్ పాఠశాలల కరస్పాం డెంట్ల సంఘం నాయకులు మంగ ళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధర్మపురిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో విద్యావనరుల అభివృ ద్ధికి,గ్రంథాలయాల పురోగతికి దినేష్ సేవలు అందించాలని కోరారు. విద్యార్థులకు చేరు వయ్యేలా గ్రంథాలయాలను తీర్చి దిద్దడంలో ఆయన చూపుతున్న చొరవను ప్రశంసించారు. భవిష్య త్తులో విద్యా రంగానికి ఆయన మరిన్ని సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షు లు జాజాల.రవీందర్, ఉపాధ్య క్షులు ఆరికెల్ల సతీష్,జనరల్ సెక్రటరీ గడ్డం.వేణుగోపాల్ రెడ్డికోశాధికారి చల్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు శ్యామ్,గట్ల శ్రీనివాస్ ధర్మపురి మండల పాఠశాల కరస్పాండెంట్లు తోట.శంకర్,స్తం భంకాడి రమేష్,జొన్నల నవీన్, పైడి మారుతి,బుగ్గారం మండల కరస్పాండెంట్లు నక్కరాజు, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ప్రాణం తీస్తే.. పదేళ్ల జైలు



**ధర్మపురి, (వుదయం ప్రతినిధి ):** మద్యం మత్తులో వాహనం నడిపి అమాయకుడి మరణానికి కార ణమైన వ్యక్తికి కోర్టు కఠిన శిక్ష విధించింది.13 ఏళ్ల క్రితం జరిగిన ఈ రోడ్డు ప్ర మాద కేసులో నింది తుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమా నా విధిస్తూ జగిత్యాల ఒకటవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి నారాయణ మంగళవారం కీలక తీర్పు వెలువరించారు. కేసు వివరాలిలా ఉన్నాయి మంచిర్యాల జిల్లా తిలక్ నగర్‌కు చెంది న వనం అంజయ్య (53), 2013 ఫిబ్రవరి 2న మద్యం సేవించి కారును అతివే గంగా నడిపి ధర్మపురి మండలం తిమ్మాపూర్ వద్ద కుంటాల భీరయ్య (40) అనే వ్యక్తిని వెనుక నుండి ఢీకొట్టాడు. ఈ ఘటనలో భీరయ్య అక్కడిక క్కడే మృతి చెందగా, పారిపో తున్న నిందితుడిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగిం చారు. అప్పటి సీఐ కోటేశ్వర్ ఆధారాలతో కేసును దర్యాప్తు చేశారు.నిందితుడి రక్త నమూ నాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి, అతను మద్యం సేవించి నట్లు ని రూ పిం చా రు . సా క్ష్యాధా రా ల ను పరిశీలించిన న్యాయ మూర్తి, అంజయ్యను దోషిగా నిర్ధారిస్తూ పదేళ్ల జైలు శిక్ష ఖరారు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడు తూ డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల అమాయక ప్రాణాలు బలికావడాన్ని తీవ్రంగా పరిగణిస్తామన్నారు.నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు బృందాన్ని,ఏపీపీ నర్సయ్యను ఎస్పీ ప్రత్యేకంగా అభినం దించా రు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు ఎస్సై జి. మహేష్




**ధర్మపురి, (వుదయం ప్రతినిధి ):** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ధర్మపురి పట్టణంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.జగిత్యాల జిల్లా కొండ గట్టులో హనుమాన్ జయంతి వేడుకల అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శిం చుకునే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు సబ్ ఇన్స్పెక్టర్ జి.మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భక్తుల రద్దీ దృష్ట్యా పట్టణంలోని ప్రధాన రహదారులపై వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఆంక్షలు అమలు చేస్తు న్నట్లు పేర్కొన్నారు. హనుమాన్ చౌరస్తా నుంచి ఆలయం వైపు వెళ్లే దారిలో, గాంధీ చౌరస్తా నుంచి నంది చౌరస్తా వరకు ఉన్న రహదారుల్లో వాహనాలను నిలపడం నిషిద్ధం. స్థానికులు,భక్తులు తమ వాహనాలను నిర్దేశించిన ప్రాంతా ల్లోనే పార్క్ చేయాలని సూచించారు. అరైవ్ అలైవ్ రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా మైనర్లు వాహనాలు నడిపినా,నంబర్ ప్లేట్లు లేని వాహనాలను రోడ్డుపైకి తెచ్చినా కఠిన ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ క్రమబద్ధీక రణలో భాగస్వాములు కావాలని ఎస్సై కోరారు.

## మహాలక్ష్మి పథకంతో ఆర్థిక స్వావలంబన కలెక్టర్ గరిమ అగ్రవాల్




**రాజన్న సిరిసిల్ల, మార్చి 31** ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల భద్రతకు భరోసా ఇస్తుందని, ఆర్థిక స్వావలంబనకు ఉపయోగ పడుతుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించి రెండేండ్లకుపైగా పూర్తి అయి 290 కోట్ల ప్రయాణాలు మహిళలు చేయగా, రూ.10 వేల కోట్లు ఆదా చేసిన సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఆర్టీసీ అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం వేడుకలు నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై పలువురు మహిళలకు ఉచిత బస్ టికెట్ అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకుంటున్న మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సుల సేవలు నిత్యం వినియోగిం చుకుంటున్న పలువురు మహిళలు తమ అభిప్రాయాలు వెల్లడించారు. కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. మహిళల ఆర్థిక స్వావలంబనతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అన్ని పథకాలు, సంక్షేమ ఫలాలు వారి పేరిట, వారికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండో రోజు డిసెంబర్ 9వ తేదీ 2023 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉచిత బస్సు ప్రయాణంతో ప్రైవేట్ ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు చేసే మహిళలు డబ్బులు ఆదా చేసుకొని, వాటిని పిల్లల చదువు, స్వయం ఉపాధి, పొదుపు వైపు మళ్లిస్తున్నారని తెలిపారు. మహిళల ఆర్థిక ప్రగతికి ఈ పథకం దోహదం చేస్తుందని, బస్సుల్లో మహిళల భద్రతకు భరోసా ఇస్తుందని పేర్కొన్నారు. పలు ప్రభుత్వ పథకాలు మహిళల పేరిట రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు వారి పేరిట ఇస్తున్నామని వివరించారు. ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేశామని తెలిపారు. చీరలు మన సంస్కృతికి నిదర్శనమని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మతు పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. స్కూల్ యూనిఫాం వారితో కుట్టించామని పేర్కొన్నారు. సం ఘా ల్లో ని మ హి ళ ల కు రుణ బీమా, బ్యాంక్ లింకేజ్ రుణాలు, వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి, ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ సూచించారు. డీఆర్డీఓ గీత, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సిరిసిల్ల, వేములవాడ ఆర్టీసీ డీఎంలు ప్రకాశరావు, శ్రీనివాస్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్, తహసీల్దార్ మహేష్ కుమార్, పాల్గొన్నారు.

## సింగరేణి సంస్థ ఆస్తులను కాపాడటం ప్రతి ఉద్యోగి బాధ్యత



**మందమర్రి /రామకృష్ణాపూర్ (వుదయం ప్రతినిధి)** సింగరేణి సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగి సంస్థ యొక్క ఆస్తులను బాధ్యతాయుతంగా వ్యవహరించి ఆస్తులను కాపాడాలని మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ సింగరేణి ఉద్యోగులకు పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ బేస్ వర్క్ షాప్ లో మొదటి షిఫ్ట్ లో విధులు నిర్వహిస్తున్న ఎం శ్రీలత వర్క్ షాప్ లోని విలువైన సామాగ్రిని అదే గనిలో ఎలక్ట్రీషన్ గా పనిచేస్తున్న ఓ వ్యక్తి దొంగతనంగా తరలిస్తుండడం గమనించి ఏమాత్రం భయపడకుండా సదరు వ్యక్తిని పట్టుకొని వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించింది. సమయస్ఫూర్తితో సంస్థ ఆస్తి చోరీకి గురికాకుండా నివారించడంతో శ్రీలతను మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ అభినందించి ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిఎం రాధాకృష్ణ మాట్లాడారు. సంస్థ పట్ల అంకితభావంతో పనిచేసే కార్మికులు అందరికీ ఆదర్శమని కొనియాడారు. విధుల్లో అప్రమత్తంగా ఉండి సంస్థ ఆస్తులను కాపాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్యూరిటీ అధికారి రవి, అధికారులు పాల్గొన్నారు.

# మహాలక్ష్మి పథకం విజయోత్సవ సభ

**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)** తెలంగాణ ప్రభుత్వం 2023 డిసెంబర్ 9న ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి పథకం' ద్వారా రాష్ట్రంలోని మహిళలు, ట్రాన్స్‌జెండర్‌లకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన పి వీజీ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఈ పథకం అమలులో భాగంగా 2026 మార్చి 30 నాటికి రాష్ట్రవ్యాప్తంగా రూ.10,000 కోట్ల విలువైన ఉచిత ప్రయాణ సేవలు, 290 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని బస్ స్టేషన్లలో 'విజయోత్సవ సభలు' నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శ్రీ రాజశేఖర్ , అసిస్టెంట్ మేనేజర్ శ్రీమతి దేవపాల పాల్గొని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు, ట్రాన్స్‌జెండర్‌లకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించారు. మహిళల ఆర్థిక భారం తగ్గించడంలో మహాలక్ష్మి పథకం కీలక పాత్ర పోషిస్తోందని ఆమె పేర్కొన్నారు.

## అకాల వర్షం... రైతులకు అపార నష్టం..

**జన్నారం (వుదయం విలేకరి)** జన్నారం మండలంలోని వివిధ గ్రామాలల కురిసిన అకాల వర్షాలకు మామిడి ,నిమ్మ తోటల రైతులు నష్టపోయారు. సోమవారం అర్ధరాత్రి ఒకటిన్నర గంటలకు ఉరుములు,మెరుపులు భారీ ఈదురుగాలలతో గంటకు పైగా వర్షం నమోదయింది.దీంతో జన్నారం మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన కౌలు రైతులు ఉప్పు గంగన్న,ఒడ్డెటి నారాయణ, ఒడ్డేటి సురేష్ తాము 30 ఎకరాలలో వేసిన మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే దేవునిగూడెం కామన్ పల్లి,ఇందనపల్లి గ్రామాలలో మామిడి తోటల్లో మామిడికాయలు నేల రాలడంతో భారీ నష్టం వాటిల్లింది. తిమ్మాపూర్ లో రాత్రి వీచినా గాలులకు జునుగూరు మల్లయ్య కు చెందిన పొలంలో వడ్లు మొత్తం రాలి నేల పాలయ్యాయి.ఇంధనపల్లి గ్రామంలో వంగపల్లి రాజన్న కు చెందిన మామిడి తోటలో ఈదురు గాలులకు మామిడి కాయలు మొత్తం నెలకొరిగి సుమారు రెండు లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.కొన్నిచోట్ల నిమ్మ చెట్లు పడిపోవడంతో భారీ నష్టం వచ్చిందని పలు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.తమను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు కోరారు.



# గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు

**బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, కేంద్రంగా అభివృద్ధి**
**ముఖ్యమంత్రి బాసర పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి**
**రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు**



**నిర్మల్ జిల్లా (వుదయం ప్రతినిధి)** బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక ఆహ్లాదక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు.ఏప్రిల్ 6న బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రానున్నందున, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన సమీక్షించారు. ముందుగా పలు నిర్మాణాలు చేపట్టబోయే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను చూశారు. పనుల ప్రారంభోత్సవాల ఏర్పాటుకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆలయంలో ముఖ్యమంత్రి నిర్వహించు పూజలకు సంబంధించి వివరాలను చర్చించారు. ఆ తర్వాత దేవాలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. బాసర ఆలయానికి దేశవ్యాప్తంగా ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి బాసర పర్యటన సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు. బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకల వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ మరమ్మత్తు, నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను ప్రారంభించాలని అన్నారు. జిల్లాలో పుష్కరాల నిర్వహణకు సంబంధించి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తానని వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని అన్నారు. ఆయా శాఖలకు సంబంధించి అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సంబంధిత ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయ రామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లపై సివిల్ సప్లై అధికారుల దాడులు



**లక్షెట్టిపేట్, (వుదయం ప్రతినిధి ):** గృహావసరాలకు సంబంధించిన సిలిండర్లను హోటళ్లలో, ఫాస్ట్ ఫుడ్ సెంటర్, టిఫిన్ సెంటర్లలో వినియోగిస్తున్నారనే సమాచారంతో మంగళవారం సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించారు. మంచిర్యాల జిల్లా ఇంచార్జ్ డీఎస్ఓ పట్టణంలోని పలు హోటల్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో దాడులు చేసి 14 సిలిండర్లను స్వాధీనం చేసుకొని 6A కేసు నమోదు చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహ అవసరాలకు వినియోగించే డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్గా వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిలిండర్ల కొరత ఉందనే సాకుతో



ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. ఈ దాడుల్లో డిటిసిఎస్ స్రవంతి రెడ్డి, సివిల్ సప్లై ఇన్స్పెక్టర్లు భూమేష్, మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు







## విద్యార్థులు పాఠశాల దశ నుంచే..

# క్రమశిక్షణతో అనుకున్నది సాధించాలి

### మంత్రి వాకిటి శ్రీహరి

**వనపర్తి (వుదయం ప్రతినిధి)** విద్యార్థులు పాఠశాల దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకొని క్రమశిక్షణతో వాటిని సాధించే దిశగా శ్రమించాలని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సూచించారు. మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని ఎం.వి. రామన్ సీబీఎస్ఈ పాఠశాలలో నిర్వహించిన "విజ్ఞాన వైభవం-2026" కార్యక్రమానికి మంత్రి వాకిటి శ్రీహరి తో పాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 51 స్టాల్స్ లో విద్యార్థులు ప్రదర్శించిన 741 శాస్త్రీయ ప్రదర్శనలు, వినూత్న ఆవిష్కరణలను అతిథులు పరిశీలించి అభినందించారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని మంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల దశ నుంచే లక్ష్యాలను ఏర్పరచుకొని క్రమశిక్షణతో వాటిని సాధించే దిశగా శ్రమించాలని సూచించారు. కష్టపడే తత్వం ఉంటే ఇలాగైనా అనుకున్నది సాధించవచ్చు అని విద్యార్థులకు తెలియజేశారు. జ్ఞానం సంపాదించాలన్న సంకల్పం ఉన్నవారికి అది సిద్ధిస్తుందని, ఆ మార్గంలోనే అందరూ ముందుకు వెళ్లాలని సూచించారు. మనల్ని కన్న తల్లిదండ్రులే మనకు నిజమైన హీరోలని, వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు. తల్లిదండ్రులను గురువులను గౌరవించిన వారికి జీవితంలో ఉన్నత స్థానాలు దక్కుతాయని తెలియజేశారు. చదువుతోపాటు విద్యార్థులకు క్రమశిక్షణ కూడా చాలా ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. ఇక పాఠశాల యాజమాన్యాన్ని ఉద్దేశిస్తూ అన్ని దానాలలోకెల్లా విద్యాదానం గొప్పదని, అటువంటి విద్యను ఆత్మకూరు పట్టణంలో ఎంతో మందికి అందిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను పెట్టుకొని క్రమశిక్షణతో చదివి జీవితంలో ముందుకు వెళ్లాలని సూచించారు. జీవితంలో క్రమశిక్షణ అనేది చాలా ముఖ్యమని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. జీవితంలో ఏ రంగాన్ని ఎంచుకున్నా అందులో అత్యుత్తమంగా రాణించాలని తెలియజేశారు. వనపర్తి జిల్లా విద్యా రంగానికి నిలయమని కాబట్టి జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేసిన కలెక్టర్ అందరూ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అప్పుడే విజయం సాధించగలమని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు తమ పట్ల ఎవరైనా తప్పుగా ప్రవర్తించినా లేదా ఇబ్బంది కలిగించినా వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. అవసరమైతే పోలీసులకు కూడా సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాను జాగ్రత్తగా వినియోగించాలని ఎస్పీ పేర్కొన్నారు. పిల్లలు సైబర్ ఉచ్చులో పడకుండా తల్లిదండ్రులు చూడాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఎం శ్రీధర్ గౌడ్, ప్రిన్సిపల్ అన్సీ శ్రీధర్ గౌడ్ చేతుల మీదుగా ముఖ్య అతిథులు మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సునీత రెడ్డి లను సన్మానించి వారికి మొమెంటును అందజేశారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థుల నృత్య ప్రదర్శనలు సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. 37 ఏళ్ల క్రితం పాఠశాలలను స్థాపించి విద్యను అందిస్తున్నట్లు చైర్మన్ ఎం శ్రీధర్ గౌడ్ ఈ సందర్భంగా తెలియజేశారు. ఆత్మకూరు మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి, వైస్ చైర్ పర్సన్ శ్రీనివాస్, డీఈవో అబ్దుల్ ఘని, తహసిల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగికి

# పదవీ విరమణ తప్పనిసరి

**గద్వాల (వుదయం ప్రతినిధి)** జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘంగా 34 సంవత్సరాలపాటు క్రమశిక్షణతో, నిబద్ధతతో సేవలు అందించి మంగళవారం పదవీ విరమణ పొందుతున్న హెడ్ కానిస్టేబుల్స్ నందూరి విజయ భాస్కర్ రాజు, ఈడుగ నరసింహ గౌడ్‌లకు జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఇద్దరూ 1992 సంవత్సరంలో సివిల్ కానిస్టేబుల్స్‌గా పోలీస్ శాఖలో చేరి తమ సేవా ప్రయాణాన్ని ప్రారంభించారని తెలిపారు. సేవా కాలమంతా నిజాయితీ, క్రమశిక్షణ, బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూ శాఖకు గౌరవాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. నరసింహ గౌడ్ 2018లో, భాస్కర్ రాజు గారు 2022లో హెడ్ కానిస్టేబుల్స్‌గా పదోన్నతి పొందారని చెప్పారు. భాస్కర్ రాజు ఈగలపెంట, ఉప్పునుంతల, కొత్తూరు, గద్వాల్ టౌన్, అయిజ పోలీస్ స్టేషన్లలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించగా, నరసింహ గౌడ్ తాండూరు, రాజోలి, నారాయణపేట, మానవపాడు, తలకొండపల్లి, గద్వాల్ రూరల్, అయిజ, గట్టు, గద్వాల్ సీసీఎస్, అలంపూర్ పోలీస్ స్టేషన్లలో విశేష సేవలందించారు. వీరిద్దరూ తమ విధుల్లో ఎప్పుడూ బాధ్యతాయుతం గా వ్యవహరిస్తూ ప్రజలకు సేవ చేయడంలో ముందుండి, ఉన్నతాధికారుల ప్రశంసలు అందుకున్నారు. పోలీస్ శాఖలో పనిచేసే సమయంలో సంపాదించిన అనుభవం, విలువలు జీవితాంతం వారికి దోహదపడతాయని ఎస్పీ పేర్కొన్నారు. పదవీ విరమణ సందర్భంగా పోలీస్ శాఖ తరపున వారికి ఘనంగా వీడ్కోలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. మిగిలిన జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి రోజూ యోగ, ధ్యానం వంటి అలవాట్లను అలవరుచుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ కె. శంకర్, అలంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వి. ప్రదీప్ కుమార్, శాంతినగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టాటా బాబు, గద్వాల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి. శ్రీను, అలంపూర్ ఎస్సై రామకృష్ణ, అయిజ ఎస్సై పి. శ్రీనివాస్ రావు తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. భాస్కర్ రాజు, నరసింహ గౌడ్ కుటుంబ సభ్యులు హాజరై అభినందనలు తెలిపారు.



# కొడంగల్ కు ధీటుగా వికారాబాద్ అభివృద్ధి

**అనంతగిరి అభివృద్ధి కి మెగా సంస్థ తో వెయ్యి కోట్ల ఒప్పందం**
**దీంతో 3 వేలమంది యువత కు ఉద్యోగ అవకాశాలు**
**100 ఎకరాల్లో టెక్స్ టైల్స్ పార్కు అభివృద్ధి**
**మున్సిపల్ అభివృద్ధి కి HMDA నిధులూ270 కోట్లు**
**శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్**




**వికారాబాద్: వుదయం ప్రతినిధి :** మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య ఆద్వర్యంలో వికారాబాద్ పురపాలక కార్యాలయం లో పురపాలక సంఘం వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఎక్స్ అఫిషియో హోదాలో తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు.ఈసందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ కొడంగల్ కు ధీటుగా వికారాబాద్ ను అభివృద్ధి చేస్తానని స్పీకర్ తెలిపారు. ముందుగా ఇటీవల జరిగిన పురపాలక సంఘం ఎన్నికలలో ప్రజల ఆదరణ, అభిమానల తో విజయం సాధించి బాధ్యతలు స్వీకరించిన పాలక వర్గానికి ఆయన అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా నూతన పాలక వర్గం ఆద్వర్యంలో జరుగుతున్న మొదటి బడ్జెట్ సమావేశం సందర్భంగా అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియ జేశారు. బడ్జెట్ విషయాలపై అవగాహన కోసం త్వరలోనే ప్రొఫెషనల్స్ తో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్టు పాలక వర్గానికి తెలిపారు. అనంతరం శాసన సభాపతి సభ్యుల నుద్దేశించి మాట్లాడుతూఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తాను మంత్రి గా ఉన్నప్పుడు, కేంద్ర మంత్రి, స్వర్గీయ సూదిని జైపాల్ రెడ్డి తో మాట్లాడి రూ. 2,300 కోట్లతో వికారాబాద్ పట్టణానికి శాటిలైట్ ప్రాజెక్టు మంజూరు చేయించానని గుర్తు చేశారు. దేశంలో మొత్తం ఏడు శాటిలైట్ ప్రాజెక్టులు మంజూరు కాగా అందులో ఇదొటని స్పీకర్ తెలిపారు.అయితే దురదృష్టవశాత్తు ప్రభుత్వాలు మారడంతో మెజార్టీ నిధులు రాలేదని స్పీకర్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వం లోని ప్రజా ప్రభుత్వంలో కొడంగల్ కు దీటుగా వికారాబాద్ మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తానని స్పీకర్ పేర్కొన్నారు మున్సిపాలిటీ లో విలీనమైన గ్రామాలలో అవసరమైన ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయిస్తానని పట్టణ పరిధిలో అవసరమైన మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జి లను మంజూరు చేయించడానికి రైల్వే శాఖతో ప్రయత్నాలు చేస్తున్నట్టు స్పీకర్ తెలిపారు.మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ మర్రి చెన్నారెడ్డి గారు నిర్మించిన శివసాగర్ చెరువును పూర్తిగా ఆధునికీరించ నున్నట్టు,హైదరాబాద్ లోని NTR పార్కు తరహాలో వికారాబాద్ లో కూడా పార్కును ఏర్పాటు చేయనున్నట్లు స్పీకర్ తెలియజేశారు. నిధులు తెచ్చి ఇచ్చే బాధ్యత తనదని, వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని స్పీకర్ సభ్యులకు సూచించారు. వికారాబాద్ ప్రాంతానికి సాగునీరు తీసుకు రావడానికి ,ప్రాణహిత చేవెళ్ల, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీరు తీసుకురావాలని గట్టి ప్రయత్నం చేసిన సాధ్య పడలేదని స్పీకర్ పేర్కొన్నారు.గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసి ఈ ప్రాంతానికి అన్యాయం చేసిందని ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వికారాబాద్ ప్రాంతానికి తీసుకురావాలని మళ్ళీ తాను ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్టు స్పీకర్ తెలిపారు.ఈసారి ఖచ్చితంగా విజయం సాదించడం ఖాయమని స్పీకర్ ధీమా వ్యక్తంచేశారు.ఈ పథకం పూర్తయితే వికారాబాద్ పట్టణానికి త్రాగునీటితో పాటుగా నియోజకవర్గంలో సాగునీటి ఇబ్బందులు కూడా తొలగుతాయని స్పీకర్ తెలియజేశారు.అదేవిధంగా TUFIDC నిధులు 60 కోట్ల మంజూరు అయ్యాయని ,HMDA నిధులు 270 కోట్లు త్వరలోనే మంజూరు కానున్నట్టు స్పీకర్ తెలిపారు. అనంతగిరిని వెయ్యి కోట్ల రూపాయల తో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మెగా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందని,ఈ ప్రాజెక్టు పూర్తయితే ,ప్రాంతం లోని మూడు వేల మంది యువకులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని స్పీకర్ తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మంత్రిగా తాను ఉన్నప్పుడు పట్టణ పరిధిలోని నారాయణపూర్ లో వంద ఎకరాలలో టెక్స్ టైల్స్ పార్కు అభివృద్ధి చేసి నాలుగు వేల మంది మహిళలకు ఉపాధి కల్పించాలని ప్రయత్నం చేసినట్టు ఆయన గుర్తు చేశారు.కానీ గత ప్రభుత్వం పదేళ్ళు పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేసిందని గత ప్రభుత్వ వైఖరి పై మండిపడ్డారు, అట్టి టెక్స్ టైల్స్ పార్క్ ను తిరిగి ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు మొదలు పెట్టినట్టు స్పీకర్ తెలిపారు. పట్టణ అభివృద్ధి, ప్రజలకు అవసరమైన




మౌళిక వసతులు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి అవసరమైన నిధులను మంజూరు చేయించడానికి నిరంతరం కృషి చేయనున్నట్టు స్పీకర్ తెలిపారు.ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు తప్ప ,మిగిలిన సమయంలో , అధికార ,ప్రతిపక్షం అనే తేడా లేకుండా అందరినీ కలుపుకుని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలని ఆయన సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి కట్టుగా పనిచేసి నిధులను సక్రమంగా, సమర్ధవంతంగా ఖర్చు చేసి వికారాబాద్ మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, అందుకు తన వంతుగా పూర్తి సహకారాలు అందిస్తానని స్పీకర్ భరోసా ఇచ్చారు. తాను అందరు రాజకీయ నాయకుల లాంటి వ్యక్తిని కాదని ఆదాయం, ఆస్థులపై ఆశ తనకు లేదని స్పీకర్ తెలిపారు.వికారాబాద్ ప్రాంత అభివృద్ధి తన లక్ష్య మని,మర్రి చెన్నారెడ్డి లాగా ప్రాంత అభివృద్ధి పై తన చెరగని ముద్ర ఉండాలని తన కోరికని స్పీకర్ తెలిపారు.చిన్న వయసులోనే చైర్మన్ అయిన తన కూతురు గడ్డం అనన్య పై అందరి ఆశీర్వాదం ఉండాలని ఈ సందర్భంగా స్పీకర్ కోరారు.చైర్ పర్సన్ గడ్డం అనన్య మాట్లాడుతూ వార్డుల సభ్యులు చెప్పిన సమస్యలన్నింటినీ తాను వ్యక్తిగతంగా నోట్ చేసుకుని,ప్రతి వార్డులో పర్యటించి కామన్ ప్రాబ్లమ్స్ ను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తానని చైర్మన్ హామి ఇచ్చారు. వార్డు సభ్యులు వార్డులలో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బంది గురించి అవగాహన కలిగి ఉండాలని,తద్వారా ఇబ్బందులు తలెత్తిన సమయంలో వెంటనే సమస్యను పరిష్కరించే అవకాశం ఉంటుందని చైర్మన్ తెలియజేశారు. శ్రద్ధ తీసుకుని అధికంగా నిధులను తీసుకుని రావాలని రాష్ట్ర శాసన సభాపతి కి మున్సిపల్ చైర్మన్ విజ్ఞప్తి చేశారు. ఈ వార్షిక బడ్జెట్ సమావేశం లో వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ విక్రం సింహా రెడ్డి, ఆయా వార్డు కౌన్సిలర్ లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే ఎన్నికలలో

# గులాబీ సత్తా చాటుదాం

**కల్వకుర్తి మార్చి 31 (వు దయం)** రాబోయే జెడ్పిటిసి, ఎంపీటీసీ ఎన్నికలలో గులాబీ పార్టీ సత్తా చాటుదామని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి, మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ లు పిలుపునిచ్చారు మండల కేంద్రంలోని ఏ వి ఆర్ గార్డెన్లో మంగళవారం ఉద్యమ నాయకుడు జంగిలి నిరంజన్ అధ్యక్షతన నిర్వహించిన విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం లో ముఖ్య అతిథులుగా మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యం రెడ్డి, మాజీ జెడ్పిటిసి విజితా రెడ్డి, పుట్ట రాంరెడ్డి, వెంకటయ్య గౌడ్, ఐజాక్, కానుగుల జోగయ్య, జంగిలి ఆనంద్, జంగిలి యాదగిరి, తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచులు టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు ఈ సందర్భంగా పార్టీ పటిష్టతకు పని చేసే నాయకునికి మండల పార్టీ అధ్యక్ష పదవి కట్టబెట్టాలని పలువురు పేర్కొన్నారు



# రుణమాఫీ చేయాలి తహసిల్దార్ కు వినతి

**నారాయణపేట టౌన్ వుదయం ప్రతినిధి** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 2 లక్షల రైతు రుణమాఫీని వెంటనే చేయాలని భారతీయ కిసాన్ సంగ్ ఆధ్వర్యంలో మంగళవారం నారాయణపేట తాసిల్దార్ కు వినతి పత్రాన్ని అందజేశారు.భారతీయ కిసాన్ సాంగ్ నారాయణపేట పట్టణ మండల కమిటీ పిలుపుమేరకు గతంలో ప్రభుత్వము ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ చేస్తా అని హామీ ఇచ్చి ఇంతవరకు చేయని కారణంగా బ్యాంకులో రుణాలకు వడ్డీలు పెరిగిపోయి అప్పులు ఎక్కువ కావడం వల్ల రైతాంగం ఆందోళన చెందుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రైతు రుణమాఫీని వెంటనే అందజేయాలని వారు ఈ సందర్భంగా తాసిల్దార్ ను కోరారు. అంతేకాక ఈ ప్రాంతంలో వ్యవసాయ పంటలు ఆరుగాలం పండించిన అడవి పందులు జింకలు, నెమలిల్లా కోతుల వల్ల పంటలు నాశనం అవుతున్న సందర్భంగా ఇట్టి విషయాన్ని భారతీయ కిసాన్ సాంగ్ దృష్టి సాధించి తాసిల్దార్ అమరేందర్ కృష్ణ కి వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో నగర ఉపాధ్యక్షులు బాపనపల్లి రాము, తంగు విశ్వనాథ్ రెడ్డి ,మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గంప,నారాయణపేట, బైరం కొండ, జిల్లాల పూర్ ,జాజపురం, షేర్నపల్లి, పేరపల్ల ,పగిడిమారి ,గడిముక్కనపల్లి రైతులు పాల్గొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు. రైతు ఆర్థికంగా బాగుంటేనే ఈ ప్రాంతం బాగుంటుంది రైతు ఇబ్బంది పడితే ఈ ప్రాంతం అధోగతి అవుతుంది రాత్రింబవళ్లు కష్టపడి పంటలు పండించి నిరంతరంగా ఆహార ధాన్యాలు పండించిన రైతుల బాధలు పరిగణాలకు తీసుకొని వెంటనే మాఫీకి అనుమతి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



## బావోజి జాతరకు

# పటిష్ట బందోబస్తు



**నారాయణపేట (వుదయం ప్రతినిధి)** నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలం, తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో ఏప్రిల్ 1వ తేదీ నుండి 4 వ తేదీ వరకు నిర్వహించబడుతున్న ప్రసిద్ధ భావోజి జాతర సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. మంగళవారం జాతర నిర్వహణను సమగ్రంగా పరిశీలించిన ఎస్పీ, పోలీస్ అధికారులకు పలు కీలక సూచనలు అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వేలాది మంది భక్తులు హాజరయ్యే ఈ జాతరను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తేరు కార్యక్రమం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నాలుగు దిక్కుల రోప్ పార్టీలు ఏర్పాటు చేయాలని, ముందస్తు బందోబస్తు ప్లాన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. భక్తుల రాకపోకలు సజావుగా సాగేందుకు ప్రత్యేక ట్రాఫిక్ డైవర్షన్‌లు అమలు చేయబడినట్లు, వాహనాల పార్కింగ్ కోసం వేర్వేరు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.జాతరలో భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, దొంగతనాలు, ఈవ్ టీజింగ్ వంటి సంఘటనలను అరికట్టేందుకు మఫ్టీలో (సివిల్ డ్రెస్సులో) పోలీసులను మోహరించామని తెలిపారు. డయల్ 100 కు సమాచారం అందించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. .ఈ కార్యక్రమంలో కోస్గి సీఐ సైదులు, మద్దూర్ ఎస్సై విజయ్ కుమార్, ఎస్ బి ఎస్సై నరేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## "అరైవ్ అలైవ్" పై పోలీసుల ప్రత్యేక అవగాహన



**అలంపూర్ (వుదయం ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత నిస్తూ అమలు చేస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా మంగళవారం జోగులాంబ గద్వాల్ జిల్లాలోని పదవ బెటాలియన్ కన్వెన్షన్ హాల్‌లో విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇటిక్యాల ఎస్సై రవి ఆధ్వర్యంలో సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ శ్రీ టి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఒక విషాద ఘటనను ఉదాహరణగా పేర్కొంటూ, నిర్లక్ష్యం వల్ల అమూల్యమైన ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందని అన్నారు. ఒక్క చిన్న తప్పిదం కుటుంబాలను తీవ్ర విషాదంలోకి నెడుతున్నదని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం వంటి ప్రాథమిక నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రోడ్డు భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా, ప్రతి పౌరుడి కర్తవ్యమని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, వేగ పరిమితులను పాటించడం వంటి ప్రాథమిక ట్రాఫిక్ నియమాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా అనుసరించాలని సూచించారు. అలాగే కుటుంబ సభ్యులు, స్నేహితులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వారిని అడ్డుకోవడం ద్వారా బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. సురక్షితంగా ప్రయాణించి క్షేమంగా గమ్యానికి చేరుకోవడమే నిజమైన విజయం అని ఆయన స్పష్టం చేశారు.పదవ బెటాలియన్ హెచ్.ఎఫ్.ఏ.సి కమాండెంట్ శ్రీ జయరాజు మాట్లాడుతూ ప్రాణ భద్రత ప్రతి ఒక్కరికీ అత్యంత ముఖ్యమని తెలిపారు. వాహనాల సాంకేతిక స్థితి సక్రమంగా ఉండేలా చూసుకోవడం, డ్రైవింగ్ సమయంలో అప్రమత్తంగా ఉండడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాలను కాపాడే ప్రధాన రక్షణ సాధనమని వివరించారు. అదనపు ఎస్పీ కే. శంకర్ మాట్లాడుతూ, "అరైవ్ అలైవ్" కార్యక్రమం ప్రధాన లక్ష్యం ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించడం అని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు. అదనపు ఎస్పీ కే. శంకర్, పదవ బెటాలియన్ కమాండెంట్ జయరాజు, డీఎస్పీ నరేందర్ రెడ్డి, ఆర్.ఐలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెంపొందించడం తో పాటు బాధ్యతాయుత డ్రైవింగ్ పై స్పష్టమైన సందేశం అందించారు.

## దళిత సర్పంచ్ ను అవమానించిన

# వారిని అరెస్టు చేయాలి

**నారాయణపేట (వుదయం ప్రతినిధి)** నారాయణపేట జిల్లా మండలంలోని అమిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ లక్ష్మీ నీ సీతారాముల కళ్యాణం నుంచి బలవంతంగా లేపి అవమానించిన అగ్రకులానికి చెందిన మాజీ సర్పంచ్ స్వప్న,వెంకట్రామిరెడ్డి లను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షుడుడి.దేవేంద్రప్ప,కార్యదర్శి నర్సింహ,అంబేడ్కర్ సంఘం సభ్యుడు టి.ఆశ ప్పడిమాండ్ చేశా రు.మంగళవారం సర్పంచ్ లక్ష్మీ నీ పరామర్శించిన అనంతరం అంబేడ్కర్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లా డుతూ ఊరి కట్టుబాటు ప్రకారం ప్రతి సీతారాముల కల్యాణం లో సర్పంచ్ పూజలో కూర్చోవాలని నిర్ణయాన్ని కాదని వెంకట్రామిరెడ్డి దంపతులు పూజలో కూర్చున్న సర్పంచ్ లక్ష్మీ నీ అగ్రకుల అహంకారం తో బలవంతంగా లేపి పంపి అవమానించారని అన్నా రు.దాంతో సర్పంచ్ పోలీసు లకి ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు వారిని అరెస్ట్ చేయక పోవడం విడ్డూరం అని అన్నారు.మరొకరికి అవమానం జరగరాదంటే వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తా మని హెచ్చరించారు.కాగా కుల మార్పిడిపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని అన్నారు. వెంటనే అమలు చేసి మత మార్పిడులు అరికట్టాలని కోరారు.ఈ సమావేశంలో బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు ఎస్.విజయ్ కుమార్,ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి నాయకులులక్ష్మణ్,కనకయ్య, హన్మంతు,ఎం.కనకయ్య పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

**సంగారెడ్డి జిల్లా ప్రతి నిధి , వుదయం.** జిల్లాలో విద్యా మరియు శిశు సంక్షేమ సేవల అమలు పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం కొండాపూర్ మండలం గుంతపల్లి గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి, అక్కడి వసతులు, సేవల నాణ్యతపై సమగ్రంగా పరిశీలించారు.మొదట ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్, తరగతి గదుల పరిస్థితి, పరిశుభ్రత, మరుగుదొడ్లు, త్రాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పాఠశాల పరిసరాలు, కాంపౌండ్ వాల్ వంటి మౌలిక సదుపాయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యతపై ఆరా తీశారు. భోజనం బాగుందని విద్యార్థులు తెలపడంతో కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని, ప్రతి విద్యార్థి చదువు పై దృష్టి పెట్టాలని సూచించారు.తదుపరి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలోని వంటగది, పరిశుభ్రత, పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. పిల్లలకు గుడ్డు మరియు ఇతర పౌష్టికాహారం అందుతున్నదా అని ఆరా తీశారు. చిన్నారుల శారీరక మరియు మానసిక అభివృద్ధికి పౌష్టికాహారం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం సరైన మోతాదులో పోషకాహారం అందించాలని ఆదేశించారు. ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పిల్లలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, త్రాగు నీరు, చల్లని వాతావరణం కల్పించాలని తెలిపారు. పిమ్మట మోనిన్ పరిశ్రమను సందర్శించి పరిశీలించిన కలెక్టర్ పరిశ్రమలో అమలవుతున్న భద్రతా చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని కంపెనీ యాజమాన్యాన్ని అభినందించారు. తహసిల్దార్ అశోక్, ఎంపీడీవో వేణుగోపాల్, సర్పంచ్ అనంతరెడ్డి, హౌసింగ్ ఏఈ,తదితరులు పాల్గొన్నారు.



# బీసీ రక్షణ చట్టం కోసం 'సింహగర్జన'..

## ఏప్రిల్ 11న చారిత్రాత్మక దీక్ష

## హక్కుల సాధనకు బీసీవై పార్టీ సమరశంఖం: తీగల అశోక్




**చండూరు, వుదయం:**

బీసీల డిమాండ్ల సాధన కోసం భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై) పోరాటాన్ని ఉధృతం చేస్తోంది. 'బీసీ సింహ గర్జన' సభలో ప్రకటించిన ఐదు కీలక డిమాండ్లపై తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించకపోవడంపై పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. సామాజిక న్యాయం కోసం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని బీసీవై పార్టీ పిలుపునిచ్చింది.

**స్పందించని యంత్రాంగం**

గత నెల 22న విజయవాడలో నిర్వహించిన సభలో కులగణన, రిజర్వేషన్లు సహా పలు డిమాండ్లను పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ప్రకటించారు. ఈ అంశాలపై ముఖ్యమంత్రులు, మంత్రు లు, కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించినా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదని పార్టీ తెలంగాణ రాజకీయ వ్యవహారాల కమిటీ (PAC) సభ్యుడు తీగల అశోక్ కుమార్ ఆక్షేపించారు. సభ ముగిసి 40 రోజులు గడిచినా పాలకు లు మౌనం వహించడం బడుగు వర్గాల ను అవమానించడమేనని పేర్కొన్నారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే..!**

రాష్ట్ర వ్యాప్తంగా తక్షణమే సమగ్ర కుల గణన చేపట్టాలి. బీసీ రక్షణ చట్టాన్ని తీసుకురావడంతో పాటు రాజధానిలో బీసీలకు 1000 ఎకరాలు కేటాయించాలి. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 44శాతంరిజర్వేషన్లు అమలు చేయాలి. బీసీ కార్పొరేషన్లకు తక్షణమే నిధులు విడుదల చేసి బలోపేతం చేయాలి.

**ఏప్రిల్ 11 నుంచి ఆమరణ దీక్ష:**

డిమాండ్ల సాధనలో భాగంగా బోడె రామచంద్ర యాదవ్ ఏప్రిల్ 11న విజయవాడలో ఆమరణ నిరాహార దీక్షకు దిగనున్నారు. తన ప్రాణాన్ని పణంగా పెట్టయినా బీసీల రాజకీయ సాధికారత సాధించడమే లక్ష్యమని పార్టీ వర్గాలు తెలిపాయి. కుల సంఘాలు, జేఏసీలు రాజకీయాలకు అతీతంగా ఈ పోరాటానికి మద్దతు తెలపాలని అశోక్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకుంటే ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# మహాలక్ష్మి పథకం పేద మధ్యతరగతి మహిళలకు మంచి చేసింది: మునిసిపల్ చైర్ పర్సన్




**మధిర, వుదయం:**

రెండున్నర సంవత్సరాల క్రితం 2023 డిసెంబర్ 9 సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సారథ్యంలో మహాలక్ష్మి పథకం ప్రారంభమైందని మధిర మునిసిపల్ చైర్పర్సన్ సామినేని సుజాత రామనాథం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అత్యంత చరిత్రాత్మక నిర్ణయాల్లో మహిళలకు ఉచిత బస్ ప్రయాణ ఒకటి. మహాలక్ష్మి పథకం పేద మధ్యతరగతి మహిళలకు మేలు చేసింది. ఆధార్ ఉంటే చాలు రాష్ట్రంలో ఎక్కడికైనా ప్రయాణించవచ్చు అనే భరోసాని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చింది. ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మహిళా ప్రయాణికులు రూ.10 వేల కోట్ల విలువైన రవాణా ఛార్జీలను ఆదా చేసుకున్నారు. ఆర్టీసీకి ప్రభుత్వం సకాలంలో బకాయిలు చెల్లిస్తుండటంతో ఆర్టీసీకి ఆదాయం గణనీయంగా పెరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అప్పులు ఊబిలో ఉన్న ఆర్టీసీ లాభాల బాట పట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా ప్రజా సంక్షేమం కోసమే అన్నది అందరూ గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ రామిశెట్టి రామయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ కోనాదని కుమార్, మధిర మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుసూరం శెట్టి కిషోర్, మిరియాల వెంకటరమణ గుప్తా, బో దేపూడి రేవతి, కర్నాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సి, ఎస్టీల సమస్యల పరిష్కారానికి సమిష్టి కృషి అవసరం: కలెక్టర్




**నల్గొండ, వుదయం:**

షెడ్యూల్డ్ కులాలు, తెగలపై జరిగే ఆకృత్యాల నివారణతో పాటు వారి సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ఎస్సి, ఎస్టి అట్రాసిటీ కేసుల జిల్లా స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సి, ఎస్టీలపై దాడులు, అస్పృశ్యత నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వం 1989లో చట్టాన్ని అమలు చేసిందని, తదనంతరం మరిన్ని చట్టాల ద్వారా వారి హక్కులను రక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.జిల్లాలో ఎస్సి, ఎస్టీలపై జరిగిన ఆకృత్యాల కేసులను సమీక్షించేందుకు, నివారణ చర్యలు చేపట్టేందుకు ఈ కమిటీ ఏర్పాటు చేయబడిందని, నూతనంగా ఎంపికైన సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎస్సి, ఎస్టీలపై దాడుల కేసుల్లో నమోదయ్యే సెక్షన్లు, బాధితులకు అందించే నష్టపరిహారం, కేసుల దర్యాప్తు తదితర అంశాలపై సభ్యులకు సమగ్ర అవగాహన కల్పించారు.గ్రామాల్లో ఎస్సి, ఎస్టీలపై వివక్ష, అంటరానితనం నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సమస్యలను వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కోరారు. నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమని, ఎవరైనా ఎస్సి, ఎస్టీలపై వివక్ష చూపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి కేసులు తమ దృష్టికి వచ్చిన వెంటనే నమోదు చేసి, 60 రోజుల్లో విచారణ పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. బలమైన సాక్ష్యాధారాలు ఉన్న కేసుల్లో దోషులకు శిక్షలు పడిన సందర్భాలు ఉన్నాయని వెల్లడించారు. ప్రతినెల చివరి పని దినాన్ని పౌరహక్కుల దినంగా నిర్వహిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని, దేవాలయ ప్రవేశం నిరాకరణ, దేవదాసి వ్యవస్థ, అంటరానితనం వంటి సమస్యలను వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.సమావేశంలో నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు బెజ్జం సైదులు, మల్లేష్ కుమార్, అనిత కుమారి, శ్రీనివాస్, భాస్కర్ నాయక్, భీరంపల్లి సైదులు, ధనలక్ష్మి తదితరులు మాట్లాడారు. ఎస్సి, ఎస్టీలపై జరిగే కేసుల్లో సత్వర న్యాయం జరగాలని, గ్రామాల్లో ఇంకా వివక్ష కొనసాగుతోందని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కాలనీలలో రహదారులు, మురికికాల్వలు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాల కొరతను కూడా ప్రస్తావించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శశికళ, ఆర్డీవోలు, డిఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు ఉచిత బస్సు పథకం బలమైన అడుగు: కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ, వుదయం:**

మహిళల ఆర్థిక, సామాజిక భద్రతకు ఉచిత బస్సు పథకం భరోసానిస్తూ స్వావలంబన దిశగా బలమైన అడుగుగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం నల్గొండ ఆర్టీసీ బస్టాండ్లో మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం ద్వారా భారీగా ఆదా సాధించిన మహిళలను సన్మానించే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా లక్షలాది మహిళలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు.2023 డిసెంబర్లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించగా, మహిళలు మరియు విద్యార్థులు కలిసి దాదాపు రూ.10 వేల కోట్ల మేర ఆదా చేసుకున్నారని వివరించారు. నల్గొండ జిల్లా స్థాయిలోనే సుమారు రూ.340 కోట్ల వరకు ఆదా జరగడం విశేషమని అన్నారు.ఈ పథకం వల్ల మహిళలు తమ రోజువారీ ప్రయాణ ఖర్చులను తగ్గించుకుని ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలు, పిల్లల విద్య, ఆరోగ్య పరిరక్షణకు వినియోగిస్తున్నారని తెలిపారు. ఉచిత బస్సు సదుపాయం మహిళల ఆర్థిక భద్రతకు పునాది వేస్తోందని కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పష్టం చేశారు.ప్రభుత్వం మహిళల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వ్యాపార అవకాశాలు కల్పిస్తూ బ్యాంకు రుణాల ద్వారా ఆర్థికంగా బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా విద్యా శిక్షణ అందించి మహిళల్లో చదువు పట్ల చైతన్యం పెంచుతున్నామని అన్నారు. అదేవిధంగా ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని, మహిళా రైతులకు రైతు బీమా, పింఛన్లు వంటి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. త్వరలో అమలుకానున్న ఇందిరమ్మ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డుల ద్వారా ప్రతి ఇంటికి సన్నబియ్యం పంపిణీ కొనసాగుతున్నట్లు తెలిపారు. మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు నెలకు సగటున రూ.5,000 వరకు ఆదా చేసుకుంటున్నారని తెలిపారు. ఆర్టీసీ సదుపాయాల మెరుగుదల కోసం అవసరమైన వసతులు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.అనంతరం ప్రతిరోజూ ఉచిత బస్సులో ప్రయాణించే నలుగురు మహిళలను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ స న్మానించారు. ప్రయాణికురాలు కల్పన మాట్లాడుతూ ఈ పథకం మహిళలకు ప్రభుత్వం అందించిన గొప్ప గౌరవమని, గ్రామీణ ప్రాంతాల నుంచి ఆసుపత్రులు, ఉద్యోగాలు, చిన్న వ్యాపారాల కోసం ప్రయాణించే వారికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. బస్సు చార్జీల ఆదా కుటుంబాభివృద్ధికి దోహదం చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మేనేజర్ జాన్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా మహిళా సంక్షేమ అధికారి కృష్ణవేణి, సిడిపిఓ హరిత, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిపో మేనేజర్ రమణ హుస్సేన్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత పాటిల్ ను సత్కరించిన దమ్మపేట బార్ సభ్యులు



**దమ్మపేట వుదయం**

కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ వసంత్ పాటిల్ గారిని దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ బార్ అసోసియేషన్ గా నూతనంగా ఎన్నిక అయిన బార్ అసోసియేషన్ అధ్యక్షులు గొంది మురళీ మోహన్, వైస్ ప్రెసిడెంట్ ముప్పిడి శ్యామ్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి లక్కినేని నరేంద్ర బాబు, కార్యదర్శి తుమ్మ రాంబాబు, కోశాధికారి తామ బాలరాజు, న్యాయవాదులు షేక్ దర్గావాలి, కాలం సంధ్యా రాణి, నల్లపు ఉదయ్ కుమార్,గోళ్ళ భవానీ కృష్ణ యాదవ్ గద్దల అప్పారావు లు కలిసి మర్యాదపూర్వకంగా సన్మానించడం అయింది. కోర్టుకు కావలసిన సిబ్బంది మరియు ఇతర సమస్యలు గురించి వారితో ప్రస్తావించడమైంది.

# యాసంగి ధాన్యం ప్రతి గింజ కొనుగోలు చేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి కొత్తగూడెం, వుదయం**

యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహిస్తూ రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ తో కలసి కొనుగోలు కేంద్రాల ఇన్చార్జులు, వ్యవసాయ, సహకార, డీఆర్డీఏ, తూనికలు –కొలతలు, రవాణా, మార్కెటింగ్ శాఖ అధికారులు, సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,87,309 మెట్రిక్ టన్నులధాన్యం దిగుబడి అంచనా ఉన్నదని, అందులో సన్న రకం 1,35,365 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 51,944 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో 168 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, అవసరాన్ని బట్టి అదనపు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం ధాన్యాన్ని ఏ, బి గ్రేడ్లుగా విభజించి మద్దతు ధరలు నిర్ణయించినట్లు తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ. 2389, బి గ్రేడ్కు రూ.2369 ధరలు నిర్ణయించగా, సన్న రకం వడ్లకు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వబడుతుందని వెల్లడించారు. ఈ సంవత్సరం ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు, హమాలీలు ఎండబారకుండా టెంట్లు, షెడ్ నెట్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసి తగిన నీడ కల్పించాలని సూచించారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రద్దీ నియంత్రణ కోసం క్రాప్ బుకింగ్ ఆధారంగా రైతులకు టోకెన్లు జారీ చేయాలని, అవసరమైన ఏర్పాట్లపై చెక్లిస్ట్ జారీచేసి, దాని ప్రకారం చర్యలు తీసుకొని ధృవీకరణ నివేదికలు సమర్పించాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమంగా ధాన్యం రాకుండా జిల్లాలో చెక్పోస్టుల ద్వారా పటిష్ఠ నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని అదే రోజు ఆన్లైన్ నమోదు చేసి రైస్ మిల్లులకు తరలించాలని, రవాణాలో జాప్యం జరగకుండా మిల్లర్లు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ధాన్యం విక్రయాలపై రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తే రైతులకు మెరుగైన ధర లభిస్తుందని, రైతులను సన్నద్ధం చేయాలని సూచించారు.

# వ్యర్థాలు తిని ప్రాణాపాయం లో గేదె – కోదాడలో విజయవంతమైన శస్త్రచికిత్స



**కోదాడ, వుదయం**

ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థాలు జంతువుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా ఒక పాడి గేదె పొట్టలో పెద్ద మొత్తంలో బట్ట పీలికలు, గుడ్డ సంచులు, తాళ్లు, సుతీల్ దారాలు, ప్లాస్టిక్ కవర్లు బయటపడిన ఘటన వెలుగులోకి వచ్చింది.చింతల పాలెం మండలం నక్కగూడెం గ్రామానికి చెందిన రైతు పాడి గేదె వారం రోజులుగా మేత మేయకుండా, పాలు ఇవ్వడం ఆపేసింది. పొట్ట ఉబ్బి పోవడంతో పాటు పేడ వేయడం కూడా ఆగిపోవడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. కడుపునొప్పితో విలవిలలాడు తుండటంతో మెరుగైన వైద్యం కోసం కోదాడ ప్రాంతీయ పశువైద్యశాలకు తీసుకువచ్చారు.గేదెను పరీక్షించిన అసిస్టెంట్ డైరెక్టర్ డా. పి. పెంటయ్య, ఎనిమిదో నెల గర్భంతో ఉన్న గేదె పొట్టలో గ్యాస్ అధికంగా పేరుకుపోయినట్లు గుర్తించి అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించారు. శస్త్రచికిత్సలో గేదె పొట్టలో పెద్ద మొత్తంలో బట్టలు, గుడ్డ సంచులు, తాళ్లు, దారాలు, ప్లాస్టిక్ కవర్లు గట్టిగా పేరుకుపోయినట్లు గుర్తించారు. వాటిని అతి కష్టపడి తొలగించి శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేశారు.చికిత్స అనంతరం గేదె ఆరోగ్యంగా కోలుకుంటోందని వైద్యులు తెలిపారు. ప్రజలు వాడిన ప్లాస్టిక్, బట్టలు, సంచులు ఎక్కడ పడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పశువులను వ్యర్థాలు ఉన్న ప్రాంతాల్లో మేపరాదని వైద్యులు సూచించారు.ఈ శస్త్రచికిత్సలో సిబ్బంది రాజు, రామకృష్ణ, సాగర్, రాజేష్ పాల్గొన్నారు.

# నానో ఎరువులతో సుస్థిర వ్యవసాయం ప్రోత్సాహం: కలెక్టర్




**నల్గొండ, వుదయం:**

నానో ఎరువుల వినియోగం ద్వారా సుస్థిర వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులను ఆధునిక పద్ధతుల వైపు మళ్లించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. మంగళవారం తిప్పర్తి మండలం దుప్పలపల్లి రైతు వేదికలో నిర్వహించిన నానో ఎరువుల వినియోగంపై సాంకేతిక ప్రదర్శన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, డ్రోన్ సాంకేతికతను ఉపయోగించి నానో యూరియాను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పంట దిగుబడులను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.2026 వానాకాలం సాగుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని, సన్న రకం వరి సాగును ప్రోత్సహించాలని అన్నారు. వానాకాలం సీజన్లో వ్యవసాయ యంత్రాల వినియోగాన్ని పెంచేందుకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. పంట మార్పిడి పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తూ వేరుశెనగ, పెసలు, మినుములు వంటి పంటలను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఉద్యాన పంటల వైపు రైతులను మళ్లిస్తూ స్వీట్ ఆరెంజ్, మలబార్ వంటి అధిక ఆదాయం వచ్చే పంటలను సాగు చేయాలని సూచించారు. పత్తి సాగుపై దృష్టి పెట్టే రైతులకు నకిలీ విత్తనాలు అందకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఒరిజినల్ విత్తనాలే అందేలా పర్యవేక్షణ బలోపేతం చేయాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కేసులు నమోదు చేసి రైతులను రక్షించాలని తెలిపారు.జిల్లాకు కేటాయించిన సుమారు 10 వేల సాయిల్ హెల్త్ కార్డులను త్వరితగతిన రైతులకు అందజేసి భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని సూచించారు. సాంప్రదాయ వ్యవసాయంతో పాటు ఆర్గానిక్ సాగు విధానాలపై రైతులకు అవగాహన కల్పించి అధిక ఆదాయం పొందేలా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ సుభాషిణి, తిప్పర్తి మండల ఏఈఓ సన్నీ రాజ్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# శ్రీ గాయత్రి ఆశ్రమంలో రిటైర్డ్ ఉద్యోగులతో ఆత్మీయ స్పర్శ కార్యక్రమం

## ప్రేమ్ సుస్థిర గురూజీ 65 వ పుట్టిన రోజు వేడుకలు




**దమ్మపేట, వుదయం:**

దమ్మపేట మండల కేంద్రంలో గల గాయత్రీ ఆశ్రమం వ్యవస్థాపకులు ప్రేమ్ సుస్థిర గురూజీ తన 65 వ పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం శ్రీ గాయత్రి ఆశ్రమం లో రిటైర్డ్ ఉద్యోగులతో ఆత్మీయ స్పర్శ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ చాలీసా భక్త బృందం, రామదండు భక్తులు చుట్టూ ప్రక్క ప్రాంతాల గాయత్రీ అమ్మవారి భక్తులు పాల్గొన్నారు. గురూజీ మాట్లాడుతూ 2001వ సంవత్సరం లో ప్రారంభం అయిన ఆశ్రమం 2026 జూన్ 23,24 సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా నిర్వహించనున్నాము అని తెలియజేశారు. అన్న ప్రసాదం స్టీల్ ప్లేటులో, మంచినీరు స్టీల్ గ్లాసులో వాడటం ప్లాస్టిక్ వాడకుండా పర్యావరణం రక్షించడంలో ఆశ్రమ నియమము ఆదర్శం అన్నారు. ప్రస్తుతము జీవిస్తున్న కుటుంబాల్లో పెద్ద వాళ్ళను గౌరవించని పరిస్థితి చాలా బాధాకరం కల్గిస్తుంది అన్నారు, మహిళలను గౌరవించని సంప్రదాయం సమాజంలో కొనసాగటం ఆవేదన కల్గిస్తుంది చేశారు. ఆదిశంకరాచార్యులు సనాతన ధర్మాన్ని, దేశవ్యాప్తంగా నాలుగు దిక్కులా పీఠాలను స్థాపించారు అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో మొట్ట మొదటగా అమర యోగి మరియు గురువు మహావతార్ బాబాజీ విగ్రహ స్థాపన ఆధ్యాత్మికతకు, ధ్యానానికి ప్రతీకగా ఆశ్రమంలో నెలకొల్పాము అన్నారు. ఏప్రిల్ 16వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12 వరకు ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించబోతున్నాం అని తెలియజేశారు. హనుమాన్ చాలీసా భక్త బృందం సభ్యులకు అమ్మవారి చీరలను ఇచ్చి వారి సేవలను కొనియాడారు. రిటైర్డ్ ఉద్యోగుల సమక్షంలో రావెల్లి అజయ్ కుమార్, అద్దంకి లక్ష్మీనారాయణ లను శాలువాలతో సత్కరించారు. ఆశ్రమంలో భక్తులు తోడుంటే మరిన్నీ ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేద్దాం అన్నారు. ఆశ్రమముకు సేవకులు కావాలి అన్నారు. మిత్రులు వరప్రసాద్ తో గల సాన్నిహిత్యం తెలియజేశారు. గడిచిన పాతిక సంవత్సరాలలో దమ్మపేట మండల చుట్టూ ప్రక్కల చాలా మంది తనకు, ఆశ్రమంకు సహాయ సహకారాలు అందించారు అని తెలియజేశారు. నెలలో 15 రోజులు ఆశ్రమంలోనే అందుబాటులో ఉంటాను అని, మీ కుటుంబంలో పుట్టిన రోజు వేడుకలు, వివాహ వార్షికోత్సవాలు కుటుంబ సభ్యులు చేయకపోతే ముందస్తుగా సమాచారం ఇస్తే నేను చేస్తాను అన్నారు. తదనంతరం భక్తులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. వచ్చిన వృద్ధులు తినటానికి స్వయంగా ఆహారం అందించారు. వచ్చినవారికి అన్నప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ సూర్యనారాయణ, నంగెడ్ల కనకదుర్గ, తిరునగరి సంధ్య, వర్ధనమ్మ, మాడా వైకుంఠరావు, అత్యం వెంకటేశ్వరరావు, పసుమర్తి రామభద్రం కుసుమాంబ, మధు, షేక్ గోరె, పిట్టల రాంబాబు, చిక్కాల శ్రీనివాసరావు, కారుమూరి సతీష్, పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా శ్రీను రమణి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానాయకుడు పొంగులేటి పై విషప్రచారమా



**భద్రాద్రి కొత్తగూడెం, వుదయం**

వట్టినాగులపల్లి సర్వే నెంబర్ 245 వ్యవసాయ భూమిలో జరుగుతున్న భూ వివాదానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి కి, వారి కుమారుడికి గాని ఎలాంటి సంబంధం లేదని, రాఘవ కన్స్ట్రక్షన్స్ కు తాము ఏలాంటి డెవలప్మెంట్ అగ్రిమెంట్ చేయలేదని వట్టినాగులపల్లి యజమానులు స్పష్టంగా చెప్తున్నప్పటికీ బిఆర్ఎస్ నాయకులు కావాలనే విషప్రచారం చేస్తుండంపై రేగళ్ల పెద్ద తండా సర్పంచ్ లావుడ్య పూర్ణ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలను చర్చించాల్సిన ప్రజా ప్రతినిధులు, చిల్లర వ్యక్తుల్లాగా ప్రవర్తిస్తు కేవలం కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బ తీసేలా తప్పుడు ప్రచారం చేయడం మాజీ మంత్రులు కేటిఆర్, హరీష్ రావు ల అవగాహనా రాహిత్యానికి నిదర్శనం అన్నారు. అనవసర వివాదంలో మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ని, రాఘవ కన్స్ట్రక్షన్స్ ని లాగి నిందారోపణలు చేస్తే బిఆర్ఎస్ నేతల ఇళ్లను ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

# జిల్లా కలెక్టర్ను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి



**యాదాద్రి భువనగిరి / వుదయం:**

యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కొప్పుల వెంకట్ రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని గ్రామ పంచాయతీల అభివృద్ధి, సర్పంచులు ఎదుర్కొంటున్న పలు అంశాలపై కలెక్టర్తో చర్చించారు. తమ విజ్ఞప్తులను సానుకూలంగా విన్నందుకు అధికారులకు వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన వెంకట్ రెడ్డి ని కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు అభినందించారు.

# 3న శ్రీ దొడ్డి కొమురయ్య జయంతి... జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి




**ఖమ్మం, వుదయం:**

ఏప్రిల్ 3న ఉదయం 10 గంటలకు ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద శ్రీ దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో శ్రీ దొడ్డి కొమురయ్య విగ్రహానికి పుష్పమాలంకరణ చేయడం జ రుగుతుంద ని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయ ప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## విటమిన్ ఎ లోపం హెచ్చరిక సంకేతాలు



విటమిన్ ఎ శరీరానికి ఒక అత్యవసర పోషకం.. దీని లోపం అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. అందువల్ల, దాని లక్షణాలను ముందుగానే గుర్తించడం ముఖ్యం. విటమిన్ ఎ.. అనేది మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషించే ఒక అవసరమైన ముఖ్య పోషకం.. దీనిని రెటినోల్ అని కూడా పిలుస్తారు.. ఇది మంచి కంటిచూపును కాపాడుకోవడానికి, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడుతుంది. కొవ్వులో కరిగే విటమిన్ ఎ.. పునరుత్పత్తి వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. విటమిన్ ఎ లోపం వల్ల కంటి సమస్యలు, తరచుగా వచ్చే ఇన్ఫెక్షన్లు, పొడి చర్మం వంటి అనేక ఆరోగ్య సమస్యలు తలె


త్తవచ్చు. చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలు, బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ ఉన్నవారు విటమిన్ ఎ లోపానికి గురయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. సరైన పోషకాహారం లేకపోవడం, పోషకాల కొరత, సరైన జీవనశైలి లేకపోవడం వంటివి ప్రధాన కారణాలు కావచ్చు. అందువల్ల, ఆరోగ్యకరమైన శరీరాన్ని కాపాడుకోవడానికి తగినంత విటమిన్ ఎ తీసుకోవడం చాలా అవసరం. అత్యంత సాధారణ లక్షణం రాత్రిపూట

దృష్టి మందగించడం లేదా దృష్టి కోల్పోవడం. కళ్లలో పొడిబారడం, చికాకు కూడా కలగవచ్చు. పొడిబారిన, నిర్జీవమైన చర్మం, పెదవులు పగలడం, జుట్టు బలహీనపడటం కూడా దీని సంకేతాలే. తరచుగా జలుబు, దగ్గు లేదా ఇన్ఫెక్షన్లు రావడం కూడా రోగనిరోధక శక్తి బలహీనపడటానికి ఒక సంకేతం కావచ్చు. కొంతమందిలో గాయాలు మానడానికి ఎక్కువ సమయం పడుతుంది, దీనికి విటమిన్ ఎ లోపంతో సంబంధం ఉండవచ్చు. ఈ లక్షణాలన్నీ ఈ ముఖ్యమైన పోషకం లోపాన్ని సూచిస్తాయి. విటమిన్ ం లోపం వల్ల ముఖ్యంగా రేచీకటి, కళ్లు పొడిబారడం, బిటాట్స్ మచ్చలు వంటి తీవ్రమైన కంటి సమస్యలు వస్తాయి. దీనివల్ల దృష్టి లోపం, చర్మం పొడిబారడం, రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల తరచుగా ఇన్ఫెక్షన్లు, పిల్లల్లో ఎదుగుదల లోపాలు కలుగుతాయని పేర్కొన్నారు. విటమిన్ ఎ లోపాన్ని సరిచేయడానికి ఆహారంలో మార్పులు చేసుకోవడం చాలా అవసరం. క్యారెట్లు, చిలగడదుంపలు, పాలకూర, ఆకు కూరలు విటమిన్ ఎ కు మంచి వనరులుగా పరిగణిస్తారు. పాలు, గుడ్లు, చేపలు కూడా ప్రయోజనకరమైనవే.సమతుల్య ఆహారం, పోషకాలు అధికంగా ఉండే రోజువారీ ఆహారం ఈ లోపాన్ని అధిగమించడానికి సహాయపడతాయి. అవసరమైతే, వైద్యుని సలహా మేరకు సప్లిమెంట్లను కూడా తీసుకోవచ్చు. సరైన ఆహారం తీసుకోవడమే కాకుండా, జీవనశైలి పట్ల కూడా శ్రద్ధ వహించడం ముఖ్యం. సమయానికి భోజనం చేయండి, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండండి. క్రమం

తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోండి. పిల్లలు, గర్భిణీ స్త్రీలు ముఖ్యంగా వారి ఆహారంపై శ్రద్ధ వహించాలి. ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవడం ద్వారా శరీరాన్ని దీర్ఘకాలం పాటు ఆరోగ్యంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## ఈ 3 పదార్ధాలతో బీకేర్‌ఫుల్..

శరీరంలో అతి ముఖ్యమైన అవయవాల్లో కాలేయం ఒకటి.. ఇది ఎన్నో విధులను నిర్వహిస్తుంది..



అయితే.. ఈ రోజుల్లో కాలేయ సంబంధిత వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. అందువల్ల, ఆరోగ్యకరమైన కాలేయాన్ని కాపాడుకోవడానికి ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం చాలా ముఖ్యం.ఉరుకులు పరుగుల జీవితంలో కాలేయ (లివర్) సంబంధిత సమస్యలు వేగంగా పెరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణాలు పేలవమైన జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు.. జంక్ ఫుడ్ వినియోగం పెరగడం. శరీరంలో కాలేయం ఒక కీలకమైన.. ముఖ్యమైన అవయవం. ఇది శరీరాన్ని నిర్విషీకరణ చేయడం, జీర్ణక్రియకు సహాయపడటం, అవసరమైన పోషకాలను నిల్వ చేయడం వంటి పనులు చేస్తుంది. కాలేయం సరిగ్గా పనిచేయకపోతే, అది ఫ్యాటీ లివర్, హెపటైటిస్, కాలేయ నష్టం వంటి వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. అందువల్ల, ఆరోగ్యకరమైన కాలేయాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం.. మంచి అలవాట్లు అవసరం. ఆహారం విషయంలో నిర్లక్ష్యం కాలేయంపై అధిక ఒత్తిడిని కలుగజేసి , క్రమంగా దాని సామర్థ్యాన్ని బలహీనపరుస్తుంది. అందువల్ల, మన దినచర్యలో సమతుల్య ఆహారాన్ని చేర్చుకోవడం, హానికరమైన ఆహార పదార్థాలకు దూరంగా ఉండటం. లేడీ హార్డింగ్ హాస్పిటల్‌లోని వైద్య విభాగం డైరెక్టర్, హెచ్ఓడి అయిన డాక్టర్ ఎల్.హెచ్. ఘోటేకర్ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. కాలేయం ఆరోగ్యం కోసం కొన్ని ఆహారపదార్థాలకు దూరంగా ఉండాలని.. ముఖ్యంగా.. మూడు విషయాలను నివారించాలన్నారు. కాలేయాన్ని కాపాడుకోవాలంటే, ముందుగా వేయించిన, నూనెతో కూడిన ఆహారాలకు

దూరంగా ఉండాలి. ఎందుకంటే ఇవి కొవ్వు పేరుకుపోవడానికి, ఫ్యాటీ లివర్ అభివృద్ధికి దోహదం చేస్తాయి. రెండవదిగా, అధికంగా తీపి పదార్థాలు, చక్కెర అధికంగా ఉండే ఆహారాలు కాలేయంలో కొవ్వు పేరుకుపోవడానికి దోహదపడటమే కాకుండా, ఇన్సులిన్ నిరోధకతకు కూడా కారణం కావచ్చు. మూడవదిగా, ప్రాసెస్ చేసిన, ప్యాక్ చేసిన ఆహారాలలో నిల్వచేసే పదార్థాలు, హానికరమైన రసాయనాలు ఉంటాయి. ఇవి కాలేయంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. ఈ మూడు ఆహారాలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కాలేయ పనితీరు బలహీనపడి, తీవ్రమైన దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. అందువల్ల, వాటికి దూరంగా ఉండటమే ఉత్తమమైన మార్గం.

## ఉప్పు తక్కువ తింటున్నారా? ఈ డేంజర్ గురించి తెలుసా?

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో హై బీపీ బాధితులే కాదు, లో బీపీతో సతమతమయ్యేవారి సంఖ్య కూడా పెరుగుతోంది. చాలామంది ఉప్పు తింటే బీపీ పెరుగుతుందనే భయంతో అసలు ఉప్పే వాడటం మానేస్తున్నారు. దీనివల్ల శరీరంలో సోడియం స్థాయిలు పడిపోయి రక్తపోటు అసాధారణంగా తగ్గుతుంది. కళ్లు తిరగడం, వికారం, దృష్టి మసకబారడం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయంటే శరీరం కు హెచ్చరిక పంపిస్తోందని అర్థం. వైద్య పరిభాషలో రక్తపోటు 90/60 ఎఎఊణ కంటే తక్కువగా ఉంటే దానిని హైపోటెన్షన్ అంటారు. శరీరంలో నీటి శాతం తగ్గడం, సోడియం లోపం దీనికి ప్రధాన కారణాలు. అకస్మాత్తుగా బీపీ పడిపోయినప్పుడు ఒక గ్లాసు ఉప్పు నీరు ఎలా సంజీవనిలా పనిచేస్తుంది? కాళ్లను పైకి ఎత్తి పడుకోవడం వల్ల మెదడుకు రక్త ప్రసరణ ఎలా మెరుగుపడుతుంది? ముఖ్య లక్షణాలు: అకస్మాత్తుగా తల తిరగడం, కళ్లు బైర్లు కమ్మడం, విపరీతమైన నీరసం, ఏకాగ్రత దెబ్బతినడం, చర్మం చల్లగా మారి చెమటలు పట్టడం.ఉప్పు నీటి మ్యాజిక్: కు నీరసంగా అనిపించినప్పుడు వెంటనే ఒక గ్లాసు నీటిలో కొద్దిగా ఉప్పు కలిపి



తాగండి. ఇది శరీరంలో సోడియం స్థాయిని పెంచి రక్తపోటును సాధారణ స్థితికి తెస్తుంది. శరీర స్థితి: అకస్మాత్తుగా తల తిరిగినప్పుడు వెంటనే పడుకుని, కాళ్ల కింద దిండు పెట్టి కొద్దిగా పైకి ఎత్తి ఉంచండి. దీనివల్ల మెదడుకు రక్త ప్రసరణ వేగవంతమై త్వరగా కోలుకుంటారు. నీటి వినియోగం: డీహైడ్రేషన్ వల్ల బీపీ పడిపోయే అవకాశం ఎక్కువ. కాబట్టి రోజంతా పుష్కలంగా నీరు, కొబ్బరి నీళ్లు లేదా పళ్ల రసాలు తాగుతూ ఉండాలి. కేఫీన్ ప్రభావం: బీపీ తక్కువగా ఉన్నప్పుడు స్ట్రాంగ్ టీ లేదా కాఫీ తాగడం వల్ల అందులోని కేఫీన్ రక్తపోటును తాత్కాలికంగా పెంచుతుంది. అయితే దీనిని అలవాటుగా మార్చుకోకూడదు. తక్కువ రక్తపోటును నిర్లక్ష్యం చేయడం వల్ల మెదడు, గుండె వంటి కీలక అవయవాలకు రక్త ప్రసరణ తగ్గి ప్రమాదకరంగా మారవచ్చు. పైన చెప్పిన చిట్కాలు పాటించినా సమస్య తరచుగా వేధిస్తుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం. లో బీపీ ఉన్నవారు ఒకేసారి భారీగా భోజనం చేయకుండా, తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవడం వల్ల రక్తపోటు నిలకడగా ఉంటుంది.

## ఇలా తిన్నారంటే ఆరోగ్యం గోవిందా..


పప్పుచారు, సాంబారు, రసం... దేనికైనా ఆలూ ఫ్రై మంచి జోడీ. ఇక పూరీ, పులావ్, రోటీలకు ఆలూ బెస్ట్ కాంబినేషన్. అయితే వేసవిలో బంగాళాదుంపలు తినడం ప్రయోజనకరమా లేదా హానికరమా? అనే సందేహం చాలా మందికి ఉంటుంది. మనం ఎక్కువగా వండుకునే కూరగాయల్లో బంగాళాదుంపలు కూడా.. మనం ఎక్కువగా వండుకునే కూరగాయల్లో బంగాళాదుంపలు కూడా ఒకటి. రుచికరమైన కర్రీలు, ఫ్రైలు, చిప్స్... ఇంకా రకరకాల వంటకాలను వీటితో తయారు చేసు



కుంటాం. అయితే ఆలూ కొందరిలో గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలను కలిగిస్తుంది. వేసవిలో బంగాళాదుంపలను తీసుకోవచ్చో? లేదో? ఆరోగ్యానికి మేలు చేసే ఆహారాల్లో బంగాళదుంప చాలా ముఖ్యమైనవి. అయితే వేసవిలో బంగాళదుంపలను తినేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవడం ముఖ్యం. బంగాళదుంపలను పూర్తిగా మానుకోవడానికి బదులుగా వాటిని సరైన పద్ధతిలో తినడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. బంగాళాదుంపలలో కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. వేసవిలో వీటిని ఎక్కువగా తినడం వల్ల శరీరంలో అంతర్గత వేడి పెరిగి, అసౌకర్యానికి దారితీయవచ్చు. అందుకే వేసవిలో బంగాళాదుంపలు తిన్న తర్వాత కొంతమందికి గ్యాస్, అజీర్ణం, కడుపు ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి. ఈ విధమైన జీర్ణ సమస్యలు ఉన్నట్లయితే బంగాళాదుంపలను మితంగా తీసుకోవాలి. వేసవిలో బంగాళాదుంప చిప్స్, వడలు, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి నూనెతో చేసిన ఆహార పదార్థాలను తినడం మానుకోవాలి. దానికి బదులుగా ఉడకబెట్టిన లేదా తక్కువ నూనెలో వండిన బంగాళాదుంపలను తినడం ఆరోగ్యానికి మంచిది. ఆహారంలో బంగాళాదుంపలను రోజుకు ఒకసారి లేదా పరిమిత పరిమాణంలో మాత్రమే చేర్చుకోవాలి. బంగాళాదుంపలు సమతుల్య ఆహారంలో భాగమే. అయితే వాటి పరిమాణం, వండే పద్ధతి కూడా పరిగణనలోకి తీసుకుంటేనే ఆరోగ్యానికి మేలు చేస్తాయి.

## పరిమళభరితంగా.. ఇలా!

రోజంతా పరిమళభరితంగా ఉండాలంటే చక్కని స్ప్రే లేదా పెర్ఫ్యూమ్ వాడడంతో పాటు వేసుకునే దుస్తులు.. మొదలైన విషయాల్లో కూడా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. ముఖం జిడ్డుగా అనిపిస్తే బేబీ వైప్స్‌తో తుడుచుకోవచ్చంటున్నారు నిపుణులు. ఫలితంగా ముఖం తాజాగా కనిపిస్తుంది. కొంతమందికి పాదాలకు చెమట పట్టి వాసన వస్తుంటుంది. ఇలాంటప్పుడు స్నానం చేసిన తర్వాత కాళ్లను బాగా ఆరనిచ్చి మాయిశ్చరైజర్ అప్లై చేయాలి. అలాగే సాక్సులు ధరించేవారు వాటిలో పరిమళాలు వెదజల్లే పౌడర్ వేసినట్లయితే పాదాల నుంచి చెమట వాసన రాకుండా చెక్ పెట్టచ్చు. దుస్తులు ఉతికేటప్పుడు ఫ్యాబ్రిక్ కండిషనర్లు వాడితే సువాసనలు వెదజల్లే అవకాశం ఉంటుంది. అలాగే వాటిని వార్డ్‌రోబ్‌లో భద్రపరిచేటప్పుడు నాఫ్తలీన్ బాల్స్, సువాసనలు వెదజల్లే శాషేలు.. వంటివి వేస్తే ఫలితం ఉంటుంది అంటున్నారు నిపుణులు.



## ఇన్ని రోజులు ఇది తెలియలేదే..

నిత్యం వంటింట్లో ఎదురయ్యే చిన్న చిన్న సమస్యలను పరిష్కరించుకోవడానికి, పనులను సులభతరం చేసుకోవడానికి కొన్ని అద్భుతమైన చిట్కాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా నిమ్మకాయలు త్వరగా ఎండిపోకుండా ఉండాలంటే.. ఆ వివరాలు ఏంటో తెలియాలంటే.. కచ్చితంగా ఈ స్టోరీపై ఓ లుక్కేయండి మరి. ఖరీదైన వస్తువులతోనే కాకుండా, ఇంట్లో లభించే సామాన్యమైన వస్తువులతో కూడా వంటగదిని, ఇంటిని అద్భుతంగా నిర్వహించుకోవచ్చని ఈ చిట్కాలు నిరూపిస్తున్నాయి. ముఖ్యంగా నిమ్మకాయలు త్వరగా ఎండిపోకుండా ఉండాలంటే, మనం వాడి పారేసే ఖాళీ నూనె ప్యాకెట్లలో వాటిని ఉంచి ఫ్రిజ్‌లో భద్రపరచాలి. ప్యాకెట్‌కు ఉండే కొద్దిపాటి నూనె జిగురు నిమ్మకాయలపై పొరలా ఏర్పడి, గాలి తగలకుండా చేసి దాదాపు నెల రోజుల పాటు తాజాగా ఉంచుతుంది. అలాగే, వంటింట్లో అత్యంత ఎక్కువగా వాడే చాపింగ్ బోర్డులపై పేరుకుపోయే జిడ్డు, బ్యాక్టీరియాను వదిలించడానికి నిమ్మచెక్కపై కొద్దిగా ఉప్పు, వంట సోడా వేసి రుద్దడం వల్ల అవి కొత్తవాటిలా మెరుస్తాయి. ఫంగస్ చేరకుండా ఉండాలంటే వారానికి ఒకసారి వీటిని ఎండలో ఉంచడం మంచిది.తేనె సీసాలో చీమలు చేరడం అందరికీ ఎదురయ్యే పెద్ద సమస్య. దీనికి పరిష్కారంగా తేనె డబ్బాలో నాలుగు ఐదు మిరియాలు వేస్తే, ఆ ఘాటుకు చీమలు దరిచేరవు. ఇక పర్యావరణానికి మేలు చేస్తూ, పాత ప్లాస్టిక్ బాటిళ్లను పారేయకుండా వాటి పైభాగాన్ని



కత్తిరించి స్పూన్ హోల్డర్‌గా మార్చుకోవచ్చు. బాటిల్‌కు చిన్న రంధ్రం చేసి సింక్ పక్కన వేలాడదీస్తే, కడిగిన స్పూన్లు, ఫోర్కులు అందులో వేసుకోవడానికి వీలుగా ఉంటుంది. ఇది ఖర్చు లేని గొప్ప ఐడియా. ఆరోగ్య విషయానికి వస్తే, ఋతుక్రమ సమస్యలతో బాధపడే మహిళలకు వాము నీరు అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుంది. ఒక గ్లాసు నీటిలో ఒకటిన్నర స్పూన్ వాము వేసి సగం అయ్యే వరకు మరిగించి, దానికి బెల్లం లేదా తేనె కలిపి తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఇది రక్త ప్రసరణను క్రమబద్ధం చేసి నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. చివరగా, అగరబత్తులను నేరుగా బయట ఉంచకుండా టిష్యూ పేపర్లలో చుట్టి భద్రపరచడం వల్ల వాటి సువాసన ఎక్కువ కాలం నిలిచి ఉంటుంది. ఈ చిన్నపాటి గృహ చిట్కాలు పాటించడం వల్ల మన సమయం ఆదా అవ్వడమే కాకుండా, రోజువారీ పనులు ఎంతో సులభతరం అవుతాయి. వీటిని పాటించి ఇంటిని ఆరోగ్యంగా, అందంగా తీర్చిదిద్దుకోండి.

## ఈ టిఫిన్ తింటే ఆరోగ్యానికి తిరుగుండదు



గోధుమల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అందుకే.. డైలీ గోధుమ రవ్వ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని పేర్కొంటున్నారు డైటీషియన్లు.. ఇది బరువు తగ్గడానికి, మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు ఉన్నవారికి అనుకూలం. గోధుమ రవ్వలో ఫైబర్, ప్రోటీన్లు పుష్కలంగా ఉండి, జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. తక్కువ క్యాలరీలతో పోషకాలను అందిస్తుంది. గోధుమ రవ్వ తినడం వల్ల అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలున్నాయని తెలిస్తే రు ఆశ్చర్యపోతారు. అవును.. గోధుమ రవ్వ వల్ల బరువు కూడా తగ్గవచ్చు. ఇందులో ముఖ్యమైన ఫైబర్, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. క్యాలరీలు తక్కువగా ఉంటాయి కాబట్టి బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఒక ఉత్తమ ఎంపిక. గోధుమ రవ్వ ఉప్మాను కాయగూరలు అన్నీ వేసి చేస్తారు.. కాబట్టి ఇది ఆరోగ్యానికి చాలా మంచిది. బరువు తగ్గాలనుకునే వారు గోధుమ రవ్వ ఉప్మాను మంచిగా.. తినవచ్చు. ఇందులో క్యాలరీలు తక్కువగా ఉన్నప్పటికీ, కొద్దిగా తిన్నా కడుపు నిండిన భావం కలుగుతుంది. దీంతో ఇతర అల్పాహారాలు, అనవసరమైన పదార్థాలు తినకుండా ఉండవచ్చు. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారికి ఇది బెస్ట్ ఛాయిస్ అని చెప్పవచ్చు. గోధుమ రవ్వలో పుష్కలంగా ప్రోటీన్లు ఉంటాయి. అలాగే, గోధుమ రవ్వతో తయారు చేసే ఆహార పదార్థాలు ఏవైనా సంతోషంగా తీసుకోవచ్చు. ఇలా కొవ్వు పదార్థాలు తక్కు వగా ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల సులభంగా బరువు తగ్గవచ్చు. గోధుమ రవ్వ నెమ్మదిగా జీర్ణమవుతుంది కాబట్టి త్వరగా ఆకలి అనిపించదు. దీంతో ఇతర పదార్థాలు కూడా తినలేము. అయితే, కొంతమందికి గోధుమ రవ్వతో జీర్ణ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అలాంటి వారు దీనిని

మనం నిత్యం తీసుకునే ఆహారంలో గోధుమ రవ్వ ఉప్మా కూడా ఒకటి. చాలా మందికి గోధుమ రవ్వతో చేసే ఉప్మా అంటే ఇష్టం. అయితే, దీనితో కేవలం రుచి మాత్రమే కాదు, అనేక ఆరోగ్య లాభాలున్నాయి. ఈ గోధుమ రవ్వతో చేసే ఆహారం డయాబెటిక్స్, రక్తపోటు, గుండె జబ్బులు వంటి ఏ సమస్య ఉన్నవారైనా తీసుకోవచ్చు. దీనికి ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేవు. అంతేకాకుండా, దూరంగా ఉండటమే మంచిది. గోధుమ రవ్వలో ఫైబర్స్ ఎక్కువగా ఉంటాయి కాబట్టి జీర్ణవ్యవస్థ సజావుగా జరగడానికి ఇది సహాయపడుతుంది. అలాగే, శరీరంలో అన్ని భాగాల విధులు సరిగ్గా నిర్వహించడానికి ఇది ఉపయోగపడుతుంది. మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. డయాబెటిక్స్ ఉన్నవారు గోధుమ రవ్వను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలలో ఎలాంటిమార్పులురావు. ఆహారాన్ని చక్కెరగా మార్చకుండా గోధుమ రవ్వ చేస్తుంది కాబట్టి ఎలాంటి డౌట్స్ లేకుండా దీనిని తీసుకోవచ్చు.

## భెల్‌కు రూ.13,500 కోట్ల భారీ ప్రాజెక్ట్

విద్యుత్ ఉత్పత్తి ఉపకరణాల సంస్థ భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ (భెల్)కు తెలంగాణలో భారీ ప్రాజెక్టు దక్కింది. పెద్దపల్లి జిల్లాలో ఏర్పాటు చేయనున్న 3 800 మెగావాట్ల సామర్థ్యం గల స్టేజ్2 సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం ఎన్‌టిపిసి లిమిటెడ్ నుండి సుమారు రూ.13,500 కోట్ల భారీ ఆర్డర్‌ను పొందింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నోటిఫికేషన్ ఆఫ్ అవార్డ్ (ఎఒఎ)ను మార్చి 29న అందుకుంది. ఈ వివరాలను సోమవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించారు. ఈ కాంట్రాక్టులో భాగంగా బాయిలర్, టర్బైన్, జనరేటర్ (బిటిజి)ల రూపకల్పన, తయారీ, సరఫరా, స్థాపనతో పాటు సివిల్, స్ట్రక్చరల్ పనులను కూడా భెల్ చేపట్టనుంది.







## నా రాజీనామాతో బ్యాంక్ విలువ తగ్గలేదు!

తాను రాజీనామా చేసి బ్యాంక్ నుంచి బయటకు రావడంతోనే, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ క్షీణించిందనే వాదనను ఖండిస్తున్నానని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తాజా మాజీ ఛైర్మన్ అతాను చక్రవర్తి వెల్లడించారు. నైతిక విలువలు, సూత్రాల విషయంలో ఏకాభిప్రాయం లేకపోవడంతోనే రాజీనామా చేశానని తెలిపారు. 'నేను బహిరంగంగా అందుబాటులో ఉన్న విషయాలను మాత్రమే ప్రస్తావించాను. ఎవరైనా నా లేఖకు సంబంధించి 'అపవాదు' అనే పదాన్ని వాడుతుంటే, వారు నిఘంటువు చదవాల'ని వెల్లడించారు. స్వతంత్ర డైరెక్టర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి పరోక్ష ఆరోపణలు చేయకూడదని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఛైర్మన్ తుహిన్‌కాంత పాండే చెప్పిన కొద్దిరోజులకే చక్రవర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఈఓ శశిధర్ జగదీశన్‌తో ఉన్న 'అధికార పోరాటం' వల్లే తాను రాజీనామా చేశానన్న వార్త గురించీ చక్రవర్తి మాట్లాడారు.

జగదీశన్ పదవీకాలాన్ని పొడిగించడాన్ని చక్రవర్తి వ్యతిరేకించినా, బోర్డు లోని మెజార్టీ సభ్యులు దానికి అనుకూలంగా ఉండటం చక్రవర్తికి నచ్చలేదని ఆ వార్తలో ప్రస్తావించారు. జగదీశన్ పునఃనియామక విషయం, ఆయన పనితీరును గానీ లేదా ఏవైనా సమస్యలను గానీ పరిశీలించడానికి బోర్డు ముందుకు రాలేదని, అసలు చర్చ కూడా జరగని విషయంపై విభేదాలు ఎలా ఉంటాయని ప్రశ్నించారు.

## సిమ్ బైండింగ్ గడువును పొడిగించే యోచనలో కేంద్రం



కేంద్రం ప్రభుత్వం వాట్సాప్, అర్ట, టెలిగ్రాం లాంటి మెసేజింగ్ ప్లాట్‌ఫామ్‌లకు తప్పనిసరి సిమ్ బైండింగ్ గడువును పొడిగించే అవకాశం ఉంది. ఈ నిబంధనను పాటించడానికి కంపెనీలకు టెలికమ్యూనికేషన్స్ విభాగం (డీఓటీ) ఈ ఏడాది డిసెంబర్ వరకు గడువు ఇవ్వాలని అధికారులు వెల్లడించినట్టు జాతీయ డియా పేర్కొంది. ప్రధానంగా కంపెనీల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం, ఈ మేరకు గడువు పెంపునకు సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. 2025, నవంబర్‌లో కేంద్రం ఈ నిబంధనలు ప్రకటించింది. వీటి అమలు కోసం కంపెనీలకు మూడు నెలలు(90 రోజుల) గడువు ఇచ్చింది. అయితే, ఈ నిబంధనలు అమలులో సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని, టెస్టింగ్, ఓఎస్ అప్‌డేట్ లాంటి సవాళ్లు ఉన్నాయని కంపెనీలు స్పష్టం చేశాయి. వీటిని పరిష్కరించి నిబంధనల అమలుకు ఇంకా సమయం కావాలని కేంద్రానికి వివరించాయి. సిమ్ బైండింగ్ అనేది సిమ్ కార్డు ఉంటేనే వాట్సాప్, టెలిగ్రాం లాంటి యాప్స్ మొబైల్‌ఫోన్లలో పని చేసే విధానం. అంటే యూజర్ తాను వాడే ఫోన్‌లో రిజిస్టర్ చేసిన సిమ్ కార్డు ఉంటేనే ఆయా యాప్‌ల అకౌంట్లను యాక్సెస్ చేసే వీలుంటుంది. మరోవైపు, దేశంలో పెరుగుతున్న డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాలకు చెక్ పెడుతూ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ(ఎంహెచ్‌ఏ) 2025 ప్రారంభం నుంచి ఇప్పటివరకు 3,962 స్కైప్ ఐడీలను, 83,867 వాట్సాప్ ఖాతాలను బ్లాక్ చేసింది. అలాగే, మొబైల్, నెట్‌వర్క్ భద్రతను పెంచుతూ నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ) వ్యవస్థ ద్వారా గుర్తించిన 8.45 లక్షల సిమ్ కార్డులను, 2.39 లక్షల మొబైల్ ఐఎంఈఐ నంబర్లను అధికారులు బ్లాక్ చేశారు.

## అత్యంత అధ్వాన స్థితిలోకి రూపాయి




ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో రూపాయి పతనం రోజుకో నూతన రికార్డు కనిష్టాన్ని సృష్టిస్తుంది. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ భారత చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా డాలర్‌తో పోల్చితే 95 మార్క్‌ను దాటి అత్యంత అధ్వానస్థితికి పడిపోయింది. సోమవారం ఫారెక్స్ మార్కెట్‌లో 93.62 వద్ద రూపాయి విలువ తెరుచుకుంది. ఆ తర్వాత 165 పైసలు పతనమై 95.20 కనిష్టం వద్ద నమోదయ్యింది. తుదకు 94.78 వద్ద ముగిసింది. ఆర్థిక సంవత్సరం 2025-26లో రూపాయి విలువ ఏకంగా 10 శాతం పైగా పడిపోయింది. ఫిబ్రవరిలో 90.98 వద్ద ఉన్న రూపాయి.. ప్రస్తుతం 95 స్థాయిని తాకి నూతన కనిష్టానికి పడిపోయింది.దీంతో రూపాయి పతనాన్ని అడ్డుకోవడంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బీజేపీ సర్కార్ విఫలమయ్యాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. భారత కరెన్సీ ఇదే స్థాయిలో పడిపోతుంటే త్వరలోనే 100 మార్కుకు చేరొచ్చని అంచనాలు పెరుగుతున్నాయి. ముడిచమురు ధర బ్యారెల్‌కు 120 డాలర్లు దాటితే రూపాయిపై మరింత ఒత్తిడి పెరుగుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భారత దిగుమతి బిల్లులు పెరగడంతో పాటుగా భారత మార్కెట్ల నుండి విదేశీ పెట్టుబడిదారులు తమ నిధులను వెనక్కి తీసుకోవడం రూపాయిని బలహీనపరుస్తోంది. భారత కరెన్సీ పతనం ఇలాగే కొనసాగితే పెట్టుబడిదారులలో అభద్రతా భావం పెరిగి మార్కెట్లలో మరింత అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉంది. 2025-26 ఆర్థికసంవత్సరపు చివరి రోజైన సోమవారం నాడు కూడా మార్కెట్‌ను యుద్ధభయం వెంటాడింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందన్న వార్తలతో పాటు, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు మార్కెట్ సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. దీంతో సెన్సెక్స్ 1600 పాయింట్లకు పైగా నష్టపోగా, నిఫ్టీ 22,350 పాయింట్లకు దిగువన నష్టపోయింది. మొత్తంద 9లక్షల కోట్ల ముదుపర్ల సంపద ఒక్కరోజులోనే ఆవిరైంది.

## ఏటీఎం వినియోగంపై పరిమితులు



కొత్త ఆర్థిక సంవత్సరం (2026-27) బుధవారం నుంచి ప్రారంభం కాబోతోంది. ఈ నేపథ్యంలో బ్యాంకింగ్ నిబంధనల్లో మార్పులు చోటు చేసుకోనున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)తో పాటు, పలు బ్యాంకులు తమ ఖాతాదారుల లావాదేవీల నియమాలను సవరిస్తున్నాయి. యూపీఐతో తీసుకున్నా: ఇప్పటివరకూ ఏటీఎంలలో కార్డు లేకుండా, యూపీఐ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నగదు ఉపసంహరించుకునే వెసులుబాటును వినియోగదారులు ఉచితంగా లేదా అదనపు లావాదేవీగా వాడుకునే వారు. ఏప్రిల్ 1 నుంచి దీనికి అడ్డుకట్ట పడనుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా పలు బ్యాంకులు ఇకపై ఏటీఎంలలో చేసే యూపీఐ ఆధారిత నగదు ఉపసంహరణలనూ, నెలవారీ ఉచిత ఏటీఎం లావాదేవీలుగానే పరిగణించనున్నాయి. ఉచిత లావాదేవీల పరిమితి ముగిశాక.. యూపీఐ ద్వారా చేసే ప్రతి ఉపసంహరణపైనా రూ.23తో పాటు అదనంగా పన్నులు చెల్లించాల్సిందే. ఎంపిక చేసిన డెబిట్ కార్డులపై రోజువారీ ఏటీఎం నగదు ఉపసంహరణ పరిమితులను పంజాబ్ నేషనల్ బ్యాంక్ సగానికి తగ్గించింది. చాలా కార్డులకు రోజువారీ పరిమితిని రూ.1,00,000 నుంచి రూ.50,000 చేసింది. బంధన్ బ్యాంక్ ఖాతాదారులు తమ సొంత ఏటీఎంలలో నెలకు 5 సార్లు ఉచిత ఆర్థిక లావాదేవీలు చేసుకోవచ్చు. ఇతర బ్యాంకుల ఏటీఎంలను వాడితే మెట్రో నగరాల్లో 3 లావాదేవీలు మాత్రమే ఉచితం. పరిమితి దాటితే, ప్రతి లావాదేవీకి రూ.10 రుసుము పడుతుంది.

## ఆగని స్టాక్ మార్కెట్ల పతనం



భారతీయ ఈక్విటీ మార్కెట్లలో మరోసారి భారీ నష్టాలు నమోదయ్యాయి. మధ్యప్రాచ్యంలో యుద్ధ పరిస్థితులు రోజురోజుకు ముదురుతుండటం, చమురు ధరల ఆందోళనలు వంటి అంశాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నాయి. ఇదే సమయంలో అమెరికా-ఇరాన్ యుద్ధం మొదలై నెల రోజులు దాటిన నేపథ్యంలో ఆర్థిక వృద్ధి, ద్రవ్యోల్బణంపై ఆందోళనలు పెరిగాయి. ప్రధానంగా అమెరికా ఇరాన్‌పై సైన్యంతో దాడులు చేసేందుకు సిద్ధమవడంతో పరిస్థితులు మరింత కఠినంగా ఉంటాయనే భయాలు ఎక్కువయ్యాయి. ఇక, యుద్ధం మరింత తీవ్రంగా కొనసాగితే గ్లోబల్ సప్లై దెబ్బతినడం, చమురు ధరలు ఇంకా పెరుగుతాయనే ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో ఇరాన్‌కు మద్దతుగా హౌతీ రెబెల్ ప్రాక్సీలు యుద్ధంలోకి రావడంతో చమురు సరఫరాపై కొత్త భయాలు, ఎర్ర సముద్రంలోని నౌకలపై దాడి చేస్తారనే ఊహాగానాలు పుంజుకున్నాయి. ఈ క్రమంలో 2025-26 ఆర్థిక సంవత్సరం చివరి సెషన్‌లో దేశీయ ఈక్విటీ బెంచ్‌మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాలను ఎదుర్కొన్నాయి. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు కొనసాగుతుండటం, ఆసియా మార్కెట్లలో నెలకొన్న బలహీన ధోరణులు కూడా నష్టాలను పెంచాయి. దీంతో మార్కెట్లు ముగిసే సమయానికి సెన్సెక్స్ 1635.67 పాయింట్లు పతనమై 71,947 వద్ద, నిఫ్టీ 488.20 పాయింట్లు క్షీణించి 22,331 వద్ద ముగిశాయి. ఫలితంగా మదుపర్ల సంపద సోమవారం ట్రేడింగ్‌లో ఒక్కరోజే దాదాపు రూ. 9 లక్షల కోట్ల వరకు ఆవిరైంది. ఫలితంగా బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ. 412 లక్షల కోట్లకు చేరుకుంది.




## వదిలేసినందుకు చెన్నైపై పగతీర్చుకున్న జడేజా



చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ సందర్భంగా రాజస్థాన్ రాయల్స్ డేంజర్ ప్లేయర్ రవీంద్ర జడేజా అద్భుతంగా రాణించాడు. తొలి మ్యాచ్ లోనే రెండు వికెట్లు తీసి తన సత్తా చాటాడు. చెన్నైతో జరిగిన మ్యాచ్ సందర్భంగా మొత్తం మూడు ఓవర్లు సంధించాడు. ఈ క్రమంలో కేవలం 18 పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. అయితే శివమ్ దూబే, సర్ఫరాజ్ ఖాన్ వికెట్లను పడగొట్టి ఓ రేంజ్ లో సెలబ్రేషన్స్ చేసుకున్నాడు రవీంద్ర జడేజా. గన్ ఫైర్ సెలబ్రేషన్స్ చేసి అందరినీ ఆసక్తికున్నాడు జడ్డూ భాయ్. ఈ క్రమంలోనే రవీంద్ర జడేజా గురించి రకరకాల పోస్టులు పెడుతున్నారు. తనను ట్రేడింగ్ ద్వారా వదిలేసినందుకుగాను చెన్నై పైన జడేజా పగ తీర్చుకున్నాడని కొంత మంది అంటున్నారు. గత సీజన్ వరకు చెన్నై హీరోగా పేరుగాంచిన ఆయన ఇప్పుడు అదే జట్టుకు విలన్‌గా మారిపోయాడని మరికొంతమంది సీఎస్కే అభిమానులు పోస్టులు పెడుతున్నారు.

## ఐపీఎల్‌లో 'సూర్యవంశీ' విధ్వంసం.. చెన్నైపై రాజస్థాన్ ఘన విజయం



ఐపీఎల్-2026లో భాగంగా తొలిమ్యాచ్‌లోని రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు, బ్యాటర్లు చెలరేగి ఆడారు. చెన్నై సూపర్ కింగ్స్‌ను తక్కువస్కోరుకే కట్టడి చేసిన రాయల్స్, ఆ తర్వాత కేవలం 12.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. అంతకముందు టాస్ గెలిచిన రాజస్థాన్‌రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకి ఆదిలోనే షాక్ తగిలింది. రాజస్థాన్ బౌలర్లు నంద్ర బర్గర్, జోఫ్రా ఆర్చర్ వేగంతో సీఎస్‌కే టాపార్డర్‌ను దెబ్బతీశారు. జే ఓవర్టన్ (43) ఒంటరి పోరాటం చేయడంతో చెన్నై 19.4 ఓవర్లలో 127 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో జే ఓవర్టన్ (43), కార్తీక్ శర్మ (18) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్ చేశారు. ఇక రాజస్థాన్ బౌలర్లలో రవీంద్ర జడేజా 2, జోఫ్రా ఆర్చర్2, నంద్ర బర్గర్ వికెట్లు తీసుకున్నారు.

## ఎంఎస్ ధోనీ లేకుంటే సీఎస్‌కే ఓటముల పరంపర



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) చరిత్రలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)కు టీమిండియా దిగ్గజం ఎంఎస్ ధోనీ ఎంత కీలకమైన ఆటగాడో చెప్పాల్సిన అవసరం లేదు.కెప్టెన్‌గా, ఫినిషర్‌గా, వికెట్ కీపర్‌గా ఆయన జట్టుకు ఎన్నో విజయాలు అందించాడు. మహీ నాయకత్వంలో సీఎస్‌కే ఐదు టైటిల్స్‌ను సొంతం చేసుకుంది.అయితే గాయం కారణంగా ఐపీఎల్ 2026 ప్రారంభ రెండు వారాలకు ధోనీ దూరమయ్యాడు. ఈరోజు రాజస్థాన్ రాయల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో కూడా అతను బరిలోకి దిగడం లేదు. ధోనీ లేని సమయంలో సీఎస్‌కే ప్రదర్శనపై అభిమానుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.ధోనీ లేకుండా సీఎస్‌కే ఆడిన మ్యాచ్‌ల గణాంకాలు చూస్తే ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. 2008 నుంచి 2026 వరకు సీఎస్‌కే తరఫున ధోనీ నిరంతరం ఆడుతున్నప్పటికీ, అతను లేని మ్యాచ్‌లు చాలా అరుదుగా మాత్రమే జరిగాయి. కానీ ఆ మ్యాచ్‌లలో జట్టు విజయాల కంటే ఓటములే ఎక్కువగా నమోదయ్యాయి.2010లో ఢిల్లీపై సీఎస్‌కే ధోనీ లేకుండా ఆడినప్పుడు విజయం సాధించింది. కానీ ఆ తరువాత జరిగిన మ్యాచ్‌లలో మాత్రం జట్టు వరుస ఓటములను చవిచూసింది. 2010లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్, ఆర్సీబీపై, 2019లో సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్‌పై సీఎస్‌కే ఓడిపోయింది. మొత్తంగా ధోనీ లేకుండా ఆడిన ఐదు మ్యాచ్‌లలో నాలుగింటిలో సీఎస్‌కే పరాజయం పాలైంది.ఎంఎస్ ధోనీ కేవలం కెప్టెన్ మాత్రమే కాదు? మ్యాచ్‌ను అర్థం చేసుకునే తీరు, ఒత్తిడిలో చాకచక్యంగా నిర్ణయాలు తీసుకోవడం, చివరి ఓవర్లలో మ్యాచ్‌ను ముగించే సామర్థ్యం అతన్ని ప్రత్యేకంగా నిలబెడతాయి. అతను లేని సమయంలో జట్టులో ఆత్మవిశ్వాసం కొంత తగ్గినట్లు అనిపిస్తుంది.ఐపీఎల్ 2026లో కూడా ధోనీ గాయంతో దూరమవడం సీఎస్‌కేకు పెద్ద సవాల్‌గా మారింది. యువ ఆటగాళ్లు, కొత్త నాయకత్వం ఈ లోటును భర్తీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌లో ధోనీ గైర్హాజరీ జట్టు సమతౌల్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## ఆటను వదిలేదే లేదు: షమీ

'నాకు క్రికెట్‌పై బోర్ కొట్టాలి. అప్పటివరకూ ఆటను వదిలేది లేదు''.. ఇదీ వెటరన్ క్రికెటర్ మహ్మద్ షమీ తన రిటైర్మెంట్‌పై వస్తోన్న ప్రశ్నలకు ఇచ్చిన సమాధానం. ఐపీఎల్ 2026 సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తరఫున బరిలోకి దిగనున్న షమీ.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడాడు. ఓ వైపు కుటుంబ వివాదాలు, మరోవైపు జాతీయజట్టులో స్థానం లేదు.. రిటైర్మెంట్ తీసుకోవాలంటూ సూచనలు.. ఇలా షమీని చుట్టుముట్టాయి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. తనకు అప్పుడే రిటైర్మెంట్ తీసుకోవాలనే ఆలోచన లేదని స్పష్టంచేశాడు. ''నేనెప్పుడైతే అలసిపోతానో.. ఆ రోజు నిర్ణయం తీసుకుంటా. ప్రస్తుతం నాకు రిటైర్మెంట్ ఆలోచనే లేదు. ఒకవేళ అలాంటి ఆలోచనలు వచ్చాయంటే.. ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుంది. ఇంతకుముందు కూడా నేను ఇదే విషయం గురించి చెప్పా. నిద్ర నుంచి లేచి అరే.. ఇవాళ క్రికెట్ ఆడలేనని అనుకున్నరోజు ఆటకు గుడ్‌బై చెప్పేస్తా. ఇప్పటివరకు నాకు అలాంటి ఉద్దేశం రాలేదు. ఆటను ఆస్వాదిస్తున్నా. సానుకూల దృక్పథంతో ముందుకుసాగుతా. బౌలర్‌గా.. నేనెప్పుడూ వంద శాతం ఇచ్చేందుకు ప్రయత్నిస్తా. నాపై ఉన్న అంచనాలను అందుకోనేందుకు చూస్తా. నా బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు ప్రయత్నిస్తా. నిబద్ధతతో ఆడతా. మిగతాది నా చేతుల్లో ఉండదు'' అని షమీ వెల్లడించాడు. ''టీ20ల్లోనూ మంచి ప్రదర్శనే చేశా. ఐపీఎల్‌లోనూ గొప్ప రికార్డులే ఉన్నాయి. కానీ, ఇప్పటికీ నన్ను నాణ్యమైన టీ20 బౌలర్‌గా చాలామంది గుర్తించరు. అంతకుముందు ప్రతి సీజన్‌లోనూ కనీసం 20కి పైగా వికెట్లు తీశా. అయినా సరే, టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ నన్ను పొట్టి ఫార్మాట్ బౌలర్‌గా పరిగణించలేదు. జాతీయజట్టులోకి ఎందుకు తీసుకోలేదో అర్థంకాలేదు.




## మియామీ టైటిల్ విజేత సిన్నర్



మియామీ ఓపెన్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను 2వ సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్ చేజిక్కించుకున్నాడు. జరిగిన ఫైనల్లో సిన్నర్ వరుస సెట్లలో 21వ సీడ్, చెక్ రిపబ్లిక్‌కు చెందిన లెహెక్కాను ఓడించాడు. కేవలం రెండు బ్రేక్ పాయింట్లు సాధించిన సిన్నర్ ప్రత్యర్థిని 6-4, 6-4తో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఫైనల్లో సిన్నర్ 10 ఏస్‌లను సంధించడంతోపాటు మొదటి సర్వీస్‌ను 91శాతం నిలబెట్టుకొని విజయం సాధించాడు. ఇక మహిళల సింగిల్స్ టైటిల్‌ను అర్యానా సబలెంక టైటిల్‌ను కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆదివారం జరిగిన ఫైనల్లో టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన సబలెంక 6-2, 4-6, 6-3తో 4వ సీడ్, అమెరికాకు చెందిన కోకా గాఫ్‌ను ఓడించింది. ఇక మహిళల డబుల్స్ టైటిల్‌ను 2వ సీడ్ అమెరికా-చెక్ రిపబ్లిక్ జోడీ టాప్‌సీడ్ ఇటలీ జంటను ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. ఏకపక్షంగా సాగిన ఈ గేమ్‌లో టౌన్సెండ్(అమెరికా)-సినియాకోవా(చెక్) జంట 7-6(7-0), 6-1తో టాప్‌సీడ్ ఎరానీ-పొలిని జంటను ఓడించారు.

## బెదిరింపు ధోరణితో మాట్లాడారు



ఆలిండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్(ఎఐఎఫ్ఎఫ్) సభ్యులు తనను బెదిరింపు ధోరణితో మాట్లాడారని ఎఐఎఫ్ఎఫ్ మహిళల ఫుట్‌బాల్ కమిటీ ఛైర్మన్ వాలంకా అలెమావో ఆరోపణలు చేశారు. ఈనెల 29న ఢిల్లీలోని ఫుట్‌బాల్ కార్యాలయంలో జరిగిన ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. అలాగే తనను సీనియర్ అధికారులు హేళన మాట్లాడరని, వేధించారని ఆరోపించారు. ఎఐఎఫ్ఎఫ్ అధ్యక్షులు చౌబేతో పాటు ఇతర సీనియర్ అధికారుల చర్యలను ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌కు అలెమావో లేఖ రాశారు. 'చౌబే, ఏఐఎఫ్ఎఫ్ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.హారిస్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎం.సత్యనారాయన్ ప్రవర్తనను ముందు ఉంచాలనుకుంటున్నాను. నా గొంతు అణచివేయడానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అధ్యక్షుడు నాతో అగౌరవంగా ప్రవర్తించారు. ఆయనతో కలిసి మిగిలినవారు స్వరం పెంచి, బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. సమావేశం జరుగుతున్నంతసేపు నన్ను టార్గెట్ చేశారు' అని ఆమె ఆరోపించారు. ఫిఫా మహిళల ఫుట్‌బాల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా నియమితులైన తొలి భారతీయురాలు. భారత మహిళల ఆసియా కప్ క్యాంపెయిన్‌లో భాగంగా పాలనాపరమైన లోపాలను ఇటీవల ఆమె ఎత్తిచూపిన నేపథ్యంలో ఈ వ్యవహారం వెలుగులోకి రావడం గమనార్హం.




# సినిమా

## పిఠాపురంలో పట్టుకో బాబా సాంగ్

**ప్రముఖ దర్శకుడు కొరటాల శివ**

సీనియర్ దర్శకులు మహేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన 'పిఠాపురంలో అలా మొదలైంది' చిత్రం ఏప్రిల్ లో విడుదలకు సిద్ధమవుతోంది. డాక్టర్ రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ఇందులో ప్రధాన తారాగణం. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్ పై దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్. ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో శ్రీరామ్ తపస్వి రాసిన 'పట్టుకో బాబా' పాటను ప్రముఖ దర్శకుడు కొరటాల శివ ఆవిష్కరించి, టీం కి ఆల్ ది బెస్ట్ చెప్పారు.



## ఏప్రిల్ 2న జెట్లీ రిలీజ్



టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్స్ పోస్టర్స్, గ్లింప్స్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ డేట్ ని అనౌన్స్ చేశారు. 'జెట్లీ' ఫస్ట్ సింగిల్ సత్య ఈజ్ నాట్ జెట్లీ సాంగ్ ఏప్రిల్ 2 న రిలీజ్ కానుంది. సాంగ్ అనౌన్స్‌మెంట్ పోస్టర్ సత్య స్టైలిష్ అవతార్ ఆకట్టుకుంది. ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. మత్తు వలదరా వెనుక ఉన్న మెయిన్ టీం ఈ సినిమాకు పని చేస్తున్నారు. మ్యూజిక్ కాల భైరవ, సినిమాటోగ్రాఫర్ సురేష్ సారంగం, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్ నార్ని శ్రీనివాస్ తో కలిసి రితేష్ రానా మరోసారి యూనిక్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేశారు.

## ఆద్యంతం వినోదభరితంగా రాకాస

**ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిహారిక కొణిదెల**



జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక కొణిదెల నిర్మించిన చిత్రం 'రాకాస'. మానస శర్మ తెరకెక్కించిన ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, ట్రైలర్, పాటలు ఇలా అన్నీ కూడా ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఈ మూవీని ఏప్రిల్ 3న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలోనే సోమవారం నాడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. నిహారిక కొణిదెల మాట్లాడుతూ .. 'జీ స్టూడియోతో, దివ్య గారితో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది. యూట్యూబ్‌లో 'మ్యాడ్ హౌస్' అని ఓ సిరీస్ చేశాం. ఆ టైంలో మానస గారి డైలాగ్స్ మొదటగా విన్నాను. ఆ తరువాత మానస గారిని చూశాను. ఆమె తక్కువ మాట్లాడుతుంది. కానీ చాలా ఆలోచిస్తుంటుంది. 24 గంటలు సినిమా గురించి, కథ గురించే ఆలోచిస్తుంటుంది. మానస ఇంకా ఇంకా చాలా ఎత్తుకు వెళ్తుంది. మానస గారు, మహేష్‌గారు, యదు వంశీ గారి వంటి వారిని ఇంట్రడ్యూస్ చేయడం నాకు గర్వంగా అనిపిస్తుంది. 'కమిటీ కుర్రోళ్లు' చేస్తున్నప్పుడు 11, 15 మంది కొత్త వాళ్లతో చేయడం ఎందుకు అన్నారు?.. 'రాకాస' టైంలో ఇలాంటివి ఎందుకు 'కమిటీ కుర్రోళ్లు' లాంటి సినిమాలు చేసుకోవచ్చు కదా అని అన్నారు.. 'బరి' చేస్తుంటే.. ఫ్యామిలీ మెంబర్స్‌తో ఎందుకు? అని అంటున్నారు.. ఇలా అనే వాళ్లు అంటూనే ఉంటారు.. నాకు నచ్చింది నేను చేస్తూనే ఉంటాను. నేను నా ప్రతీ సినిమాతో కొత్త విషయాల్ని నేర్చుకుంటూనే ఉంటాను. నాకు కొణిదెల ఫ్యామిలీ, పింక్ ఎలిఫెంట్ ఫ్యామిలీ రెండూ సమానమే. నా మీద నమ్మకం పెట్టుకుని, నాకు ఫ్రీడం ఇచ్చిన నా తల్లిదండ్రులకు థాంక్స్. రమేష్‌గారు మొదటి నుంచి మాకెంతో సపోర్ట్ చేస్తూ ఉన్నారు. అనుదీప్ గారికి అద్భుతమైన మ్యూజిక్ టాలెంట్ ఉంది. రాజు గారి విజువల్స్ గురించి అందరూ మాట్లాడుకుంటారు. విజయ్ మాస్టర్ గారిని సెట్లో చూస్తే మా నాన్న గారిని చూసినట్టే అనిపిస్తుంది. అన్వర్ అలీ గారు కేవలం ఎడిటర్‌గా కాకుండా అన్ని బాధ్యతల్ని చూసుకుంటారు. నాన్న గారి వల్ల నాకెంతో మంది పరిచయమయ్యారు. అందులో గెటప్ శ్రీను ఒకరు. ఆయన నన్నెంతో జాగ్రత్తగా చూసుకుంటారు. నయన్‌లో ఓ ప్రత్యేకత ఉంది. ఆమె చాలా మంచి వ్యక్తి. సంగీత్ షైనింగ్ స్టార్. 'రాకాస' చిత్ర విజయంలో సంగీత్‌కి సింహభాగం దక్కుతుంది. మేం నిజాయితీతో వంద శాతం కష్టపడి ఓ మంచి సినిమాని చేశాం. మా పింక్ ఎలిఫెంట్‌లో పని చేసిన ప్రతీ ఒక్కరికి సొంతిల్లు, కారు ఉండాలి. ఫ్యామిలీతో ట్రిప్స్‌కి వెళ్తుండాలి. అదే నా లక్ష్యం. ఏప్రిల్ 3న రాబోతోన్న 'రాకాస' ఆద్యంతం వినోదభరితంగా ఉంటుంది' అని అన్నారు.

## అనుష్క శెట్టి కథనార్ ట్రైలర్



గోకులం మూవీస్ బ్యానర్ మీద గోకులం గోపాలన్ నిర్మాతగా రొజిన్ థామస్ తెరకెక్కించిన చిత్రం 'కథనార్'. ఈ సినిమాలో జయసూర్య, అనుష్క శెట్టి, ప్రభుదేవా, సనూప్ సాన్ వంటి వారు కీలక పాత్రల్ని పోషించారు. ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు. 'విజ్ఞానం యొక్క రూపం మూలం ఎలా ఉన్నా కూడా.. కాంతార్ శాలయలో దాన్ని ఆహ్వానిస్తారు.. ఇంద్రజాలాన్ని నేను నమ్మను.. అవగాహనతో రహస్య మార్గాలలో వాళ్లు దాన్ని పరిశోధిస్తున్నారు.. ఎవరి ఊహకి అందని.. అందరూ ఆశ్చర్యంతో చూసే ఒక మాయా జాలం.. మన ఆత్మతో కలిసి మన జ్ఞాపకాలతో ఐక్యం కాబోయే ఒక సంఘటన.. చేర మహారాజుకి కుంచమున్ తరుపున శుభాకాంక్షలు'.. 'చూసినది విన్నది ఏదీ రాదు.. వచ్చేది ఒక్కటే.. ఆపత్కాలంలో వచ్చే మహా మనిషి అగ్ని ఒక్కటే'.. 'కరం కలిస్తే ఆప్యాయిత.. కరం వెడిస్తే నాశనమే బలం'.. 'ఒక శరీరాన్ని అదుపు చేసే ఎక్కువ శక్తిని మీరు నియంత్రించగలిగారు.. ఎలాగా?'.. 'మేం చెప్పేది నమ్మండి. వేనాడు ఆపదలో ఉంది'.. 'మాయ.. ప్రపంచమే మాయ' అంటూ సాగిన డైలాగ్స్‌తో ట్రైలర్ అద్భుతంగా ఉంది.

## ఏప్రిల్ 10న పల్లిచట్టంబి



మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ "పల్లిచట్టంబి". ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. "పల్లి చట్టంబి" సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీ ఏప్రిల్ 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ ప్రెస్ మీట్ ను హైదరాబాద్ లో నిర్వహించారు.



## 4 రోజుల్లో రూ.3.73 కోట్లు

కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటించిన తమిళ మూవీ "యూత్". తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని ఈ 2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. మంచి యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన "యూత్" మూవీకి తెలుగు ప్రేక్షకుల ఘన విజయాన్ని అందించారు. ఈ సినిమా 4 రోజుల్లో వరల్డ్ వైడ్ 3.73 కోట్ల రూపాయల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఈ మూవీ యూత్ ఎంజాయ్ చేసే ఎంటర్ టైన్ మెంట్ తో పాటు ఫ్యామిలీ ఆడియెన్స్ కు నచ్చే మంచి ఎమోషన్స్ తో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటోంది. ఫస్ట్ వీక్ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి నెంబర్స్ క్రియేట్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## ఏప్రిల్ 17న కాల గమనం



పిపిఆర్ ఫిలిమ్స్ పతాకంపై రాజా బిరుదుల, లావణ్య రామారావు, చినబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కాల గమనం'. సుధాకర్ బుర్రి దర్శకత్వం వహిస్తూ, నిర్మిస్తోన్న ఈ లవ్ అండ్ యూత్ ఫుల్ ఎంటర్టైన్మెంట్ చిత్రం ఏప్రిల్ 17న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదలయ్యేందుకు ముస్తాబైంది. ఇప్పటికే నిర్మాత ఏఎమ్ రత్నం విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ ట్రెమండస్ రెస్పాన్స్‌ను సొంతం చేసుకుంది. ఏప్రిల్ 17న ఈ సినిమా విడుదలవుతుందని చెబుతూ చిత్రయూనిట్ రిలీజ్ డేట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా దర్శక,నిర్మాత సుధాకర్ బుర్రి మాట్లాడుతూ.. ''లెజెండరీ ప్రొడ్యూసర్ ఏఎమ్ రత్నం గారు మా చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆ పోస్టర్ చాలా మంచి స్పందనను రాబట్టుకుంది. ప్రస్తుతం సినిమాకు సంబంధించి అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఏప్రిల్ 17న ఈ చిత్రాన్ని గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం. యూత్ మెచ్చే ఓ మంచి ప్రేమకథ ఇది. అదేవిధంగా పెద్దలను పిల్లలను ఆలోచింప చేసే సందేశాత్మక చిత్రమిది.అతి త్వరలోనే టీజర్ విడుదల చేయనున్నాము. ఇకపై వరుసగా ప్రమోషనల్ కంటెంట్ వదులుతూ, కార్యక్రమాలు చేయనున్నాం. ఈ జర్నీలో నాకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. కచ్చితంగా ఈ సినిమా ప్రేక్షకులను మెప్పిస్తుందని నమ్మకంగా చెప్పగలం'' అని తెలిపారు.

## #SVC63 లో హీరోయిన్‌గా నయనతార

#SVC63 చుట్టూ హైప్ రోజు రోజుకీ పెరుగుతోంది, ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మరింత బిగ్ స్కేల్ కి చేరుకుంది. నిన్నటి భారీ అనౌన్స్‌మెంట్ తో ఇప్పటికే భారతీయ సినీ ఇండస్ట్రీలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ వంశీ పైడిపల్లి, ప్రతిష్టాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సక్సెస్ ఫుల్ నిర్మాత దిల్ రాజు కలసి హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా చేయబోతున్నారు.

ఈ అంచనాలను మరింత పెంచుతూ, లేడీ సూపర్ స్టార్ నయనతార ఈ సినిమాలో హీరోయిన్‌గా అధికారికంగా చేరినట్లు మేకర్స్ ప్రకటించారు. బాలీవుడ్‌లో తన బ్లాక్‌బస్టర్ ఎంట్రీగా నిలిచిన జవాన్ తర్వాత, నయనతార ఈ ప్రాజెక్ట్‌లో చేరడం సినిమాకు మరింత బజ్ తీసుకువచ్చింది. దర్శకుడు వంశీ పైడిపల్లి తన సినిమాల్లో హీరోయిన్ పాత్రలను బలంగా చూపించడంలో ప్రసిద్ధి. ఈ కథలో కూడా హీరోయిన్ పాత్ర కీలకంగా ఉండటంతో, నయనతార లాంటి పవర్ ఫుల్ నటిని ఎంపిక చేయడం ప్రత్యేకంగా నిలుస్తోంది. సల్మాన్ ఖాన్ - నయనతార జంట ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం, స్టార్ పవర్, స్కేల్, స్ట్రాంగ్ స్టోరీటెల్లింగ్.. ప్యాకేజ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రతి అప్డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి.

ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, 2027లో థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. #SVC63 2027లో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటిగా నిలుస్తోంది.





## యువత రెడీనా?

టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్, నటుడు తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'గాయపడ్డ సింహం'. విలక్షణమైన కథాంశంతో దర్శకుడు కశ్యప్ శ్రీనివాస్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో తరుణ్ భాస్కర్ సరసన 'జాతి రత్నాలు' ఫేమ్ ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి కాంబినేషన్ అనౌన్స్ చేసినప్పటి నుండే మూవీపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కథాంశం చాలా ఆసక్తికరంగా ఉండబోతోందని సమాచారం. ప్రస్తుత యువత ఎదుర్కొంటున్న అమెరికా వీసా కష్టాలు, ఆ క్రమంలో తలెత్తే సమస్యలు, యువతలో వచ్చే ఆగ్రహం వంటి అంశాలతో ఒక పక్కా క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా దీనిని రూపొందిస్తున్నారు. సమాజంలోని సీరియస్ సమస్యను కామెడీ జోడించి చెప్పబోతుండటం విశేషం. ప్రస్తుతం షూటింగ్ పనులు శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని సమ్మర్ కానుకగా మే 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది.

## నా క్యారెక్టర్ కొత్తగా ఉంటుంది




చార్మింగ్ స్టార్ శర్వా, అభిలాష్‌రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన హైఆక్టేన్ రేసింగ్ డ్రామా 'బైకర్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ అడ్వంచరస్ చిత్రంగా రూపొందుతున్న బైకర్ డాల్బీ సినిమా, ఈపీఐక్యూ, 4డీఎక్స్, పీసీఎక్స్ వంటి ప్రీమియం ఫార్మాట్లలో విడుదల కానుంది. ఈ చిత్రంలో సీనియర్ హీరో రాజశేఖర్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే గ్లింప్స్‌లు, పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఏప్రిల్ 3న ఈ సినిమా థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో రాజశేఖర్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**మీరు హీరోగా నటించిన సినిమా వస్తున్నప్పుడు ఉన్నంత టెన్షన్ ఉందా లేదా రిలాక్స్డ్ గా ఉన్నారా ?**

చాలా రోజుల తర్వాత నేను చేసిన సినిమా రిలీజ్ అవుతోంది. నేను బాగా ఇష్టపడి చేసిన సినిమా బైకర్. ఎప్పుడు ఏప్రిల్ 3 వస్తుందా అని ఎదురు చూస్తున్నాను. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న కొద్ది చాలా ఆనందంగా ఉంది. నేను నటించిన సినిమా ఇది. నా సినిమాలానే ఎప్పుడు రిలీజ్ అవుతుంది? ఆడియన్స్ ఎంతలా మెచ్చుకుంటారు? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.

**ఈ సినిమా మీరు యాక్సెప్ట్ చేయడానికి ప్రధాన కారణం ఏమిటి ?**

ముందుగా నేను ఏ క్యారెక్టర్ చేసిన అది బాగుండాలి, నాకు నచ్చాలి. అప్పుడే నేను చేయగలుగుతాను. అలాగే క్యారెక్టర్ బాగుంటే సరిపోదు. సినిమా కూడా అద్భుతంగా ఆడాలి. కథ బాగుండాలి. నేను బైకర్ కథ విన్నప్పుడు నా క్యారెక్టర్, కథ రెండు నచ్చే ఈ సినిమా చేశాను. బైకర్ కథ పరంగా సూపర్ గా హిట్ అవుతుంది. అలాగే నా క్యారెక్టర్ కూడా అద్భుతంగా వచ్చింది. సినిమా రిలీజ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను.

**మీకు బైక్స్ అంటే పర్సనల్ గా ఇష్టమా?**

నాకు చిన్నప్పటినుంచి బైక్స్ అంటే చాలా ఇష్టం. మా అమ్మమ్మ గారింట్లో ఒక బుల్లెట్ బండి ఉండేది. నేను సెలవుల్లో అక్కడికి వెళ్ళిన ప్రతిసారి ఆ ఊరు మొత్తం బుల్లెట్లో తిరిగేవాడిని. ఆ తర్వాత బైక్స్ మీద ఆసక్తి పెరుగుతూ వచ్చింది. శేషు సినిమా సమయంలో స్వయంగా నేనే యమహా సిక్స్ ఫిఫ్టీ సిసి బండి కొనుక్కొని ఆ షూటింగ్ కి వాడడం జరిగింది. ఆ తర్వాత అదే బైక్ ని రోజు నడుపుకునేవాడిని. నేను నడిపే విధానం చూసి 'మీరు చాలా రిస్క్ తో నడుపుతున్నారని నాకు తెలియకుండానే జీవిత ఆ బైక్ అమ్మేశారు (నవ్వుతూ) బైకర్ లో నా క్యారెక్టర్ పేరు బుల్లెట్ సునీల్. ఈ క్యారెక్టర్ గురించి పూర్తి వివరాలు మీరు సినిమాలోనే చూడాలి.

**డైరెక్టర్ అభిలాష్ రెడ్డి గురించి ?**

అభిలాష్ గారు చాలా మంచి డైరెక్టర్. ఒక యాక్టర్ నుంచి ఎలాంటి పర్ఫార్మెన్స్ కావాలో ఆయనకి చాలా క్లారిటీ ఉంటుంది. ఆయన కథ మీద క్యారెక్టర్ మీద చాలా గ్రిప్ ఉన్నా దర్శకుడు . ఆయన అనుకునది వచ్చేంతవరకు ఎక్కడ కూడా రాజీపడరు. చాలా ఇన్వాల్వ్మెంట్ ఉన్న డైరెక్టర్. ఈ క్యారెక్టర్ కి సంబంధించి ఆయన ప్రతి విషయంలో చాలా క్లారిటీగా ఉన్నారు. ఈ సినిమాలో నన్ను చాలా కొత్తగా చూపించారు. డైరెక్టర్ విజన్. కథ వల్లే అది సాధ్యపడింది. సినిమా చూసిన ప్రేక్షకులు కచ్చితంగా నా క్యారెక్టర్ ని అభినందిస్తారు. ఇందులో బైక్ రేసింగ్ సీన్స్ అద్భుతంగా ఉంటాయి. ఒక హాలీవుడ్ రేంజ్ సినిమాలా ఉంటుంది. అలాగే ఫాదర్ సన్ ఎమోషన్ కూడా అద్భుతంగా ఉంటుంది. చాలా సెంటిమెంట్ సీన్స్ ఉన్నాయి.

**సినిమా మీరు చూశారా ?**

ఇంకా లేదండి. రిలీజ్ రోజు అందరితో కలిసి థియేటర్ లో చూడాలని వెయిట్ చేస్తున్నాను.

**యువి క్రియేషన్స్ గురించి ?**

యూవీ క్రియేషన్స్ అంటే రాయల్ ట్రీట్మెంటు. ఎక్కడ ఖర్చుకి వెనకాడరు. ఈ సినిమాని హాలీవుడ్ క్వాలిటీతో తీసి ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. సబ్జెక్టు కోసం క్వాలిటీ కోసం ఎక్కడ రాజీ పడకుండా ఖర్చు చేశారు. ఈ విషయంలో వారిని అభినందించాలి. తప్పకుండా ఈ సినిమా పెద్ద విజయం సాధించి వాళ్ళు పెట్టిన ఖర్చు తిరిగి రావాలని కోరుకుంటున్నాను. ఖచ్చితంగా ఈ సినిమా సూపర్ హిట్ అవుతుంది.

Printed, Published & Owned by Sirikonda Maria, Printed at Sri Rama Avadutha Offset, 9-2-57, Mayuri Centre, Khammam - 507001 and Published from H. No. 10-6-77, Mamillagudem, Khammam - 507001, Telangana.
Editor : Sirikonda Maria, RNI No. APTEL/2013/53008. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676.